కలనెరవేరి.. కొలువుదీరి



ఉపాధ్యాయ నియామక పత్రాలను బుధవారం ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి అభ్యర్థులకు అందించారు. ఎన్నోఏళ్ల కల సాకారమైందని వచ్చిన అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.

చదువొక్కటే కాదు.. ఎన్నెన్నో

ఐఐటీ తరహాలో జేఎన్‌టీయూలో విద్యార్థుల క్లబ్‌లు

ఆసక్తి ఉన్న రెండు అంశాల్లో నిష్ణాతులయ్యేలా రూపకల్పన



ఈనాడు, హైదరాబాద్, కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

“విషయం అర్థంకాకుండా రాత్రింబవళ్లు పుస్తకాలు చదివితే ఆయాసం తప్ప మరేం రాదు. అందుకే ఓ గంట సేపు నృత్యం చేయండి. పాటలు పాడండి. తీరొక్కపూలతో బతుకమ్మ చుట్టూ ఆడండి. . గదిలో మీరొక్కరే ఉన్నా రనుకుని మీకిష్టమైన రాగంలో పాట పాడండి'' అని జేఎన్‌టీయూ అధికారులు ప్రథమ సంవత్సరం విద్యార్థులతో చెబుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) తరహాలో విద్యార్థుల అభిరుచులకు అనుణంగా 12 క్లబ్‌లను ఏర్పాటుచేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు క్లబ్‌ల్లో రెండింటిని తప్పనిసరిగా ఎంచుకోవాలి. బాగా నేర్చుకున్నాక సదరు విద్యార్థులకు క్రెడిట్ పాయింట్లు ఇవ్వనున్నారు. సమకాలీన అంశాలపై విద్యార్థుల మనోగతాన్ని తెలుసుకోనున్నారు. ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి కనీసం రెండు క్లబ్‌లలో వారు నేర్చుకున్న అంశాల్లో నిష్ణాతులుగా మారనున్నారని జేఎన్‌టీయూ అధికారులు చెబుతున్నారు.

మీకు నచ్చిందే నేర్చుకోండి

ఐఐటీల్లో ఇంజినీరింగ్ తొలి సంవత్సరంలో చేరే విద్యార్థులు దేశం నలుమూలల నుంచి వస్తున్నారు. వీరికి ఆహారం, వసతి అన్నీ భిన్నంగా ఉంటాయి. కొత్తలో తరగతులకు వెళ్లినా ఇబ్బందులే. వీటన్నింటినీ వారు అధిగమించేందుకు క్లబ్‌లను ఏర్పాటుచేశారు. ఇవి సత్ఫలితాలిస్తుండటంతో ఇక్కడ 12 క్లబ్‌లను ఏర్పాటుచేశారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ భ్రమర.. వీటిని పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా ‘ఆర్ట్ మేకరీ,’ ఎలైట్ ఫీట్, రాగవర్ష, కోడింగ్ క్లబ్, ఫొటోగ్రఫీ వంటి అంశాల్లో రెండింటిని ఎంపిక చేసుకోవాలి.

ఇష్టంగా చదవాలన్న లక్ష్యంతో

విద్యార్థులు వారి సబ్జెక్టులు ఇష్టంగా చదవాలన్న లక్ష్యంతో ఈ క్లబ్‌లను ప్రారంభించాం. చదువుతోపాటు చుట్టూ ఉన్న ప్రపంచం వారికి తెలియాలి. ప్రథమ సంవత్సరం పూర్తయ్యేలోపు ఆల్ రౌండర్‌గా ఎదగాలన్నదే మా ధ్యేయం. ప్రతి క్లబ్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఇంటర్ వరకు భయపడుతూ చదివే పిల్లలకు.. ఇంజినీరింగ్‌లో ఒకేసారి అపరిమిత స్వేచ్ఛ లభిస్తుంది వీరి ఆలోచనలను సరైన దిశలో మళ్లించేందుకు క్లబ్‌లను ప్రారంభించాం.

– ప్రొఫెసర్ భ్రమర, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం

సంగీతం, చిత్రలేఖనం, ఛాయాచిత్రం

జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థుల్లో చాలామంది సంగీతం, చిత్రలేఖనం, ఛాయాచిత్రాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారని అధికారులు తెలిపారు. చరవాణుల్లో ఫొటోలు తీసి వాటికి ప్రత్యేకతలను అదనంగా జత చేర్చినట్లే ఫొటోగ్రఫీ క్లబ్‌లో ఫొటోలను సృజనాత్మకంగా తీస్తున్నారు. ఇందులో సాంకేతిక అంశాలను వివరించేందుకు ఫొటోగ్రాఫర్లతో తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు సంగీతం, చిత్రలేఖనం అంశాల్లోనూ శిక్షణ ఇవ్వనున్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులకు ఈ క్లబ్‌లలోనే ‘కృత్రిమ మేధ’ ‘కోడింగ్’ ‘డేటా సైన్స్’ ‘ఏసీఈ’ వంటి క్లబ్బులను ఏర్పాటుచేసి శిక్షణ ఇవ్వనున్నారు. సంగీతం, చిత్రలేఖనం, నృత్యం వంటి అంశాల్లో పోటీ పరీక్షలు నిర్వహించి ప్రోత్సాహకంగా చిన్నచిన్న బహుమతులను అందజేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు పి.పి.వావా సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ ఆమ్రపాలి, ఆయా విభాగాల అధికారులు, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై పారిశుద్ధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు. బీమా సౌకర్యం, పీ.ఎఫ్, ఈఎస్ఐ వర్తించేలా చూడాలన్నారు. కమిషన్ సలహాదారుడు వీరేంద్రనాథ్, అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, పంకజ, నళిని పద్మావతి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు, శానిటేషన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గంటకు 10-12 వేల మంది ప్రయాణికులు

- నాగోల్..శంషాబాద్ మెట్రో కారిడార్‌లో అధిక రద్దీ
- అంచనా వేసిన సీఎంపీ ● కేంద్రం ఆమోదానికి ఇదే కీలకం



ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశ డీపీఆర్‌లో పొందుపర్చిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ)లో ట్రాఫిక్ అంచనాలు కీలకంగా మారాయి. ఐదు కారిడార్లలో ప్రతి దిశలోనూ రద్దీ వేళల్లో ట్రాఫిక్‌ను తెలిపే పీక్ అవర్ పర్ డైరెక్షన్ ట్రాఫిక్(పీహెచ్‌పీడీటీ) పదివేల నుంచి 12వేల వరకు ప్రయాణికులు ఉంటారని సీఎంపీ అంచనా వేసింది. ఐదింటిలోనూ విమానాశ్రయ కారిడార్‌లోనే ఎక్కువ రద్దీ ఉండనున్నట్లు నివేదికలో పేర్కొంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాకి సంబంధించిన సీఎంపీని హెచ్ఎండీఏ కన్సల్టెన్సీల సాయంతో రూపొందించింది.

మదింపు చేశాకే..

చాలా రాష్ట్రాల్లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య ఐదువేల నుంచి 20వేల మధ్యలోనే ఉంది. నిర్వహణ భారంగా మారుతోంది. దీంతో డీపీఆర్‌లను, సీఎంపీని పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ క్షుణ్ణంగా మదింపు చేస్తోంది. రద్దీవేళల్లో ప్రతి దిశలో ప్రయాణికుల సంఖ్యను సీఎంపీ ఆధారంగా పరిశీలిస్తుంది.

నగరంలోని కారిడార్లలో పీహెచ్‌పీడీటీ ఇలా..

- నగరంలోని మెట్రోరైలు రెండోదశ మొదటి భాగంలో ఐదు కారిడార్లు ఉన్నాయి. మూడో కారిడార్ నాగోల్ నుంచి ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు ప్రతిపాదించారు. ఈ మార్గంలో రద్దీ వేళల్లో పీహెచ్‌పీడీటీ 12వేలుగా అంచనా వేశారు.
- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, విమానాశ్రయ మార్గంలో పదివేలకు పైగా..
- రాయదుర్గం నుంచి కోకాపేట నియోపోలిస్ వరకు పదివేలకు మించి..
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు కారిడార్-6, 7లలో పీహెచ్‌పీడీటీని పదివేలుగా అంచనా వేశారు.








ఇంతులు ఆడగా... బతుకమ్మ మురవగా..

బతుకమ్మ సంబరాలు వేడుకగా జరుగుతున్నాయి. 1. జీహెచ్ఎంసీ కార్యాలయ ప్రాంగణంలో మేయర్ విజయలక్ష్మి, ఉప మేయర్ శ్రీలత, కార్పొరేటర్లు బతుకమ్మ ఆడారు. 2.రాయదుర్గం టీహబ్‌లో పిలిప్పీన్స్ రాజు సోదరి మారియా అమోర్ లియోనార్ టోరెస్ మస్బురా సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 3. సైబరాబాద్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో జరిగిన సంబరాల్లో డీసీపీలు బి.శ్రీబాలాదేవి, సాయిశ్రీ, సృజన కర్ణం తదితరులు ఆడిపాడారు.

పెళ్లి బాజా.. ఖర్చుల మోత

వచ్చే మూడు నెలలు 5 వేల వివాహాలు

రూ.625 కోట్లకు పైగా వ్యాపారం



ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్‌లో పెళ్లి సందడి మొదలైంది. మూడు నెలల పాటు మంచి ముహూర్తాలే ఉండటంతో పెళ్లి వేదికల బుకింగ్‌లు, కేటరింగ్, దుస్తులు, బంగారం కొనుగోళ్లతో వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. వివాహమనేది జీవితంలో మరుపురాని ఘట్టం కావడంతో కలకాలం గుర్తిండిపోయేలా.. అందరూ గుర్తుంచుకొనేలా చేయాలనుకుంటున్నారు.

- దేశవ్యాప్తంగా 48 లక్షల పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. వీటి కోసం రూ.6 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ సర్వేలో వెల్లడించింది. ఇందులోని వివరాల ప్రకారం గ్రేటర్‌లో ఈ సీజన్‌లో 5 వేల పెళ్లిళ్లు జరుగుతుండగా...రూ.625 కోట్లకు పైగా వ్యాపారం జరగనుంది.
- పెళ్లిళ్ల ఖర్చులు సగం సగమంటూ ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇలా 59శాతం పెళ్లిళ్లలో జరుగుతోందని ‘వెడ్ మి గుడ్’ అనే సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. 32శాతం మంది సొంతంగానే ఖర్చులు భరిస్తున్నట్టు వెల్లడించింది.
- నిశ్చితార్థం నుంచి మొదలుకొని పెళ్లితంతు ముగిసే వరకు డెకరేషన్ చేసేవాళ్లు, డీజే సంగీతం, బ్యాండ్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, శామియానా, పురోహితులు, కేటరింగ్, పత్రికలు, దుస్తులు, బంగారం కొనుగోళ్లు, మేకప్, మెహందీ ఆర్టిస్టులు ఇలా అనేక మందికి ఉపాధి దొరుకుతోంది.

అన్నీ పెరిగాయ్..

గతంతో పోల్చితే అనేక విభాగాల్లో ఖర్చులు పెరిగాయి. పెళ్లి వేదికల ఖర్చు గతంలో రూ.50వేల నుంచి రూ.7-8లక్షల వరకు ఉండగా ప్రస్తుతం రూ.75వేల నుంచి రూ.10లక్షలకు పెరిగింది. ప్లేటు భోజనానికి గతంలో రూ450 - రూ.1000 ఉంటే అది రూ.700 - రూ.1500 వరకు పెరిగింది. కూరగాయలు, నిత్యవసరాల ధరలు పెరగడంతో ప్లేటు భోజనానికి అయ్యే ఖర్చు పెరిగిందని కేటరింగ్ సేవల ప్రతినిధులు తెలిపారు.

భోజనం ‘ఆహా’ అనిపించేలా...

భోజనాల్లో కనీసం 15 నుంచి 20 రకాలు అందుబాటులో ఉండాలని ఎక్కువ మంది భావిస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కేటరింగ్ సర్వీసుల వాళ్లు ఇరువర్గాలకు సంబంధించి ఐదు నుంచి పది మందిని పిలిచి వేర్వేరు వంటకాలను అప్పటికప్పుడు వండి రుచి చూపిస్తున్నారు. శాకాహారంలో.. ఉత్తర, దక్షిణ భారతదేశ వంటకాలను ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. వెజ్ స్టార్టర్లలో పనీర్, మంచూరియా ఉండాలని కోరుతున్నారు, వెజ్ బిర్యానీ, బొబ్బట్లు, పనీర్ కూర, మూడు పచ్చళ్లు, ఇతర కూరగాయలు, ఉలవచారు, సాంబార్, రైతా, రెండు నుంచి మూడు పొడులు, ఐస్‌క్రీమ్, ఖద్దూ కా కీర్, గులాబ్ జామూన్, ఖుబానీ కా మీఠా, వీటితో పాటు పానీపూరీ, ఇడ్లీ, దోశ వంటి అల్పాహారం ఉండాలని కోరుతున్నారు. మాంసాహారంలో మటన్, చికెన్, చేపలు, రొయ్యలతో చేసిన 3 నుంచి 4 వెరైటీలు ఉండేలా చూసుకుంటున్నారు.

ముందస్తుగా విపత్తుల సమాచారం



వివరాలు వెల్లడిస్తున్న రంగనాథ్, శ్రీనివాస్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కుండపోత వానలు, పిడుగుపాటు ఘటనలు, ఈదురు గాలులతో తలెత్తే సమస్యల నివారణపై హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ దృష్టి పెట్టారు. కర్ణాటక రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ కేంద్రం మాజీ డైరెక్టర్ డా.జి.ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. “వాతావరణ మార్పులతో కొన్నేళ్లుగా వానలు, గాలులు విపరీతమయ్యాయి. నెలలో కురవాల్సిన వాన ఒకే రోజులో, రోజంతా కురవాల్సిన వాన కొన్ని గంటలు లేదా నిమిషాల్లో పూర్తవుతోంది. కాలనీలు, రోడ్లు నీట మునుగుతున్నాయి. వాటి నుంచి ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తోన్న ఉత్తమ విధానాలను పరిశీలిస్తాం. వీలైనంత తక్కువ విస్తీర్ణానికి ప్రత్యేకంగా వాతావరణ సమాచారం రూపొందించాలని నిర్ణయించాం. వాతావరణశాఖ, ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే నగరంలోని 150 డివిజన్లలో వర్షపాత నమోదు కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నాలాల్లో వరదనీటి మట్టాన్ని తెలియజేసేలా బెంగళూరు నగరపాలక సంస్థ సెన్సర్లను అమర్చింది. వాటి ప్రయోజనాన్నీ పరిశీలిస్తాం. అలుగులను, గొలుసుకట్టు వరద నాలాలను పునరుద్ధరిస్తాం.”అని వివరించారు.

క్యూ లేకుండా.. ‘కి’యోస్కులు

నిమ్స్‌లో ఓపీ సేవలకు ఊరట ● దసరా నుంచే ప్రారంభానికి సిద్ధం



ఈనాడు, హైదరాబాద్: నిమ్స్ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్(ఓపీ) విభాగాల వద్ద క్యూలు చూస్తేనే రోగులకు సగం నీరసం వచ్చేస్తుంది. ఓపీ లభించినా వైద్యుడి పిలుపు అందుకునే సరికి మధ్యాహ్నం దాటుతుంది. ఇక టెస్టులు రాస్తే.. ఫలితాలు వచ్చేది సాయంత్రమే. మళ్లీ వైద్యుడికి చూపించుకోవడానికి రెండో రోజు వరకు ఆగాల్సిందే. చాలా మంది క్యూలు చూసి వెనుతిరుగుతున్న సందర్భాలు అనేకం. నిమ్స్‌లో 30వరకు విభాగాలు ఉండగా...నిత్యం 2వేల మంది ఓపీ సేవల కోసం వస్తుంటారు. సోమ, మంగళ, బుధవారాల్లో ఓపీ విభాగాలు కిటకిటలాడుతుంటాయి. ఇక వీరికి ఉపశమనం లభించనుంది. విజయదశమి సందర్భంగా ఓపీ విభాగాల వద్ద కొత్తగా కియోస్కోలను అందుబాటులోకి తేనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. తొలుత నాలుగు ప్రాంతాల్లో అందుబాటులోకి రానున్నాయి.

ఆన్‌లైన్‌లో.. అనువైన సమయంలో..

ఉద్యోగ ఇతర బాధ్యతల వల్ల కొందరికి అనారోగ్యం ఉన్నప్పటికీ వైద్యునికి చూపించుకోవడానికి సమయం దొరకదు. కొన్నిసార్లు సమయం ఉన్నా సరే.. వైద్యుడు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి. ఆసుపత్రికి వెళ్తే వెనుతిరగాల్సి వస్తుంది. ఇలాంటి వారి కోసం ఆన్‌లైన్ ఓపీ సేవలు ప్రవేశపెట్టనున్నారు. నిమ్స్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈ సేవలు పొందవచ్చు.

కాలం ఏదైనా.. అరకొరే జలం

- గంటసేపు ఇస్తున్నామంటూ అధికారుల మాయాజాలం
- శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తాగునీటి ఇబ్బందులు



దుండిగల్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి ట్యాంకర్‌తో నీటి సరఫరా

ఈనాడు,హైదరాబాద్, మూసాపేట, దుండిగల్, తుర్కయాంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: నగర శివారులో ప్రాంతాల్లో కాలమేదైనా తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. హైదరాబాద్‌కు సమీపంలో ఏడు కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీల్లో అధికారులు రెండ్రోజులకోసారి ఇస్తున్నామని చెబుతున్నా అదీ అరొకరే. ఈ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి, మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరా కోసం రూ. 1790 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఫిబ్రవరి, 2022లో పనులు ప్రారంభించారు.. అదే ఏడాది అక్టోబరులో పనులు పూర్తి కావాల్సి ఉండగా... రెండున్నరేళ్లు గడిచినా కొన్నిచోట్ల పైప్‌లైన్ల పనులు, ఓవర్‌హెడ్‌ట్యాంకుల నిర్మాణం కొనసాగుతూనే ఉంది. నిజాంపేట, దుండిగల్, తుర్కయాంజాల్‌లలో నివసిస్తున్న ప్రజలు ఇప్పటికీ ట్యాంకర్లతో తాగునీటిని తెప్పించుకుంటున్నారు.

తక్కువ ఒత్తిడితో గంటసేపు..

నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్ పరిధిలో మొత్తం 27,850 కుళాయి కనెక్షన్లున్నాయి. రెండ్రోజులకోసారి 10 నుంచి 12 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్‌డే) గ్యాలన్ల తాగునీరు అవసరం. అధికారులు మాత్రం 4 నుంచి 5 ఎంఎల్‌డీల నీటిని మాత్రమే రోజుకు సరఫరా చేస్తున్నారు. గంటసేపు ఇస్తున్నామని చెబుతున్నా తక్కువ ఒత్తిడితో వస్తోంది. ఎక్కడికక్కడ గేట్‌వాల్వ్‌ను తక్కువ స్థాయిలో తిప్పి పెట్టి అదే విధానాన్ని నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ఇక్కడ నివాసముంటున్న ప్రజలు రెట్టింపు ధరలకు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి. నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్‌లోని ఫిల్లింగ్ కేంద్రాల ద్వారా ప్రస్తుతం రోజుకు 600 ట్యాంకర్లను విక్రయిస్తున్నారు. ప్రజలకు సగం మాత్రమే సరఫరా చేస్తూ వ్యాపారులకు మాత్రం కోరినన్ని ట్యాంకర్లను ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ట్యాంకులున్నాయి... నీళ్లు లేవు...

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో తాగునీటి అవసరాల కోసం కోసం గతేడాది ఆగస్టులో జలమండలి ఆధ్వర్యంలో ప్రారంభించిన పనులు ఇంకా పూర్తికాలేదు. అన్నీ గ్రామాలకు పైపులైన్ల ఏర్పాటు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అసంపూర్తిగా ఉన్నాయి. తొర్రూర్‌లో నిర్మించిన 50లక్షల లీటర్ల ట్యాంకు పనులు పూర్తయ్యాయి. ఇందులో నీళ్లు లేవు. తుర్కయంజాల్ గ్రామంలో కాశంగుట్ట వద్ద 25 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు పనులు పూర్తికాలేదు. ఇక్కడ 90శాతం పనులు పూర్తయినట్లు, నెలరోజుల్లో ట్రయల్‌రన్ పూర్తిచేసి ప్రజలకు నీరందిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అవసరమైన సామర్థ్యం మేరకు కృష్ణానీటి సరఫరా లేకపోవడంతో మున్సిపాలిటీలోని కాలనీల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి.

ట్యాంకర్లతో నెట్టుకొస్తున్నారు...

దుండిగల్ మున్సిపాలిటీలో ప్రజలకు సరిపడా తాగునీటిని అధికారులు సరఫరా చేయడంలేదు. దీంతో చాలా ప్రాంతాల్లో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని తెప్పించుకుంటున్నారు. దీంతో పాటు జేఎన్ఎన్‌యూఆర్ఎం, సాయిపూజ, చైతన్య నగర్ కాలనీలకు మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారానీటిని అందిస్తున్నారు. ట్యాంకర్లకు మున్సిపాలిటీ అధికారులు ఏటా రూ.40లక్షలు ఖర్చుచేస్తుండగా... ప్రజలు రూ.30లక్షలు వెచ్చిస్తున్నారు. బౌరంపేట, మల్లంపేట, దుండిగల్, సహా చాలా ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు కొనసాగుతున్నాయి. రోజుకు 11.1ఎంఎల్‌డీల తాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా... 8.8ఎంఎల్‌డీలు మాత్రమే అధికారులు సరఫరా చేస్తున్నారు.

రైస్‌పుల్లింగ్ పేరిట ఘరానామోసాలు

ఈనాడు, హైదరాబాద్ రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: తమ వద్ద ఉన్న పురాతన రాగిపాత్రలో అద్భుత మహిమలున్నాయంటూ అమాయకులను నమ్మించి ఘరానా మోసాలకు తెగబడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.25లక్షల నగదు, రాగిపాత్ర, 7 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పి.సంతోష్‌కుమార్ సికింద్రాబాద్, జి.మంజునాథ్‌రెడ్డి చిత్తూరు జిల్లా కుప్పం, ప్రతాప్ ఎస్ఆర్ అలియాస్ రవీంద్రప్రసాద్ బెంగళూరు.. ముగ్గురు ముఠా కట్టారు.

డీఆర్‌డీవో శాస్త్రవేత్తనంటూ బురిడీ.. సికింద్రాబాద్‌కు చెందిన శశికాంత్‌కు మిత్రుడి ద్వారా మంజునాథ్‌రెడ్డి పరిచయమయ్యాడు. అతడికి తాను రైస్‌పుల్లింగ్ యంత్రంతో రూ.10కోట్లు లాభపడినట్టు వివరించాడు. దాన్ని తన పలుకుబడితో సొంతమయ్యేలా సహకరిస్తానంటూ భరోసానిచ్చాడు. కొద్దిరోజులకు శివసంతోష్‌ను పరిచయం చేశాడు. తన వద్ద ఉన్న రాగిపాత్ర శక్తిని తెలుసుకునేందుకు డీఆర్‌డీవో రూపొందించిన స్కానర్ ద్వారా పరీక్షించుకోవచ్చని సలహా ఇచ్చాడు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా ప్రతాప్‌ను పరిచయం చేశారు. స్కానర్‌పై పరీక్షించేందుకు అడ్వాన్స్‌గా ఈనెల 6న రూ.25లక్షలు తీసుకొని మూడు భాగాలుగా పంచుకున్నారు. బాధితుడు రాగిపాత్రను అడిగితే మరో రూ.25లక్షలు కావాలంటూ మెలికపెట్టారు. అనుమానం వచ్చిన బాధితుడు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

బాధితుల జాబితాలో వ్యాపారులు.. నగరానికి చెందిన వ్యాపారి రూ.2కోట్లు, కరీంనగర్ నివాసి రూ.40లక్షలు, నిజామాబాద్‌లో ఉంటున్న ఒకరు రూ.10లక్షలు రైస్‌పుల్లింగ్ ముఠా చేతిలో మోసపోయినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

నృత్య దర్శకుడు జానీ పిటిషన్‌పై తీర్పు 14న

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీ పెట్టుకున్న బెయిలు పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. కోర్టు అనుమతించిన నాలుగు రోజుల మధ్యంతర బెయిలును నిందితుడే ఉపసంహరించుకున్న నేపథ్యంలో బుధవారం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. తీర్పు కోసం విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

నగరంలో ‘అలయ్-బలయ్’ 13న

అమీర్‌పేట, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా 13న నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ‘అలయ్-బలయ్’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అలయ్-బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి తెలిపారు. బుధవారం అమీర్‌పేటలో భాజపా శ్రేణులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏటా దసరాకు మరుసటి రోజు అలయ్-బలయ్ కుల, మత, వర్గ, రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు మేఘాలయ, ఉత్తరాఖండ్‌గవర్నర్‌లు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రానున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడులతో పాటు మల్లు భట్టి విక్రమార్క, పవన్ కల్యాణ్ తదితరులకు ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (బుధవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 63, వంగ 40, బెండ 40, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 21, క్యారెట్ 38, దొండ 40, ఆలు 37, ఉల్లి 34, సొర 19, పొట్ల 18, బీన్స్ 100, గోరుచిక్కుడు 40, చిక్కుడు 55, దోస 28, బీర 45, కాకర 38, చామగడ్డ 37, కీర 45, క్యాప్సికం 70, బీట్‌రూట్ 23, కందగడ్డ 55, చిలకడదుంప 35, మామిడి 105, మునగ 75, ముల్లంగి 7(ఒకటి).

అమీర్‌పేట: టమాటా 63, నల్ల వంకాయ 40, పొడుగు వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 75, క్యాప్సికం 70, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 100, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 22, దోస 28, బీట్‌రూట్ 25, ఉల్లి 45, ఆలు 37, చామ 37, మొరంగడ్డ 28, కంద 55, గోబీ 23, సొర 19, పొట్లకాయ 18, అరటి 9, మునగ 5, మామిడి 115, ముల్లంగి 6, ఉల్లిపొరక 55, వేరుశనగ 50, నిమ్మకాయలు(డజన్) 45.

యూనివర్సిటీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

లాలాపేట: తెలంగాణలోని అన్ని యూనివర్సిటీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్, ఉస్మానియా యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి అందరికీ హెల్త్ కార్డులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ.గద్దం మల్లేశం, ఉపాధ్యక్షుడు డా. వెంకటేశ్వర్లు, ప్రొ.సర స్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఉచిత ఫుట్ స్క్రీనింగ్ పరీక్షలు



సమావేశంలో వైద్య నిపుణులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నవంబరు 20వ తేదీ వరకు మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఉచిత ఫుట్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నామని వైద్య నిపుణులు డా.సుష్మ, డా. జ్ఞానేశ్వర్, డా.సృజన్‌కుమార్, డా.ఉదయ్‌లాల్, వేదాంతం రవికుమార్ తెలిపారు. బుధవారం ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మధుమేహంతో బాధపడేవారు వ్యాధి నియంత్రణ కోసం ఔషధాలు వినియోగించినప్పటికీ కొన్ని సందర్భాల్లో కాళ్లు, వేళ్లు తొలగించాల్సిన ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇటువంటి సమస్య ఎదురుకాకుండా ముందుగానే నిర్వహించే ఫుట్ స్క్రీనింగ్ ద్వారా గుర్తిస్తామని తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

బేగంపేట, న్యూస్‌టుడే: జనహిత సేవా ట్రస్ట్, అప్పా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బేగంపేట డివిజన్‌లోని ఎన్‌బీటీ నగర్ కమ్యూనిటీహాల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో స్థానికులకు ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్, గైనకాలజీ, పెడియాట్రిక్ తదితర అంశాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఆక్రమణలు తొలగించారు సరే.. మరి స్తంభాలు


రోడ్డు మధ్యలోనే మిగిలిపోయిన విద్యుత్తు స్తంభాలు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: న్యూబోయిన్‌పల్లిలోని సెంటర్‌పాయింట్ చౌరస్తా నుంచి మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి ఓవైపు దుకాణాల ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారాలను కొనసాగించేవారు. దీనికితోడు అక్కడికి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఫుట్‌పాత్‌తోపాటు రోడ్డుపైనే పార్కు చేసేవారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆక్రమణలపై తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర మండలం ట్రాఫిక్ ఉన్నతాధికారులు కంటోన్మెంట్ బోర్డుకు లేఖలు రాశారు. స్పందించిన బోర్డు అధికారులు 7న ఆక్రమణలను తొలగించారు. కానీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు.

గతంలో ఇలాగే..

ఈస్ట్ మారేడుపల్లి, సిఖ్‌రోడ్డు ప్రాంతాల్లో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఆయా రహదారులను విస్తరించాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. ఈమేరకు కొన్ని సంవత్సరాల క్రితం ఆయా రోడ్లలోని నిర్మాణాలను కొంతమేర తొలగించారు. బోయిన్‌పల్లి మార్కెట్ నుంచి బాపూజీనగర్ చౌరస్తా వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలకు అరికట్టారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించాలంటు గతంలో బోర్డు అధికారులు విద్యుత్తు శాఖకు లేఖలు రాశారు. కానీ, అందుకు సంబంధించి డబ్బులను చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్తు శాఖ బదులివ్వడంతో బోర్డు అధికారులు మౌనంగా ఉన్నారు. దాంతోఎ రహదారులను విస్తరించడం, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. మళ్లీ ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా స్తంభాలను తొలగించి, నిర్మాణ వ్యర్థాలను తరలించాలని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్తు శాఖకు లేఖలు రాశాము: అశుతోశ్ చౌహాన్, బోయిన్‌పల్లి సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించాం. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తీయాలంటూ ట్రాఫిక్ పోలీసులు, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులకు లేఖ పంపించాము. ఈ మేరకు విద్యుత్తు శాఖ త్వరలోనే స్తంభాలను తొలగించి, భూగర్భ కేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

సీఎంఆర్ఎఫ్ అందజేత


ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్, న్యూస్‌టుడే: అమీర్‌పేట, బేగంపేట డివిజన్లకు చెందిన ఇద్దరు బాధితులకు అత్యవసర వైద్య సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని ఎల్‌వోసీ పత్రాల రూపంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. మారేడుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం బాపూనగర్‌కు చెందిన నజీర్, బేగంపేట ఓల్డ్ పాటిగడ్డకు చెందిన యూసుఫ్‌లకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున సాయాన్ని అందజేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు

రెజిమెంటల్‌బజార్: కొడుకు గృహహింస కేసు పెట్టించిన మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భర్త, అత్తమామలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మహంకాళి పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం నాగోల్‌కు చెందిన పద్మావతి, భానునారాయణ దంపతులు, తన కుమారుడితో కలిసి సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అయితే గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు మెరుగైన చికిత్స కోసం బుధవారం ఆల్విన్ క్రాస్‌రోడ్డులోని శేకర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని పోలీసులు వెల్లడించారు.

సరస్వతీదేవిగా అమ్మ దర్శనం


సరస్వతీదేవి అలంకారంలో సనత్‌నగర్ కనకదుర్గ అమ్మవారు


సరస్వతీదేవి అలంకారంలో..


బేగంపేటలో..


వెంకటేశ్వనగర్‌లో..


ఎంపీ ఈటలకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ చైర్మన్ సుభాష్


బేగంపేట కట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్, నియోజకవర్గాల్లోని ఆలయాల్లో బుధవారం మూల నక్షత్రం సందర్భంగా అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం


ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ నారాయణన్


బోయిన్‌పల్లి: పూజలందుకుంటున్న అమ్మవారు


రాజరాజేశ్వరీ ఆలయంలో సరస్వతి పూజలో విద్యార్థులు


పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో అలంకరించిన ఎల్లమ్మ మూలవిరాట్

ఆదరణ లేదని.. అనువాద పుస్తకాన్ని చెరిపే వేస్తాని

సికింద్రాబాద్: ఐసిస్మాయిల్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన వేయి పడగలు పుస్తకాన్ని ఆమె సంస్కృతంలో రచించి, వెలుగులోకి తీసుకురావడానికి పడిన కష్టానికి ఆదరణ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ మెట్టుగూడకు చెందిన అయ్యగారి ప్రభావతీదేవి గతంలో మహబూబ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ ఎంఫిల్ పూర్తి చేసి అనువాదం చేశారు. అప్పటి ఉస్మానియా యూనివర్సిటీలో సంస్కృత ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె ఐటీసీగా నగరానికి వచ్చి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆ నవలను తాను 2001లో సంస్కృతంలో మొదలుపెట్టి ఆరు నెలల్లో అనువదించానన్నారు. విశ్వవిద్యాలయాలు, సాహితీ వేత్తలుగానీ ఎటువంటి ఆదరణ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మేమున్నాం..మీకు తోడుగా..
ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

న్యూస్‌టుడే, కంటోన్మెంట్

? ఇదో వార్డు పరిధిలో రహదారులు గుంతలమయంగా మారాయి.
– బన్నప్ప, స్థానికుడు

✓ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– ఉమాశంకర్, బోర్డు చీఫ్ ఇంజినీర్

ఫైజాన్ స్కూల్ దారి తెరిపించాలని వినతి


ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న బస్తీ వాసులు

కార్ఖానా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ ఒకటో వార్డులోని పెన్షన్‌లేన్ బస్తీ నుంచి ఫైజాన్ స్కూల్‌కు వెళ్లే మార్గాన్ని తెరిపించాలని బస్తీ వాసులు బుధవారం ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు బుధవారం బస్తీలో పర్యటించిన ఆయనకు పరిస్థితిని వివరించారు. కరోనా సమయంలో ఆర్మీ అధికారులు పాఠశాలకు వెళ్లే మార్గాన్ని మూసివేశారని, సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ తెరవడం లేదని వాపోతున్నారు. అలాగే ప్రత్యామ్నాయంగా ఉన్న రహదారి నిర్మాణానికి రూ.25లక్షల నిధులను మంజూరు చేయాలని కోరారు. రోడ్డు తెరిపించేలా బోర్డు అధ్యక్షుడితో మాట్లాడుతానని, నిధులను మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, రెహమాన్, షరీఫ్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో మాదిగల నిరసన సంతకం


కాన్షిరాం వర్ధంతిలో బీఎస్ఎఫ్ నాయకులు

లాలాపేట, న్యూస్‌టుడే: కాన్షిరాం వర్ధంతిని పురస్కరించుకొని ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద బుధవారం సామాజిక తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోరుతూ మాదిగల నిరసన సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత ఆచార్యుడు ముత్తయ్య, ప్రొఫెసర్లు కాశీం, ఇందిరా హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కమిటీలతో కాలయాపన చేయకుండా ఆర్డినెన్స్ ద్వారా ఎస్సీ వర్గీకరణను అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్ల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం వర్ధంతి..

లాలాపేట, న్యూస్‌టుడే: ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద బుధవారం కాన్షిరాం వర్ధంతిని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్ హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్లు రత్నం, వెంకటరత్నం, బీఎస్ఎఫ్ ఓయూ ఇన్‌ఛార్జి కల్వకుర్తి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఇదో మురుగు రహదారి



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బీకేగూడ- నల్లపోచమ్మ దేవాలయం నుంచి ఎస్సార్‌నగర్ ఎస్సార్టీ కాలనీ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం మురుగు పరుగులు పెడుతోంది. వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బీకేగూడ పార్కు వద్ద అపరిశుభ్రత నెలకుంటుంది. దుర్వాసనతో నివాసితులు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విజృంభిస్తున్న గంజాయిని అరికట్టండి

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: విజృంభిస్తున్న గంజాయిని అరికట్టాలని సీపీఐ, సీఆర్పీఎఫ్ సంస్థల ప్రతినిధులు కాంపెల్లి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తుకారం గేట్ ఠాణాలో సీఐని కలిసి వినతి పత్రం అందజేశారు. యువత వ్యసనాలకు బానిసై తమ భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగుట్ట డివిజన్‌లో డ్రగ్స్‌ను విచ్చలవిడిగా యువత ఉపయోగిస్తున్నారని తగు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా బస్తీలలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. నర్సింగరావు, సువర్ణ, గౌరీ నాగరాజ్, భాగ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు


కుమ్మరిగూడ: సామూహిక హారతిలో ఎంపీ ఈటల, కార్పొరేటర్ దీపిక, నిర్వాహకులు


బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం వద్ద..


మహంకాళి దేవస్థానం వద్ద..


బతుకమ్మ వేడుకలో మెట్టు సాయికుమార్, మహిళలు

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో బతుకమ్మ వేడుకలతో సందడి వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆటపాటలతో అలరించారు.
–న్యూస్‌టుడే బృందం


కోలాటం ఆడుతున్న మహిళలు


సనత్‌నగర్ గాంధీ బొమ్మ సమీపంలో..


సికింద్రాబాద్: సంజనా ప్లేస్కూల్ చిన్నారు

రైల్వే ప్లాట్‌ఫాంపై వెస్ట్ బెంగాల్ వాసి మృతి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా సొంతూరుకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి మూర్ఛవ్యాధితో ప్లాట్‌ఫాంపై మృతి చెందాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్‌కు చెందిన సుబీర్ సింగ్(45) గత మూడు నెలల క్రితం నగరానికి వచ్చాడు. అనారోగ్యం కారణంగా సొంతూరుకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చి ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న సమయంలో మూర్ఛరావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.

మావోయిస్టుల పేరుతో బెదిరించిన ముఠా అరెస్టు

లాలాపేట, న్యూస్‌టుడే: మావోయిస్టుల పేరుతో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన ముఠాను ఓయూ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. తార్నాకలోని కళాకృతి అపార్టుమెంట్‌లో రైల్వే కాంట్రాక్టర్ జి.సురేష్ నివాసముంటున్నాడు. గత నెల 26న ఓ నంబర్ నుంచి వాట్సప్ కాల్ చేసి తాము సీపీఐ ఎంఎల్ (నక్సలైట్), జై భీమ్ గ్రూప్ నుంచి మాట్లాడుతున్నామంటూ రూ 5కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబ సభ్యుల అందరి చిరునామాలు తెలుసు, డబ్బులు ఇవ్వకపోతే హతమారుస్తామంటూ బెదిరించారు. మరో రోజు రెండు పర్యాయాలు ఫోన్ చేశారు. దీంతో ఆందోళన చెందిన బాధితుడు గత నెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టి నగరానికి చెందిన సలోంక ప్రసాద్(36) ఇంటీరియర్ డిజైనర్, రత్లావత్ రవినాయక్(29) ఆటో డ్రైవర్, కమ్మరి శేషప్ప(37) కార్పెంటర్, మందగుల సత్తయ్య (37) వ్యవసాయం.. ఈ నలుగురిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (బుధవారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 63, వంగ 40, బెండ 40, పచ్చిమిర్చి 28, కాలీ ఫ్లవర్ 23, క్యాబేజీ 21, క్యారెట్ 38, దొండ 40, ఆలు 37, ఉల్లి 34, సొర 19, పొట్ల 18, బీన్స్ 100, గోరుచిక్కుడు 40, చిక్కుడు 55, దోస 28, బీర 45, కాకర 38, చామగడ్డ 37, కీర 45, క్యాప్సికం 70, బీట్‌రూట్ 23, కందగడ్డ 55, మునగ 75, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాటా కిలో రూ.63, వంగ 40, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకర 38, బీర 45, క్యాబేజీ 21, బీన్స్ 100, క్యారెట్ 38, దొండ 40, చిక్కుడు 55, క్యాప్సికం 70, ఆలు 37, కీర 23, దోస 28, చామగడ్డ 37, అరటి 9, బీట్‌రూట్ 23, సొర 19, గోకర 40, చిలకడదుంప 37, మామిడి 105, మునగ 76.

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కలశపూజ నిర్వహిస్తున్న వేద పండితులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం హోమం, ఉత్సవమూర్తులకు అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో సాగింది. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి సాయిబాబా మహా సమాధి ఉత్సవాలు



గౌతంనగర్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి శ్రీసాయి సమాజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10నుంచి 12వ తేదీ వరకు శిర్డీ సాయిబాబా 106వ మహా సమాధి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు సభ్యులు బుధవారం తెలిపారు. 10న ఉదయం మేలుకొలుపు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం డాక్టర్ పసుమర్తి శేషుబాబు శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన, పల్లకీ సేవ, 11న సాయంత్రం మైటీ మ్యూజికల్ కార్పొరేషన్ వారిచే భక్తి సంగీత విభావరి, 12న జమ్మి పూజ, శాంకరి నాట్యస్థల్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బతుకమ్మ వేడుకలు.. నిమజ్జన ఏర్పాట్లు

గౌతంనగర్, అల్వాల్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలను మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం మహిళలంతా బతుకమ్మలతో ఆడి పాడిన అనంతరం పూజలు నిర్వహించి నిమజ్జనం చేస్తారు.

★ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 6 డివిజన్లలో 63 బతుకమ్మ తొట్లు ఏర్పాటుకు ఇంజినీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. ★ రూ.8.35 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు.

★ సఫిల్‌గూడ మినీట్యాంక్‌బండ్, బండచెరువు వద్ద నున్న నిమజ్జన ఘాట్లలో వ్యర్థ జలాలు తొలగించి, మంచి నీటిని నింపారు.



సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన బతుకమ్మ



బండచెరువు నిమజ్జన ఘాట్

★ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బతుకమ్మలు ఏర్పాటు చేశారు. ఫ్లడ్‌లైట్లు, బతుకమ్మ పాటలు వినిపించేందుకు మైకులు ఏర్పాటు చేశారు.

అల్వాల్ సర్కిల్ పరిధిలో..

సర్కిల్ పరిధిలో అధిక శాతం ప్రాంతాల్లో గురువారం నిర్వహిస్తుండగా కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం జరపనున్నారు. వేడుకలకు జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు చేసింది. బతుకమ్మ ఆట నిర్వహించే కూడళ్లలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. టెంపుల్ అల్వాల్‌లోని బాలాజీ ఆలయ గుండం, కొత్తచెరువు కోనేరు వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు.

వివిధ ప్రాంతాల్లో ఘనంగా..

టెంపుల్‌అల్వాల్‌లోని వెంకటేశ్వర కల్యాణ మండపం, హరిదాసు మండపం కూడలి, హెచ్‌ఎంటీ కాలనీ పార్కు, ఓల్డ్‌అల్వాల్ రామాలయం, వెంకటాపురం పోచమ్మ ఆలయం, చంద్రపురంకాలనీ కూడలి, కానాజిగూడ కూడలి, కౌకూర్, తుర్కపల్లి, మచ్చబొల్లారంలోని హనుమాన్‌టేక్డీ ఆలయం వద్ద సామూహికంగా బతుకమ్మ ఆడనున్నారు.



కొత్తచెరువు కోనేరు

మహిళలకిచ్చిన హామీలు మరచిన ప్రభుత్వం: ఐద్వా



తహసీల్దార్ సీతారాంకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా మహిళలు

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు నెలకు రూ.2,500 నగదు ఇస్తానన్న హామీ మరచిందని, ఆరు గ్యారెంటీలు సక్రమంగా అమలు చేయడం లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పేర్కొంది. మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమలులోకి తీసుకొచ్చిన పథకాలు సక్రమంగా అందడం లేదన్నారు. రాష్ట్రంలో మద్యం షాపులు, మాదకద్రవ్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. వాటికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సీతారాంనకు వినతి పత్రం అందజేశారు.

తాగునీరు.. రోడ్డుపాలు



నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి దేవీనగర్ రామాలయం సమీప వీధిలో తరచూ తాగునీరు పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడుతున్నాయి. నీరు రోడ్డుపై పారుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విలువైన తాగునీరు రోడ్డు పాలవుతోందని మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, డిఫెన్స్‌కాలనీ



అనంత సరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో



సరస్వతిగా ఉజ్జయిని మహంకాళి



సరస్వతీదేవిగా అంబ, భవాని అమ్మవార్లు



టెంపుల్ అల్వాల్‌లోని ఉమాచంద్రమౌళీశ్వర ఆలయంలో

భగవతీం.. బుద్ధిప్రదాం.. శారదాం

గౌతంనగర్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, అల్వాల్, డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణి.. విద్యారంభం కరిష్యామి అంటూ బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని ఆలయాలు మార్మోగాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నారులచే సరస్వతీ పూజలు నిర్వహించి వారికి నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో కుంకుమార్చన నిర్వహించారు.

★ గౌతంనగర్ డివిజన్ సంతోష్‌నగర్‌లోని అంబ, భవాని అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

★ మల్లికార్జునగర్‌లో కూచిపూడి నృత్య భారతి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత విభావరిలో రాజరాజేశ్వరి శిష్య బృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ★ తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని అనంత సరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులతో సరస్వతీ హోమం చేయించారు. డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ★ మల్కాజిగిరి గాంధీపార్కులో మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ ఏర్పాటుచేసిన అమ్మవారి మండపంలో ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పూజలు చేశారు.



మల్లికార్జున్‌నగర్‌లో గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



శృంగేరీ శంకరమఠంలో..



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పెద్దలు



గాంధీపార్కు మండపంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



దీన్‌దయాల్‌నగర్‌లో కుంకుమార్చన

పేదల అభ్యున్నతికి కాన్షీరాం అవిరళ కృషి



కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అల్వాల్, న్యూస్‌టుడే: ఓల్డ్‌అల్వాల్‌లోని అంబేడ్కర్‌బస్తీ కూడలిలోని మహనీయుల విగ్రహాల వద్ద కాన్షీరాం 18వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ అభిమానుల సంఘం, అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, జ్ఞానమాల, అంబేడ్కర్ యువజన కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాన్షీరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి, బహుజన సమాజ నిర్మాణానికి ఆయన అవిరళ కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. యాదగిరి, డోలక్‌విజయ్, వరంగల్లు గద్దర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో హక్కుల సాధన

నేరేడ్‌మెట్: బీసీలకు రావలసిన రాజ్యాంగ హక్కులను ఐకమత్యంతో సాధించుకుందామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బీసీ సంఘాల ప్రతినిధి కుందారం గణేష్ చారి అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి మండల బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు, పలు పార్టీల నాయకులు సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో సత్కరించి అభినందనలు తెలిపారు. ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణ మూర్తి ముదిరాజ్, రాష్ట్ర కోశాధికారి బత్తిని నర్సింహగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు ఎమ్మార్పీఎస్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాదిగ ఆరోపించారు. బుధవారం తూంకుంట పుర పాలికలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియకు వినతి పత్రం అందజేశారు. ఎంఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, శివకుమార్‌మాదిగ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ వచ్చె.. సందడి తెచ్చె



బతుకమ్మలతో కార్పొరేటర్లు విజయశాంతి, సబిత



అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద..

అల్వాల్: అల్వాల్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్కిల్ కార్యాలయం మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆటపాటలతో కార్యాలయం ముందు సందడి చేశారు. అంతకుముందు ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. కార్పొరేటర్లు విజయశాంతి, సబిత, ఈఈ శ్రీకాంతి తదితరులు పాల్గొన్నారు. రాజీవ్‌నగర్‌బస్తీలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్లు విజయశాంతి, సబితలు బతుకమ్మ ఆడారు. నిమజ్జనం ఊరేగింపు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అల్వాల్, న్యూస్‌టుడే: సర్కిల్‌లోని పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం పంజాబీ కమ్యూనిటీ హాల్‌లో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి కార్మికుడికి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. అనంతరం ఈఎస్‌ఐ, ఎన్‌ఐఎన్ వైద్య నిపుణులు కార్మికులకు పరీక్షలు చేసి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి రజని, పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

తాగునీటి సమస్య పరిష్కరించాలి



సమస్య తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, జలమండలి డీజీఎం విష్ణువర్ధన్, ఏఈ మాజిద్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: తాగునీటి సమస్యను పరిష్కరించాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ కోరారు. లోప్రెషర్ నీటి సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం జలమండలి డీజీఎం విష్ణువర్ధన్, ఏఈ మాజిద్‌తో కలిసి ఆజాద్‌నగర్‌లో పర్యటించారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలని పేర్కొన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, లైన్‌మెన్లు రవి, యాదగిరి, నేతలు జాఫర్, లింగారావు, మహేష్‌ముదిరాజ్, అజర్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

భాజపా విజయోత్సవం



మహిళకు మిఠాయి తినిపిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి. చిత్రంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్, నేతలు

కాచిగూడ, న్యూస్‌టుడే: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా హ్యాట్రిక్ విజయం సాధించినందుకు సంబరాలు నిర్వహించారు. బుధవారం నింబోలిఅడ్డలోని కార్యాలయం వద్ద కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి మిఠాయిలను పంచారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి అనుగ్రహంతో అంతా బాగుండాలి



నవీన్ మిత్తల్

రాంనగర్, న్యూస్‌టుడే: అమ్మవారి అనుగ్రహంతో ప్రజలు సంతోషంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్ ఆకాంక్షించారు. హైదరాబాద్ బెంగాలీ సమితి(హెచ్‌బీఎస్) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం రాత్రి 83వ దుర్గా నవరాత్రి ఉత్సవం ఘనంగా జరిగింది. ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ బెంగాలీ సమితి 1942 నిజాం కాలం నుంచి దుర్గాపూజ నిర్వహిస్తున్నారని కొనియాడారు. దుర్గాపూజ చెడుపై మంచి సాధించిన విజయాన్ని సూచిస్తుందన్నారు. రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, హెచ్‌బీఎస్ అధ్యక్షుడు మౌసుమీ చౌదరి, ప్రధాన కార్యదర్శి జోయ్ కుమార్ దత్తా, ఉపాధ్యక్షుడు బిస్వజిత్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. రాకపోకలకు అంతరాయం

ముషీరాబాద్ నియోజకవర్గంలో వాహనదారుల ఇక్కట్లు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీ లీకేజీలతో రోడ్లపై తారుకొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదకరంగా మారిన రహదారులపైనే వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. భోలక్‌పూర్, ముషీరాబాద్, రాంనగర్, గాంధీనగర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో గుంతలమయంగా మారిన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా భోలక్‌పూర్ డివిజన్‌లోని దేవీచౌక్, బ్యాంక్‌ఆఫ్ బరోడా ఏటీఎం, సంజీవయ్య నగర్, కెనరా బ్యాంక్ రోడ్డు, ముషీరాబాద్ డివిజన్ రాజాడీలక్స్ చౌరస్తా, దయార మార్కెట్ చౌరస్తా, గాంధీనగర్ వివేకానందనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో గుంతలు కనిపించక పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా సంబంధిత శాఖ అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



రాజా డీలక్స్ చౌరస్తా సమీపంలో గుంతలు



గాంధీనగర్ గంటసాల మైదానం వెళ్లే దారిలో..

అనారోగ్యంతో సతమతం..

అధ్వానంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించడంతో మెడ, వెన్నునొప్పి, కీళ్లనొప్పుల బారినపడి ఆస్పత్రులపాలు కావాల్సివస్తోందని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు, ఎడుగుదిగుడుగా మారిన రోడ్లపై వెళ్లడంతో ద్విచక్రవాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లను ఆధునీకరించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం..

–జీహెచ్ఎంసీ ఏఈ సుభాష్

భోలక్‌పూర్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. అవసరమైన చోట్ల కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నూతన వీడీసీసీ రోడ్లు నిర్మిస్తాం.

'నాడ హబ్బ' వేడుకలు కర్ణాటక సంస్కృతికి అద్దం: సజ్జనార్



సజ్జనార్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

బర్కత్‌పుర: కర్ణాటక 'నాడ హబ్బ' దసరా వేడుకలకు ఐదు శతాబ్దాల చరిత్ర ఉందని, అమ్మవారి ఉత్సవాలకే పరిమితం కాకుండా కర్ణాటక చరిత్ర, సంస్కృతికి అద్దం పడుతున్నాయని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. బర్కత్‌పుర లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో నిర్వహిస్తున్న 'నాడ హబ్బ' వేడుకలకు బుధవారం రాత్రి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న 10 లక్షల మంది కన్నడిగులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కర్ణాటక సాహిత్య మందిర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కన్నడ జానపద కళాకారులు కేఏస్ మంజునాథ్, రాజ్‌గురు హొస్కోటీల గీతాలాపన ఆకట్టుకుంది. కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు సురేంద్ర కట్టేరి, నర్సింహామూర్తి జోయిస్, విశ్రాంత న్యాయమూర్తి సుదీంద్ర కులకర్ణి, భీమ్‌సేన్, ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు.

ముఠా జైసింహ గృహనిర్బంధం

గాంధీనగర్: భారాస యువజన విభాగం నేత ముఠా జైసింహను పోలీసులు బుధవారం గాంధీనగర్‌లో గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన కారణం చెప్పకుండా పోలీసులు గృహనిర్బంధం చేయడం సరికాదన్నారు. ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేసే కార్యక్రమం, ఎస్సీ రిజర్వేషన్ల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నిర్వహించిన నిరసన ర్యాలీ నేపథ్యంలో అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పోటాపోటీగా చెక్కుల పంపిణీ



మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్లు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: అధికార కాంగ్రెస్, విపక్ష భారాసకు చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ అనుచరులతో వచ్చి పోటాపోటీగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం అలీకేఫ్ చౌరస్తాలోని ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ 26 మందికి కల్యాణలక్ష్మి, 76 మందికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మ, అమృత, అంబర్‌పేట మండల తహసీల్దార్ వీరాబాయి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, నేతలు జాఫర్, లింగారావు, జగత్ సింగ్, అబ్దుల్ నయీం, ఆజర్ తదితరులు పాల్గొన్నారు. ★ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నేతలు ఆర్. లక్ష్మణ్‌యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, జగన్, అబ్దుల్ ఫరీద్, అనిల్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవిసమ్మేళనం

గాంధీనగర్, న్యూస్‌టుడే: త్యాగరాయ గానసభలో బుధవారం గీతాఫౌండేషన్, కుసుమ ధర్మన్న కళాపీఠం, నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషనల్, స్పోర్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏఐఎంఎస్ నీట్ అకాడమీ సౌజన్యంతో ఆధ్యాత్మిక ప్రసంగాలపై కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు, కవయిత్రులు తమ స్వీయ కవితలను చదివారు. విశ్వసాహితీ సంస్థ అధ్యక్షుడు బి.జయరాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కవులు, కవయిత్రులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేసి సన్మానించారు.

చెడుపై సాధించిన విజయమే విజయదశమి



దేవతామూర్తుల వేషధారణలో బ్రహ్మచారిణులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే పండుగ విజయదశమి అని సిస్టర్ సుమలత పేర్కొన్నారు. దేవీశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో కళాసుబ్బారావు కళావేదికలో విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవరాత్రి, విజయదశమిలోని ఆధ్యాత్మిక రహస్యాన్ని, దేవతల విశిష్టతను వివరించారు. కామ, క్రోధం, లోభం, అహంకారాలను వీడి ఆధ్యాత్మిక భావాన్ని అలవరచుకోవాలన్నారు. చిక్కడపల్లి శాఖ ఇన్‌ఛార్జి జయశ్రీ స్వాగతోపన్యాసం చేశారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో పలువురు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో చిక్కడపల్లి ఠాణా ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ సీతయ్య, ప్రముఖులు జయశ్రీ, రష్మిత, వంశీ రామరాజు, సర్వోత్తమ్, సిస్టర్ శోభ, సిస్టర్ శ్రీలత, శశికాంత్, గణేష్, దైవజ్ఞశర్మ, తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారం చేస్తే పరువు నష్టం దావా'



ఎడ్ల సుధాకర్‌రెడ్డి

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రైవేట్ వ్యక్తుల స్థలాన్ని ప్రభుత్వ భూమిగా అసత్య ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తామని భారాస అంబర్‌పేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఛేనంబర్ చౌరస్తాలోని భారాస కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంలో నీటి కుంటను ఏర్పాటు చేయాలని మాట్లాడటం సరికాదన్నారు. బతుకమ్మకుంట స్థలం ముమ్మాటికి ప్రైవేటదని ఈ వివాదం కోర్టు విచారణలో ఉందన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

విద్యానగర్: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రావణ దహనం, దాండియా కార్యక్రమాలకు హాజరుకావాలని బుధవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పద్మలకు సమితి సలహాదారు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ నెల 11న అంబర్‌పేట క్రీడా మైదానంలో దాండియా, 12న రావణ దహనం ఉంటుందని చెప్పారు.

దివ్యరూపిణి.. శుభకారిణి



శంకరమఠంలో సరస్వతి రూపంలో శారదాంబ



జైస్వాల్‌గార్డెన్‌లో ..



అంబర్‌పేట మహంకాళి ఆలయంలో..



చిక్కడపల్లిలో సరస్వతి అవతారంలో..

బర్కత్‌పుర, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, కాచిగూడ, విద్యానగర్, బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో బుధవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చండీహోమం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు, స్థానికులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.



సత్యానగర్ బస్తీలో భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు



అంబర్‌పేట పోచమ్మ బస్తీలో అమ్మవారిని నోట్లతో లక్ష్మీదేవిగా అలంకరణ



బతుకమ్మకుంటలో మైసమ్మదేవి సరస్వతీదేవిగా..



బాపూనగర్‌లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణాగౌడ్, చందుపటేల్, శ్రీమంత్‌గిరి



చప్పల్‌బజార్‌లో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో లలితసహస్రనామ పారాయణం

తీరొక్క పూలతో.. బతుకమ్మను పేర్చి

గాంధీనగర్, కాచిగూడ, అంబర్‌పేట: గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆంధ్రాకేఫ్ సమీపంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మహిళలతో కలిసి దాండియా ఆడి సందడి చేశారు. కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచన శ్రీ భాజపానేతలు వినయ్‌కుమార్, రత్న సాయిచంద్, ఉమేష్, ఎండీ మహమూద్, సత్తిరెడ్డి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



కాచిగూడలో కార్పొరేటర్ ఉమారాణి, మహిళలు



అంబర్‌పేటలో భాజపా మహిళా నేతలు



గాంధీనగర్‌లో కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావని

అణగారిన వర్గాల హక్కుల సాధనకు పోరాటాలు



ప్రొఫెసర్ హరగోపాల్

బాగ్‌లింగంపల్లి: అణగారిన వర్గాల హక్కుల సాధనకు సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు నిర్బంధాలను ఎదుర్కొంటూ పోరాటాలు చేస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బుధవారం సుందరయ్య కళానిలయంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్(టీపీఎఫ్) 15వ ఆవిర్భావ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన టీపీఎఫ్ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మనిషి స్వేచ్ఛ, సమానత్వం చెందినప్పుడే అభివృద్ధి అంటారన్నారు. శ్రమచేసే వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. పేదల సంపద పెరగాలన్నారు. బహుళ జాతి సంస్థలు, ప్రైవేటు కంపెనీలకు జాతి సంపదను దోచి పెట్టొద్దన్నారు. అమెరికా తరహా అభివృద్ధి సాధించాలని కోరుతున్నారని, ఇప్పుడు ఆ దేశం అసమానతలను ఎదుర్కొంటోందన్నారు. మూసీ నిర్వాసితులను ఆదుకోవాలన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.లక్ష్మణ్, వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పోరాడే వాళ్లను రాజ్యం అక్రమంగా అణచివేస్తోందన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలన్నారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ప్రజాస్వామిక తెలంగాణ సాధనకు టీపీఎఫ్ పదిహేనేళ్లుగా పోరాడుతోందన్నారు. ఉద్యమ గీతాలు, కళా ప్రదర్శనలు అలరించాయి. టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, రాష్ట్ర కోకన్వీనర్లు సంజీవరావు, అంబయ్య, కడమంచి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

9 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కాచిగూడ, న్యూస్‌టుడే: 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, ఎస్సై సురేష్ కథనం ప్రకారం... ఖాజాగరీబ్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసిఫ్(35)ను బుధవారం అదుపులోకి తీసుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌరసరఫరా శాఖ వారికి అప్పగించారు.

సెల్‌ఫోన్, నగదు ఉన్న బ్యాగు చోరీ

కాచిగూడ, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్, నగదు ఉన్న బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం... బర్కత్‌పురకు చెందిన విశ్వనాథ్ భార్య హేమలత మంగళవారం భోపాల్ నుంచి కాచిగూడకు ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నారు. రైలు కాగజ్‌నగర్ వద్ద ఉండగా సెల్‌ఫోన్, రూ. 5 వేల నగదు ఉన్న ఆమె బ్యాగు చోరీకి గురైంది. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంచిర్యాల రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

నిమజ్జనానికి తాత్కాలిక కొలనులు సిద్ధం

ముషీరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలకు నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహిళలు తొమ్మిది రోజులపాటు తొమ్మిది రకాల పేర్లతో ఆడిపాడి చివరి రోజున సద్దుల బతుకమ్మ అనంతరం నిమజ్జనం చేయడం ఆనవాయితీ. గ్రామాల్లో చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేస్తుండగా.. నగరంలో ఏటా జీహెచ్ఎంసీ డివిజన్లవారీగా తాత్కాలిక కొలనులను ఏర్పాటు చేస్తోంది. నియోజకవర్గంలో ఈ నెల 10న సద్దుల బతుకమ్మను నిర్వహించనున్న నేపథ్యంలో బతుకమ్మల నిమజ్జనోత్సవానికి తాత్కాలిక కొలనులను జీహెచ్ఎంసీ ఇప్పటికే సిద్ధం చేసింది. దాదాపు రూ.12 లక్షలతో నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో వాటిని ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల కర్రలు, తడకలు, ప్లాస్టిక్ కవర్లతో ఏర్పాటు చేయగా.. మరికొన్ని చోట్ల ఇసుక సంచులు, ప్లాస్టిక్ కవర్లతో మొత్తం 82 తాత్కాలిక కొలనులను నిర్మించారు. గురువారం సాయంత్రంలోపు వాటిలో జలమండలి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపనున్నారు. సద్దుల బతుకమ్మను ఆడిపాడిన అనంతరం తాత్కాలిక కొలనుల్లో నిమజ్జనం చేయనున్నారు. డివిజన్లవారీగా కొలనులతోపాటు ట్యాంక్‌బండ్ బతుకమ్మ చౌక్ వద్దకు నిమజ్జనోత్సవానికి వచ్చే వారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ డీఈలు సన్నీ, గీతాకుమారి వేర్వేరుగా తెలిపారు. రాత్రి వేళలో నిమజ్జనం చేయనుండటంతో కొలనుల వద్ద జీహెచ్ఎంసీ విధి దీపాల సిబ్బంది నియోజకవర్గంలో సుమారు 2350 తాత్కాలిక ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నామని జీహెచ్ఎంసీ వీధి దీపాల నిర్వహణ ఏఈ అనూష తెలిపారు. కొలనుల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేయనున్నారు.

డివిజన్		కొలనులు
ముషీరాబాద్	:	16
రాంనగర్	:	15
అడిక్‌మెట్	:	12
భోలక్‌పూర్	:	14
గాంధీనగర్	:	19
కవాడిగూడ	:	6



రాంనగర్ జెమినీకాలనీలో...



ముషీరాబాద్‌లో సంచులతో ఏర్పాటు చేస్తూ..

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గాంధీనగర్: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కార్మికశాఖ రంగారెడ్డి జిల్లా సంయుక్త కమిషనర్ శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కమిషనర్ కార్యాలయంలో మాట్లాడారు. కార్మికులకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా భవన, ఇతర నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డు నమోదుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌కు మంచి స్పందన లభించిందన్నారు. కార్మికశాఖ రంగారెడ్డి జిల్లా జోన్ పరిధిలో 1156 నిర్మాణ ప్రదేశాల్లో ఆగస్టు 28 నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 58,168 మంది భవన నిర్మాణ కార్మికులను గుర్తించామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే, కాప్రా, నాగారం, మేడ్చల్, మేడ్చల్ రూరల్

? కుషాయిగూడలో మందుబాబులు, గంజాయి గ్యాంగులు హల్‌చల్ చేస్తున్నాయి. వీధుల్లో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది.
– పద్మారెడ్డి, శివసాయినగర్

✓ పోలీసు గస్తీ పెంచుతాం. జులాయిల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
–జి.అంజయ్య, ఇన్‌స్పెక్టర్, కుషాయిగూడ ఠాణా

? వెంకటాద్రినగర్‌లో సామాజిక భవనం వద్ద చెత్త వేస్తున్నారు.
– భాస్కర్‌గౌడ్, ఎల్లారెడ్డిగూడ

✓ చెత్తాచెదారం తొలగించి ఆ ప్రాంతం శుభ్రంగా ఉండేలా చూస్తాం.
– సుదర్శన్, శానిటరీ సూపర్‌వైజర్

? నాగారం పట్టణంలోని రాంపల్లి సిగ్నల్ నుంచి ఘట్‌కేసర్ వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రయాణం ప్రమాదకరంగా మారింది.
– రవికిరణ్, తూర్పుగాంధీనగర్, నాగారం

✓ వర్షాలు తగ్గుముఖం పట్టగానే గుంతలను పూడ్చి సమస్య పరిష్కారం చేస్తాం.
– రఘు, డీఈఈ, నాగారం

? నాగారం ప్రధాన రహదారులపై వ్యాపారులు ఇష్టానుసారంగా ప్రకటనల బోర్డులు, తోపుడు బండ్లు పెట్టడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.
– రాఘవేందర్, భవానీనగర్, నాగారం

✓ పట్టణ ప్రణాళిక విభాగం దృష్టికి తీసుకువెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతాం.– రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? .మేడ్చల్ పట్టణం 18 వార్డు పరిధిలో మ్యాన్‌హోల్ మూత పగిలింది. చెత్త, మట్టితో నిండిపోతోంది.
– నవీన్‌కుమార్, మేడ్చల్.

✓ మూత ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. – నాగిరెడ్డి, కమిషనర్ మేడ్చల్.

? మేడ్చల్ మండలంలోని కోనాయిపల్లి గ్రామ పరిధిలోని రహదారులపై గుంతలు పడ్డాయి.. –రాజు కోనాయిపల్లి

✓ గుంతల్లో మట్టి పోయించి ఇబ్బందులు లేకుండా చేస్తాం.. – ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి, కోనాయిపల్లి

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

ఓం జయంతి మంగళ కాళీ


ఉప్పల్ వెలుగుగుట్ట


లక్ష్మాపూర్‌లో..


సరస్వతిగా నిమిషాంబికాదేవి


విష్ణుపురికాలనీలో వీణాపాణిగా


హౌసింగ్ బోర్డు కాలనీ


కీసరగుట్టలో..


అన్నోజిగూడ గాయత్రీ పీఠంలో..


గోఖలేనగర్..


రామంతాపూర్..


నాచారం మహంకాళి


ఎల్లారెడ్డిగూడలో..


జవహర్‌నగర్‌లో..



తూంకుంట శ్రీగాయత్రి

అస్తవ్యస్తంగా విద్యుత్తు తీగలు... పొంచి ఉన్న ప్రమాదాలు

● చెప్పినా పట్టించుకోని అధికారులు
● ఆందోళనలో కాలనీల జనం

కీసర, మేడ్చల్‌రూరల్, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలు, నియంత్రికలు, ఫ్యూజ్‌బాక్సులు సరి చేయాలని ఎన్ని సార్లు విన్నవించుకుంటున్నా అధికారులకు పట్టింపు లేకుండా పోతోంది. ఏదైనా ప్రమాదం జరిగితే... అప్పటి వరకు ఏదో హడావుడి చేసి తర్వాత పట్టించుకునేవారు లేకుండా పోతున్నారు. మరమ్మతుల పేరిట విద్యుత్తు సరఫరా నిలిపి వేసి తీగల కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని చెబుతున్నారే గానీ... అవి ఎక్కడ తొలగిస్తున్నారో వారికే తెలియాలి. శివారు కాలనీల్లో మాత్రం విద్యుత్తు తీగల కింద చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా అలాగే ఉంటున్నాయి. వాటిని తొలగించేవారు లేకుండా పోయారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులకు చెబితే అది మా పని కాదు విద్యుత్తు అధికారులదే బాధ్యత అని తప్పించుకుంటున్నారు.


అన్నోజిగూడలో ఇంటిపై ప్రమాదకరంగా తీగలు


కీసరలో చెట్ల కొమ్మల మధ్యలో..

● కాస్త గాలి వీస్తే చాలు చెట్ల కొమ్మలు తీగలకు తగిలి ఒక్కసారిగా మంటలు వచ్చి నియంత్రికల వద్ద ప్యూజులు పోయి కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. కీసరలో అదే పరిస్థితి నెలకొంది. సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న కాలనీలో చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగల మధ్య ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం పడితే చాలు చెట్ల కొమ్మలు తీగలకు తాకి షార్ట్ సర్క్యూట్ అవుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కీసర, బోగారం, వన్నిగూడ, కరీంగూడ, కీసరదాయర, గోధుమకుంటలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాలను తొలగించాలని పలుసార్లు సభల్లో విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతుంది.

● నగర శివారు ప్రాంతంలో విద్యుత్తు తీగలు అతి సమీపంలో ప్రభుత్వ పాఠశాల ఉంది. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కన ఉంది. ఇందులో 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జాతీయ రహదారి కావడంతో విద్యార్థులు రోడ్డు దాటేందుకు భయపడుతున్నారని, గతంలో ప్రమాదాలు జరిగి విద్యార్థుల ప్రాణాలు పోవడంతో స్పందించిన అధికారులు పాఠశాల ముందు పాదచారుల వంతెన ఏర్పాటు చేశారు. వంతెన పై నుంచి విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ ప్రహరీపై నుంచి విద్యుత్తు హైటెన్షన్ తీగలు, స్తంభాలు ఉన్నాయి. వంతెనకు దగ్గరగా విద్యుత్తు తీగలు ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్, నూతన్‌కల్ గ్రామాల్లో పంట పొలాల వద్ద తీగలు, నియంత్రికల దగ్గర సరైన భద్రత లేక ప్రమాదం జరిగే అవకాశం ఉంది. డబిల్‌పూర్ గ్రామశివారులో విద్యుత్ స్తంభం ఒరిగింది. అంతేకాక రహదారికి ఆనుకుని పొదల్లో విద్యుత్ నియంత్రిక ఉండటంతో కనిపించక వాహనదారులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. నూతన్‌కల్ గ్రామంలో ఇటీవలే ఇంటి వద్ద విద్యుత్ తీగలు తగిలి డిగ్రీ విద్యార్థి మృతి చెందిన ఘటన గ్రామస్థులను కలచివేసింది.

● జవహర్‌నగర్ పరిధిలోని మదర్‌థెరిసాకాలనీ, ఆదర్శనగర్ ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. చాలా చోట్ల విద్యుత్తు తీగలు ఇళ్లపై నుంచి వెలుతున్నాయి. స్తంభాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

నూతన్‌కల్‌లో విద్యార్థి మృతికి కాణమైన విద్యుత్ తీగలు →




డబిల్‌పూర్ శివారులో రహదారి పక్కన పొదల్లో నియంత్రిక

చెరువులో వదిలిన చేప విత్తనాలు


చేప విత్తనాలను వేస్తున్న ఎంపీ, మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు

శామీర్‌పేట, న్యూస్‌టుడే: మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు శామీర్‌పేట పెద్ద చెరువులో చేప విత్తనాలను బుధవారం వదిలారు. 60వేల చేప పిల్లలను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మత్స్య రాష్ట్ర కమిటీ ఛైర్మన్ మెట్టుసాయికుమార్, జిల్లా మత్స్య శాఖ కమిటీ ఛైర్మన్ మన్నెరాజుముదిరాజ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు ఎమ్మార్పీఎస్ ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కేశపగా రాంచందర్ మాదిగ ఆరోపించారు. బుధవారం తూంకుంట పుర పాలికలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తోకలచిరంజీవి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్‌మాదిగ, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులను పంపిణీ చేసిన ఛైర్మన్, కమిషనర్

నాగారం, న్యూస్‌టుడే: పురపాలికలో వివిద విభాగాల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం దుస్తులను ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పంపిణీ చేశారు. 195 మందికి దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె తదతర వస్తువులను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, వైస్ ఛైర్మన్ బండారు మల్లేష్ యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

పీర్జాదిగూడ (బోడుప్పల్): పీర్జాదిగూడ నగర పాలక సంస్థ సిబ్బందికి బుధవారం నగర మేయర్ అమర్‌సింగ్, కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావులు దసరా కానుక అందజేశారు. కొత్త బట్టలు, సబ్బులు, నూనె, షూలు, గ్లౌజ్‌లు ఇచ్చారు.

నాలా కప్పు కూలి.. రాస్తా బంద్



డివిజన్‌లో అంజనా క్లాసిక్ చౌరస్తా సమీపంలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రహదారి నాలాపై ఉన్న కప్పు కూలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేయడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దమ్మాయిగూడ, పద్మశాలి టౌన్‌షిప్ కాలనీవాసులు కుషాయిగూడకు ఇటుగానే వెళ్లాల్సి ఉండటం.. ఇరవై రోజులవుతున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. సమస్యను కాప్రా సర్కిల్ డీఈ బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా త్వరలో మరమ్మతులు చేస్తామని వివరించారు.
–న్యూస్‌టుడే, ఏఎస్‌రావునగర్

వెలుగుగుట్ట ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

ఉప్పల్: ఉప్పల్ వెలుగుగుట్టలోని శ్రీ దుర్గామల్లిఖార్జునస్వామి దేవాలయం నూతన ట్రస్ట్ బోర్డు బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఛైర్మన్‌గా జెన్ని రఘు, సభ్యులుగా పైట మురళీకృష్ణ, సోమ బాలమణి, మడద రమేష్‌బాబు, గన్నారం విజయ్‌కుమార్, రొడ్డ శ్రీకాంత్‌రెడ్డి, జంగయ్య, పూజారి రమేష్‌శర్మ నియమితులయ్యారు.

ఆడి..పాడి గౌరమ్మను కొలిచి


ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో..


పీర్జాదిగూడలో ఆడుతున్న మహిళా కార్పొరేటర్లు, ఉద్యోగులు


నాచారం పారిశ్రామికవాడలో..

వివిధ శాఖల ఉద్యోగుల సంబరాలు ↓




కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులు

కలెక్టరేట్‌లో డీపీఆర్‌వో సరిత →



మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు



మేడ్చల్: మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మూడుచింతలపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ ఛైర్మన్‌గా గూగులోత్ నాయక్, కమిటీ డైరెక్టర్లుగా ఎర్రోళ్ల విజయ, యాస్కి నాగేశ్వరరావు, తుంకి బిక్షపతి, కొలన్ మాధవరెడ్డి, శ్వేత, దుర్గం శివశంకర్, పూర్ణచంద్ర, నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల వేణుగోపాల్, రేగురాజు, పెద్ది శ్రీనివాస్, గాదె వినోద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ ఏడీఓ, దూలపల్లి పీఏసీఎస్ ఛైర్మన్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మీరెడ్డిలను నియమించింది.

అభివృద్ధి పనులు ప్రారంభం ఘట్‌కేసర్: ప్రతి వార్డుకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని బుధవారంఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావనిపేర్కొన్నారు.

ప్రహరీ కూల్చివేత: బోడుప్పల్ : బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెంగిచర్ల పాత గ్రామ పంచాయతీ ప్రహరీని కొందరూ కూల్చివేశారు. మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు ప్రహరీని కూల్చివేయడంతో కమిషనర్ బుధవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాద్షా రకం గోధుమ వంగడం విడుదల

మేడ్చల్: నూజివీడు సీడ్స్ అభివృద్ధి చేసిన బాద్షా రకం గోధుమలకు ప్రభుత్వ అనుమతి లభించింది. గుండ్లపోచంపల్లిలో నూజివీడు సీడ్స్ కంపెనీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మండవ ప్రభాకర్‌రావు విత్తనాలు మార్కెట్‌లోకి విడుదల చేశారు.

బొంతు కమలమ్మకు నేతల నివాళి

కాప్రా,న్యూస్‌టుడే: మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కుటుంబాన్ని పలువురు నేతలు పరామర్శించారు. ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి దయాకర్‌రావు, వి.ప్రకాశ్ తదితరులున్నారు. కమలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఊరికి వెళ్దాం పద..పద

కాప్రా, ఉప్పల్, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండగకు జనం ఊరి బాట పట్టారు. స్వగ్రామాలకు వెళ్లే జనంతో ఉప్పల్ బస్టాప్ కికిటలాడుతున్నాయి.సీట్లు కోసం జనం పడుతున్న ఇబ్బందులు పడ్డారు.


బస్సు ఎక్కేందుకు పాట్లు పడుతున్న మహిళలు


ఉప్పల్లో చిన్నారిని కిటికీలో లోనుంచి బస్సులోనికి పంపి..

అక్రమ నిర్మాణాలపై సభ్యుల నిరసన

పీర్జాదిగూడ (బోడుప్పల్): పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పాలకవర్గ సమావేశం బుధవారం వాడీవేడిగా సాగింది. నగర మేయర్ అమర్‌సింగ్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఓ ఫంక్షన్ హాల్‌పై నిర్మించిన అక్రమ షెడ్డు, నిర్మాణాలపై 13వ డివిజన్ సభ్యురాలు ప్రసన్నలక్ష్మి మేయర్ అమర్‌సింగ్, కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావును సూటిగా ప్రశ్నించడంతో సమావేశంలో రాద్ధాంతం ఏర్పడింది. అక్రమ నిర్మాణాలపై కమిషనర్ వైఖరేంటో చెప్పాలని ప్రసన్నలక్ష్మి పట్టుపట్టారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు


కీసరలోని పెద్దమ్మ చెరువు

కీసర, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన సద్దుల బతుకమ్మ పండగకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం శివారులోని కీసర, మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్, మూడుచింతలపల్లి మండలాలతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీల్లో మహిళలు బతుకమ్మ ఆటలు ఆడుకునేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు.

● మొదటి రోజు ఎంగిలి బతుకమ్మ పండుగ రోజున కీసర పెద్దమ్మ చెరువు వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం వల్ల చీకట్లో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే అటవీ శాఖ అధికారులతో మాట్లాడి చెరువు వద్ద విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించారు. ● పెద్దమ్మ గుడి వద్ద గుంతను తీయించి తాత్కాలిక నీటి కుంటలో బతుకమ్మలు నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, మేడ్చల్ చెరువుల వద్ద రాత్రి వేళ చీకటిగా ఉండకుండా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. ● చెరువులు, కుంటలు అందుబాటులో లేని చోట్ల తాత్కాలిక నీటి కుంటలను ఏర్పాటు చేశారు. ● గతంలో బతుకమ్మ తయారీకి అవసరమైన గునుగు, బంతి, చామంతి పూలు వ్యవసాయ పొలాల్లో ఎక్కడంటే అక్కడ దొరికేవి. ● పట్టణీకరణతో వ్యవసాయ పొలాలు కనుమరుగవ్వడంతో పూలు దొరకడం గగనంగా మారింది. ● పూలకు డిమాండ్ పెరిగింది. ఆటోలు గునుగు, బంతి, చామంతి, తంగేడు పూలను కిలోల చొప్పున విక్రయించారు. కిలోకు రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయించారు.


పెద్దమ్మ గుడి వద్ద తాత్కాలిక నీటి కుంట


ఇంటింటికి తిరిగి విక్రయిస్తున్న గునుగు, బంతి పూలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

మేడ్చల్,న్యూస్‌టుడే: మేడ్చల్ పట్టణం బాలాజీనగర్ రోడ్డు నెంబర్8లో ఉండే రాజేంద్రప్రసాద్ మంగళవారం రాత్రి హౌసింగ్‌బోర్డు కాలనీలో నవరాత్రి వేడుకలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు తిరిగి వచ్చి వచ్చి చూస్తే..బీరువాలోని 8తులాల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి, రూ.8 వేలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారని. సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఉరేసుకొని మేస్త్రీ ఆత్మహత్య

ఉప్పల్: మద్యానికి బానిసైన మేస్త్రీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఉప్పల్ ఐడీఏలోని లక్ష్మీనారాయణకాలనీలో ఉండే విజయ్‌కుమార్(39) తాపీమేస్త్రీగా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లోనే చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అనుమానాస్పదస్థితిలో లారీ డ్రైవర్ మృతి

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ఓ డ్రైవర్ అనుమానాస్పదస్థితిలో లారీలోనే మృతి చెందాడు. ఘట్‌కేసర్ ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..హరియాణానాకు చెందిన సుఖ్వీందర్(49) ఈనెల 4న ట్రావెల్స్ పోర్ట్ ఏజెన్సీ ద్వారా నల్గొండ జిల్లా చింతపల్లికి లారీతో వచ్చాడు. అక్కడ కాటన్ సీడ్స్ లోడ్‌తో బయలుదేరాడు. బుధవారం ఉదయం ఘట్‌కేసర్ ఔటర్ రోడ్డు పక్కన లారీ నిలిపి ఉంది. అందులో డ్రైవర్ మృతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, అధికంగా డ్రైవింగ్ చేయడంతో అలసటతో గానీ అనారోగ్యంతో మృతి చెంది ఉంటారని ఎస్సై పేర్కొన్నారు.



జూబ్లీహిల్స్: సరస్వతిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి


సంజీవరెడ్డినగర్: సరస్వతిదేవి అలంకరణలో అలరించిన బల్కంపేట ఎల్లమ్మ


రాణిగంజ్: ఉజ్జయిని మహాకాళి అమ్మవారి వైభవం.. సరస్వతీదేవి అలంకరణలో దర్శనం


దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం రోజును పురస్కరించుకొని ముషీరాబాద్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆర్‌ఎంపీ భార్య హత్య కేసులో నిందితుడి అరెస్ట్


షేక్ జావిద్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: చీటికి కట్టిన డబ్బులు ఇవ్వకపోగా బెదిరింపులకు దిగడంతో కోపం పెంచుకొని ఆర్‌ఎంపీ భార్యను ఓ ఆటో డ్రైవర్ హత్య చేశాడు. జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలోని నవోదయ కాలనీలో సెప్టెంబరు 30న జరిగిన హత్య కేసును జూబ్లీహిల్స్ పోలీసులు ఛేదించారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌లోని ఖాజీపేటకు చెందిన షేక్ జావిద్ అలియాస్ జావిద్ ఖాన్ అలియాస్ అమేర్ అలీ(34) విద్యానగర్ సమీపంలోని శివం రోడ్‌లో ఉంటూ.. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి నవోదయ కాలనీలో నివసించే ఆర్‌ఎంపీ ఉమామహేశ్వర్ రావు భార్య సుధారాణి(44)తో 2022లో ఆమె బంధువుల ద్వారా పరిచయం ఏర్పడింది. సుధారాణితో ఉన్న పరిచయంతో జావిద్ ఆమెకు చీటి కోసం డబ్బులు చెల్లించాడు. చీటికి సంబంధించి దాదాపు రూ.2.8 లక్షలు సుధారాణి ఇవ్వాల్సి ఉంది. డబ్బులు ఇవ్వకుండా చాలా కాలంగా జావిద్‌ను ఆమె ఇబ్బంది పెడుతోంది. దీనికి తోడు నాలుగు నెలల క్రితం తెలిసిన వారితో అతనిపై దాడి చేయించింది. దీంతో కక్ష పెంచుకున్న జావిద్ గత నెల 27న సికింద్రాబాద్ బ్లూసీ హోటల్ సమీపంలో కూరగాయల కత్తిని కొనుగోలు చేశాడు. సుధారాణి పిల్లలు సాయంత్రం 5 గంటల సమయంలో ట్యూషన్‌కి, భర్త 5.30 గంటలకు ఆసుపత్రికి వెళ్తాడని తెలిసిన జావిద్ వారు వెళ్లిన తర్వాత ఆమె ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా సమయం కావాలంటూ కోరింది. తిరిగి జావిద్ సెప్టెంబరు 30న సాయంత్రం 6 గంటల తర్వాత సుధారాణి నివాసానికి వెళ్లాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానని, లేదంటే తప్పుడు కేసులు పెట్టి ఇరికిస్తానంటూ సుధారాణి బెదిరింపులకు దిగడంతో కోపం పెంచుకున్న జావిద్ తనతోపాటు తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతు కోసి ఇంట్లోని ఆభరణాలతో పరారయ్యాడు. నిందితుడిని మంగళవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో చెంగిచెర్ల సమపంలోని కాంత్రినగర్ వద్ద జూబ్లీహిల్స్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిని మంగళవారం రాత్రి న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

విమానాశ్రయంలో ఇద్దరు సైబర్ నేరస్థులు..

శంషాబాద్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో భద్రతాధికారులు అరెస్టు చేశారు. మహారాష్ట్ర చెందిన సంజీవ్, సాగర్ కలిసి ఇటీవల ఉపాధి కోసం బ్యాంకాక్ వెళ్లారు. కొంత కాలంగా భారత్ నుంచి విదేశాలకు మానవ అక్రమ రవాణా చేయడంతో పాటు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వీరి కదలికలపై మహారాష్ట్ర పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో వారు బ్యాంకాక్ నుంచి స్వదేశానికి వస్తూ.. మహారాష్ట్రలో దిగితే పోలీసులు పట్టుకుంటారని భావించి శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ భద్రతాధికారులు అదుపులోకి తీసుకుని చరవాణులను పరిశీలించగా నేరాల గుట్టు రట్టయింది.

కాసుల యావ.. కేసుల పక్కాతోవ!



ఆర్థిక నేరాలు, రహదారి ప్రమాదాల్లో బాధితుల గగ్గోలు

కాపాడాల్సిన రక్షక భటుల్లో కొందరు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. కాసుల కక్కుర్తితో కేసులను పక్కదారి పట్టిస్తున్నారు. రహదారి ప్రమాదాలు, ఆర్థిక నేరాల్లో నిందితులకు అనువుగా సెక్షన్లు మార్చి సహకరిస్తున్నారు. పలువురు బాధితులు తమకు న్యాయం చేయాలంటూ ఉన్నతాధికారులను ఆశ్రయించటం పరిస్థితికి అద్దంపడుతోంది. మూడు కమిషనరేట్ల పరిధిలో ఏటా 60-70 వేలకు పైగా కేసులు నమోదు అవుతుంటాయి. పని ఒత్తిడి, ఆధారాల సేకరణలో జాప్యంతో 40-50 శాతం కేసుల దర్యాప్తు ముందుకు సాగడం లేదు. కొన్ని ఠాణాల పోలీసు అధికారులు.. భారంగా భావించి కొత్త కేసులు నమోదు చేయడం లేదు.

వేటుపడినా మారని రూటు..


- గతేడాది పంజాగుట్ట ఠాణా పరిధిలో ప్రజాభవన్ వద్ద రహదారి ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మాజీ ప్రజాప్రతినిధి తనయుడిని తప్పించి, నిందితుడిగా మరో వ్యక్తిని చేర్చటం సంచలనమైంది. ఉద్దేశపూర్వకంగానే కేసును పక్కదారి పట్టించినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలటంతో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై సస్పెన్షన్ వేటు పడింది.
- తూర్పు మండలం పరిధిలోని ఓ ఠాణా ఇన్‌స్పెక్టర్ రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తిని తప్పించి, మరొకరిని నిందితుడిగా చేర్చిన విషయం ఉన్నతాధికారులకు చేరటంతో అంతర్గత విచారణకు ఆదేశించారు. వాస్తవమని తేలటంతో అతడిని బదిలీ చేశారు.

ఇప్పుడూ అలాగే..

సౌత్‌వెస్ట్‌లోని ఠాణాకు సెల్‌ఫోన్ చోరీకి గురైందని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితుడుని వెనక్కి పంపారు. దక్షిణ మండల పరిధిలోని రౌడీషీటర్ తుపాకీతో బెదిరిస్తున్నాడంటూ ఒక బాధితుడు పోలీసులను ఆశ్రయిస్తే.. కేసు నమోదు చేస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయంటూ ఎస్‌హెచ్‌వో చెప్పాడంటూ బాధితుడు వాపోయాడు. పాతబస్తీ పరిధిలో ఇంటిని ఆక్రమించారంటూ బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెళితే ప్రైవేటు కేసంటూ తిరస్కరించినట్లు బాధితులు ఉన్నతాధికారులను ఆశ్రయించారు.

ఈనాడు, హైదరాబాద్

మూసీ వెంట వాహనాల.. కిరాయి మాఫియా



లారీ, టస్కర్ వంటి సరకు రవాణా వాహనాల యజమానులు, డ్రైవర్లు.. వేడుకలు, ఊరేగింపుల సమయాల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు రావాలంటేనే వణికిపోతున్నారు. నగరం మొత్తం వేడుకగా చేసుకునే ఊరేగింపు సమయాల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటోంది. వాహనంలోని వ్యక్తుల్ని చితకబాది ఒకచోట బంధించి బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారు. యజమానుల అంగీకారంతో ఊరేగింపు కోసం వాహనం తీసుకుంటే ఎవరూ తప్పుబట్టరు. ఇవేవీ పట్టించుకోకుండా భారీ వాహనం కనిపించగానే బలవంతంగా అడ్డుకుని.. దాడి చేసి లాక్కెళ్లడం వివాదాస్పదంగా మారుతోంది. దాడి చేసి వాహనాలు అడ్డుకోవడంపై పోలీసులకు ఏటా వందల సంఖ్యలో వస్తున్నాయి. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాహనాన్ని ధ్వంసం చేస్తారనో.. చిత్రహింసలు పెడతారనే ఉద్దేశంతోనో మిన్నకుండిపోతున్నారు. కొందరు భారీ వాహనాలతో నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లోకి వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఒకవేళ లోడుతో వచ్చినా తమపై ఎవరు దాడి చేస్తారోనని.. బిక్కుబిక్కుమంటూ నగరం దాటాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

ఇదో వ్యవస్థీకృత దందా

వేడుకలు, ఊరేగింపుల సమయాల్లో వాహనాలను అడ్డగించడం ఒక వ్యవస్థీకృత దందాలా సాగుతోందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. దాడి చేసి అడ్డగించిన వారే వాహనాన్ని ఊరేగింపునకు వినియోగించకుండా ఇతరులకు అద్దెకోసం ఇవ్వడం వీరి ఆగడాలకు అద్దం పడుతోంది. ముఖ్యంగా పాతబస్తీ.. సమీప ప్రాంతాలకు చెందిన కొన్ని ముఠాలు ఈ తరహా దారుణాలకు దిగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇదీ ఉదాహరణ

కర్ణాటకకు చెందిన భారీ సరకు వాహనాన్ని ఆదివారం పటాన్‌చెరు దగ్గర పార్కింగ్ చేయగా కొందరు హఠాత్తుగా వచ్చి డ్రైవరు, క్లీనర్‌పై దాడి చేసి ఫోన్లు లాక్కున్నారు. ఊరేగింపునకు వాహనం కావాలని పటాన్‌చెరు నుంచి కుల్సుంపుర ప్రాంతానికి తీసుకొచ్చారు. పోలీసుల జోక్యంతో వాహనాన్ని, డ్రైవర్లను వదిలేశారు.

ఈనాడు, హైదరాబాద్



పర్యావరణ పరిరక్షణపై నిత్యం వల్లెవేసే జీహెచ్‌ఎంసీ ఇలాంటి వాహనాలపై ఎప్పుడు దృష్టి సారిస్తుందో? ఖైరతాబాద్ పైవంతెనపై పొగలు కక్కుతూ వెళ్తున్న ఈ చెత్త తరలింపు వాహనంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట ప్రాంతంలోని నాదర్‌గుల్‌లో రెడ్డి చెరువు ఇది. ఎవరు కట్టారో.. ఎప్పుడు కట్టారో కానీ.. పక్కా నిర్మాణాలు చెరువు గర్భంలోనే దర్శనం ఇస్తున్నాయి.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ వక్ర బుద్ధి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: మహిళపై ఓ కానిస్టేబుల్ లైంగిక దాడికి యత్నించిన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సాహెబ్ నగర్ పరిధిలోని గాయత్రీనగర్ నుంచి గతేడాది డయల్ 100కు ఓ ఫిర్యాదు వచ్చింది. సమస్యను తెలుసుకునేందుకు పోలీసులు అక్కడకు వెళ్లారు. అందులో జగన్‌గౌడ్ అనే ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బాధితురాలితో పరిచయం పెంచుకున్నాడు. ఆ మహిళ తన వద్ద ఉన్న బంగారం, డబ్బు అతడికి ఇచ్చింది. డబ్బులు ఇస్తానని, ఈ నెల 4న ఆమెను కారులో ఇంజాపూర్ పరిధిలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు తప్పించుకొని ఈ నెల 7న వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ కాశీరెడ్డి తెలిపారు..

మైనర్‌పై మారుతండ్రి నాలుగేళ్లుగా అఘాయిత్యం

పోక్సో కేసు నమోదు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మైనరు కుమార్తెపై నాలుగేళ్ల పాటు అఘాయిత్యానికి పాల్పడిన మారుతండ్రిపై పోక్సో కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ మహిళ 2010లో తన భర్తతో విడాకులు తీసుకుంది. ఇద్దరు కూతుళ్లు ఉండటంతో మహిళ తన కూతుళ్లను ఊళ్లో సోదరుడి వద్ద వదిలేసి వచ్చింది. అనంతరం రహ్మత్‌నగర్‌కు చెందిన లింగంపల్లి మహేందర్‌తో మహిళకు ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక బాబు పుట్టాడు. ఊళ్లో ఉన్న కూతుళ్లను ఇంటికి తీసుకురావాలని మహేందర్ అడగడంతో ఒప్పుకున్న మహిళ 2019లో పెద్ద కుమార్తెను తీసుకువచ్చింది. పని లేకపోవడంతో మహేందర్ ఇంట్లోనే ఉండేవాడు. మహిళ పనికి వెళ్లేది. ఇంట్లో ఒంటరిగా ఉన్న 9 ఏళ్ల కుమార్తెపై మారు తండ్రి అఘాయిత్యానికి పాల్పడటం మొదలు పెట్టాడు. విషయం తెలియడంతో బయట చెబితే చంపేస్తానని ఇద్దరినీ బెదిరించాడు. ఇలా 2019 నుంచి ఫిబ్రవరి 2023 వరకు మైనర్ కుమార్తెపై మారుతండ్రి అఘాయిత్యానికి పాల్పడుతూనే ఉన్నాడు. బాలికను కాపాడటానికి తల్లి కుమార్తెను 2023లో గవర్నమెంట్ హాస్టల్‌లో చేర్పించింది. ఈ నెల 8న ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మహేందర్ మహిళకు సంబంధించిన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, డబ్బులు, టీవీ, ల్యాప్‌టాప్‌తో పాటు ఇతర వస్తువులను ఇంట్లో నుంచి తీసుకొని, బయట నుంచి గడియపెట్టి వెళ్లిపోయాడు. స్థానికుల సహాయంతో గడియను తొలగించిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడింగ్‌లో రూ.16.50 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ట్రేడింగ్‌లో లాభాలిస్తామని నమ్మించి నగదు దోచేశారంటూ బాధితురాలు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో బుధవారం ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్‌కు చెందిన 62 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగినికి ట్రేడింగ్ యాప్ లింక్ వచ్చింది. బాధితురాలు గతంలో మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో పెట్టుబడులు పెట్టారు. దాంతో అదే కంపెనీ పేరుతో వచ్చిన లింక్‌పై క్లిక్ చేసి యాప్‌లో సభ్యత్వం తీసుకున్నారు. రూ.16.50 లక్షలు పెట్టుబడులు పెడితే అదనంగా రూ.29 లక్షలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దాంతో బాధితురాలు పెట్టుబడి పెట్టేశారు. ఆ తర్వాత అవతలి వ్యక్తి స్పందించలేదు. ఆమె గతంతో తాను ట్రేడింగ్ చేసిన ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రతినిధి అరవింద్‌ను సంప్రదించగా ఆ క్లబ్‌కు తమ కంపెనీతో సంబంధం లేదని చెప్పేశారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

ఉద్యోగ విషయమై మనస్తాపం.. యువతి ఆత్మహత్య

మాదాపూర్, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మాదాపూర్ ఠాణా ఎస్ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా మణుగూరుకు చెందిన మహ్మద్ ముస్కాన్(23) హైటెక్‌సిటీలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. పని ఒత్తిడి కారణంగా ఉద్యోగం మానేసి రెండు నెలలుగా ఖాళీగా ఉంటుంది. మరో ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న ఆమె రెండు రోజుల క్రితం మాదాపూర్ క్యాపిటల్ రోడ్డులోని హాస్టల్‌లో ఉంటున్న తన సోదరి హసీనా వద్దకు వచ్చి అక్కడే ఉంటుంది. మంగళవారం సాయంత్రం హసీనాతోపాటు మిగితా రూమ్మేట్స్ ఉద్యోగాలకు వెళ్లిపోగా ముస్కాన్ ఒంటరిగా ఉంది. బుధవారం తెల్లవారుజామున విధులు ముగించుకొని హసీనా హాస్టల్‌కు వచ్చి చూడగా గది తలుపులు పెట్టి ఉన్నాయి. ముస్కాన్‌కు ఫోన్ చేసినా ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చిన హాస్టల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన పోలీసులు గది తలుపులు పగలగొట్టి చూడగా ముస్కాన్ ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది.

ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లపై అఖిలపక్షానికి డిమాండ్


ఐక్యత చాటుతున్న కీర్తిలత, మల్లేష్‌యాదవ్, వెంకటేష్, గుజ్జకృష్ణ, ఆర్.కృష్ణయ్య, జనార్దన్, నందగోపాల్, అంజి, హరితిలక్‌సింగ్

కాచిగూడ, న్యూస్‌టుడే: ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల విధివిధానాలపై బీసీ, ఎస్సీ సంఘాలు, ప్రధాన రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 54 శాతం జనాభా ఉన్న బీసీలకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కంటే అధికంగా గురుకులాలు ఉన్నాయని, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఎలా ఉంటుందో స్పష్టం చేయాలన్నారు. బుధవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల రూ.4500 కోట్ల ఫీజు బకాయిల్లో రూ.1500 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి మిగిలిన రూ.3 వేల కోట్ల బకాయిలు పెద్ద భారం కాదన్నారు. నేతలు కోలా జనార్దన్, గొరిగె మల్లేష్‌యాదవ్, నీల వెంకటేష్, అంజి, నందగోపాల్, కీర్తిలత, హరితిలక్‌సింగ్, రిషి ముదిరాజ్, ప్రణీత పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం.. నిందితుడికి జీవితఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: బాలికను భయభ్రాంతులకు గురిచేసి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.20,000 జరిమానా విధించింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత బర్ల కథనం ప్రకారం.. 2012లో ఫలక్‌నుమాకు చెందిన మహమ్మద్ అల్తాఫ్ జిల్దాని (40) ఓ బాలిక(13)ను భయపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం బయట ఎవర్నికైనా చెబితే, కుటుంబ సభ్యులందరినీ చంపుతానని బెదిరించి.. పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఏకాంతంగా గడిపిన సమయంలో వీడియోలు తీశానని, సహకరించకుంటే వాటిని బంధువులకు పంపుతానని పైశాచికత్వం ప్రదర్శించేవాడు. బాలిక మేజరైన తర్వాత 2018లో వివాహం చేసుకొని అత్తారింటికి వెళ్లిపోయినా, జిల్దాని తీరు మార్చుకోలేదు. పదేపదే బాధిత యువతికి ఫోను చేసి, తన దగ్గరకు రావాలని, లేకుంటే వీడియోలు ఆమె భర్తకు పంపిస్తానని బెదిరించాడు. బాధితురాలు బాలాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి బుధవారం తీర్పు వెల్లడించారు.

రాములోరి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


రామాలయంలో న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ లక్ష్మణ్‌కు వేదాశీర్వాదం చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, నందలూరు: ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని, నందలూరులోని శ్రీసౌమ్యనాథ స్వామి ఆలయాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ లక్ష్మణ్ బుధవారం సందర్శించారు. రాములోరి సన్నిధికి వచ్చిన న్యాయమూర్తులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

కొబ్బరిపీచు, పంచదార పాకంతో కల్తీ టీ పొడి


స్వాధీనం చేసుకున్న పొడరు సంచులు. చిత్రంలో నిందితులు

ఈనాడు, హైదరాబాద్: బడలిక తీర్చుకొని.. కాస్త ఉపశమనం పొందేందుకు దారెంట టీ బంక్ వద్ద ఆగారా! ఒక్క క్షణం.. అక్కడ వాడుతున్న టీ పొడిని చూశాకే రుచి చూడండి. నగరంలో టీ దుకాణాలకు తక్కువ ధరకు కల్తీ టీ పొడి సరఫరా చేస్తున్న ముఠాను ఆటకట్టించారు మధ్యమండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు. కల్తీ టీ పొడి తయారు చేసి దుకాణాలకు విక్రయిస్తున్న ముగ్గురు కల్తీరాయుళ్లను అరెస్ట్‌చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర బుధవారం తెలిపారు. బాలానగర్‌లోని ఫతేనగర్‌కు చెందిన బి.జగన్నాథ్(32) స్థానికంగా 'కోణార్క్ టీ పౌడర్ సేల్స్, సప్లయిర్స్' పేరిట వ్యాపారం చేస్తున్నాడు. నాసిరకం టీ పొడి కిలో రూ.80-100కు కొనుగోలు చేసేవాడు. ఆ పొడిలో కొబ్బరిపీచు పొడి, పంచదారపాకం, రసాయనాలు కలిపి కొత్తరకం టీపొడికి రూపమిస్తున్నాడు. దాన్ని కిలో రూ.200-250 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఒడిశాకు చెందిన ప్రతాప్ ప్రదాన్ (21), శివాశ్విన్ ఫరిదా (19) ఇతడి వద్ద పనిచేస్తున్నారు. వీరిద్దరూ దుకాణాల వద్దకు సరకు చేరవేసేవారు. తక్కువ ధరకు టీ పొడి వస్తుందనే ఉద్దేశంతో టీ బంక్ నిర్వాహకులు, చిల్లర దుకాణదారులు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌నుబట్టి రోజూ 100-200 కిలోలు తయారు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తదుపరి చర్యల కోసం నిందితులను ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ప్రధాన నిందితుడిపై గతంలో మూడు కేసులున్నట్టు డీసీపీ తెలిపారు. కల్తీ టీపొడి వాడకంతో కామెర్లు, టైఫాయిడ్, ఎలర్జీలు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొనుగోలు చేసే ముందు నాణ్యతను పరిశీలించుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు

ఫారెంటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00


రాజ్‌భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆయన సతీమణి సుధాదేవ్ వర్మ, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీఎస్ శాంతి కుమారి, మహిళా సాధికారత కార్పొరేషన్ ఛైర్మన్ బండ్రు శోభారాణి, గవర్నర్ కార్యదర్శి బి.వెంకటేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సోమాజిగూడ


హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ వెంకటాచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య, అధికారులు జ్యోతి, డాక్టర్ సురేందర్, ఆశన్న, సదానందం, హేమలత తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, గన్‌ఫౌండ్రీ


కెనడాలోని టొరంటో నగరంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (టీడీఎఫ్) కెనడా నేతృత్వంలో పనిచేసే తంగేడు సాంస్కృతిక సంస్థ నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వందలాది మంది పాల్గొన్నట్లు టీడీఎఫ్ ఫౌండేషన్ కమిటీ ఛైర్మన్ సురేందర్ పెద్ది తెలిపారు. - ఈనాడు, హైదరాబాద్


చైతన్యపురిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. - న్యూస్‌టుడే, నాగోలు


రవీంద్రభారతిలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో నటి మహతి, మహిళలు

ప్రకృతిని ఆరాధించే పండగే బతుకమ్మ

అంబర్‌పేట: దేవుళ్లను పూలతో పూజిస్తాం.. పూలకే పూజచేసే.. ప్రకృతిని ఆరాధించే పండగే బతుకమ్మ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల శ్రమైక జీవనం, ఆత్మగౌరవానికి ప్రతీకైన బతుకమ్మ పండగ ప్రకృతిలోని పూలతో ముడిపడి ఉందన్నారు.


బతుకమ్మలతో కేంద్రమంత్రి సతీమణి కావ్య, సినీ నటి కావ్య థాపర్, ఉమారాణి, గాయని మంగ్లీ, చిత్రంలో కిషన్‌రెడ్డి, గౌతంరావు, వినోద్‌యాదవ్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివాహ పత్రిక


సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి

గౌతంనగర్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన మామ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ నెల 27న జరగనున్న తన కుమార్తె శ్రేయారెడ్డి వివాహానికి విచ్చేయాలని పెళ్లి పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఆ సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు అక్కడ ఉన్నారు.

దుబాయ్‌లో ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

కార్ఖానా, న్యూస్‌టుడే: దుబాయ్ (యూఏఈ)లోని బైక్ రైడర్స్ (డెలివరీ బాయ్స్) ఉద్యోగాలకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని టామ్‌కామ్(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) జనరల్ మేనేజర్ కె.నాగభారతి బుధవారం తెలిపారు. అభ్యర్థులు కనీసం రెండు సంవత్సరాల అనుభవంతోపాటు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడేళ్ల భారతీయ ద్విచక్ర వాహన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. అభ్యర్థులు 21 నుంచి 40 సంవత్సరాల మధ్యవారై ఉండాలన్నారు. వివరాలకు ఫోన్ నం.94400 51285, 94400 48500లలో, వెబ్‌సైట్ (www.tomcom.telangana.gov.in)లో తెలుసుకోవచ్చు.

మహీంద్రా లాజిస్టిక్‌లో ఉద్యోగ అవకాశాలు

గోల్నాక: గ్రేటర్ పరిధిలోని నిరుద్యోగ యువతకు మహీంద్రా లాజిస్టిక్ అనుబంధ విజార్డ్‌లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు మేనేజర్ దీప్తి తెలిపారు. ఆసక్తి గల వారు ఫోన్ 73373 32606ను సంప్రదించాలన్నారు.

ఉస్మానియాకు రూ.2.5 కోట్లతో అల్ట్రాసౌండ్, సీ-ఆమ్ పరికరం


అల్ట్రాసౌండ్, సీ-ఆమ్ పరికరాన్ని ప్రారంభించిన ఆర్వీ కర్ణన్, పక్కన డా.ఆనంద్, డా.నాగేందర్

ఉస్మానియా ఆసుపత్రి: రోగుల్ని ఆదుకునేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర కుటుంబ, సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. బుధవారం ఉస్మానియా ఆసుపత్రిలోని యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా.మల్లికార్జున్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఆనంద్, సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్, పూర్వ సూపరింటెండెంట్ డా.బి.నాగేందర్‌ల ఆధ్వర్యంలో మోబీస్ ఇండియా సౌజన్యంతో రూ.2.5 కోట్ల పైచిలుకు విలువ చేసే అల్ట్రాసౌండ్, సీ-ఆమ్ వైద్య పరికరాన్ని యూరాలజీ విభాగానికి వితరణ చేశారు. అంతకుముందు ఆయన మూడో అంతస్తులోని నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. పేద రోగులకు భూరి విరాళాన్ని అందించిన సంస్థ ప్రతినిధులను డా.రాకేశ్ సహాయ్ అభినందించారు. రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డా.వాణి, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ నరేందర్‌కుమార్, ఆర్ఎంవోలు డా.జయకృష్ణ, కవిత, సిద్దిఖీలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజారోగ్య అదనపు సంచాలకురాలిగా శశిశ్రీ



సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రజారోగ్య అదనపు సంచాలకురాలిగా (ఏడీ-పరిపాలన) కాకుమాను శశిశ్రీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీపీఎస్సీ ద్వారా 1995లో గ్రూప్-1 అధికారిగా ఎంపికై పరిపాలన అధికారి (ఏఓ)గా వైద్యారోగ్య శాఖలో చేరారు. 1999లో సహాయ సంచాలకులుగా పదోన్నతి పొంది కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల(ఓఎంసీ)లో బాధ్యతలు నిర్వర్తించారు. 2000లో ఉప సంచాలకులు(డీడీ)గా పదోన్నతి పొంది డీహెచ్, డీఎంఈ, సీఎఫ్ డబ్ల్యూ కమిషనరేట్ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2021లో సంయుక్త సంచాలకుగా పదోన్నతి పొంది మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డులో సేవలందించారు. పదోన్నతిపై రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు కార్యాలయంలో అదనపు సంచాలకులు (ఏడీ-పరిపాలనా)గా బాధ్యతలు స్వీకరించారు.

కృత్రిమమేధతో మూసీకి స్వచ్ఛత

- సీబీఐటీ ఇంజినీరింగ్ విద్యార్థుల వినూత్న ప్రణాళిక
- ప్రస్తుత.. భవిష్యత్ అవసరాల రూపకల్పన


ప్రాజెక్టులో అంశాలు వివరిస్తున్న విద్యార్థినులు


ఈనాడు, హైదరాబాద్: మూసీ నదీ గర్భంలో ఇళ్లు.. ఇరువైపులా అక్రమ నిర్మాణాలు.. విషతుల్యమైన నీటితో నిండిన నదిని స్వచ్ఛంగా మార్చేందుకు హైదరాబాద్‌లోని సీబీఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన నాలుగో సంవత్సరం విద్యార్థులు ఐదుగురు వినూత్న ప్రణాళిక రూపొందించారు. కృత్రిమ మేధ, డ్రోన్ పరిజ్ఞానంతో మూసీ సుందరీకరణ సాధ్యమేనని ఓ ప్రాజెక్టును తయారు చేశారు. గచ్చిబౌలిలో ఇటీవల జరిగిన కృత్రిమ మేధ సదస్సులో ప్రణాళికను ప్రదర్శించగా.. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు తిలకించారు. ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా స్వచ్ఛమూసీని ఎంచుకున్నారు. తెలంగాణ సాంకేతిక సేవల విభాగం సహకారంతో 44 కి.మీ. పొడవైన మూసీని మార్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశాలను పొందుపరిచారు. ప్రభుత్వ పరిశీలనకు ఈ ప్రాజెక్టును పంపేందుకు యత్నాలు చేస్తున్నారు.

మురికి వెలికితీతకు డ్రోన్ పరిజ్ఞానం..

సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మేఘన, మమత, శ్రియ, చరిష్మా, సాహితిలు మూసీ సుందరీకరణపై ప్రాజెక్టును రూపొందించాలని 3నెలల క్రితం అనుకున్నారు. కృత్రిమ మేధతో పాటు డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువగా వినియోగించాలని సాఫ్ట్‌వేర్ రూపొందించారు. మూసీలో మురుగు, వ్యర్థాల వెలికితీతకు డ్రోన్ పరిజ్ఞానాన్ని వినియోగిస్తే సరిపోతుందన్న వివరాలను పొందుపరిచారు. మనుషులతో మురుగు, వ్యర్థాలను తీయడం సాధ్యం కాదని, డ్రోన్ పరిజ్ఞానంతో యంత్రాలతో మూసీలో ఎంతలోతులో ఉన్నా వర్థాలు, రాళ్లురప్పలను తీసి వేగంగా తరలించేందుకు సాధ్యమవుతుందని వివరించారు. కృత్రిమ మేధ, డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో ఒక కి.మీ.పరిధిలో వ్యర్థాలు, మురుగు, దాన్ని బయటకు పంపించేందుకు అవసరమైన వ్యవధిని పేర్కొన్నారు.

బహుళ అంతస్తుల భవనాలు
ఉద్యానాలు.. వినోద కేంద్రాలు

మూసీ బఫర్‌జోన్‌కి వెలుపల బహుళ అంతస్తుల భవనాలు, ఉద్యానాలు, వినోద కేంద్రాలు, మ్యూజియంలను ఏర్పాటు చేసే ప్రాంతాలు, స్థలాల వివరాలను నివేదించారు. పురానాపూల్, చాదర్‌ఘాట్‌లతో పాటు మరిన్ని ప్రాంతాల్లో వంతెనలు ఆధునీకరించాలని, లేదా కొత్తవి నిర్మించాలన్నారు. మూసీ పొడవునా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించాలని, నదిలో నీటిని ఎవరు కలుషితం చేసినా తెలుసుకునేందుకు కృత్రిమమేధతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు.


దండిగా గుమ్మడి.. పండగ సందడి

నవరాత్రుల సందర్భంగా ఇంటి గుమ్మానికి, ఆయుధ పూజకు ఉపయోగించే గుమ్మడి, బూడిద గుమ్మడి కాయలు కొత్తపేట మార్కెట్లో ఇలా దర్శనమిస్తున్నాయి. ఇవి ప్రస్తుతం రూ.50-100 పలుకుతున్నాయి.

'గో రక్షకులకే హిందూ సమాజం ఓటేయాలి'

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: భారతీయుల ఆత్మ లాంటి పవిత్రమైన గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలని జగద్గురు శంకరాచార్య స్వామి శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జ్యోతిర్మఠ్ ఉత్తరాఖండ్ ఆధ్వర్యంలో గో ప్రతిష్ఠ ఆందోళనలో భాగంగా గో ధ్వజ్ స్థాపన భారత్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ ప్రసంగిస్తూ.. సనాతన హిందూ ధర్మం గురించి మాట్లాడే ప్రధాని మోదీ గో హత్యను ఆపలేకపోయారన్నారు. గో మాంసం విక్రయాల్లో భారతదేశంలోనే యూపీ రాష్ట్రం అగ్రస్థానానికి చేరుకుందని, ఇలాంటి పరిస్థితుల్లో తమది హిందూ ప్రభుత్వం అని ఎలా చెబుతారని ప్రశ్నించారు. గో హత్య చేయించే పార్టీలకు ఓటు వేయవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. తితిదేలో సనాతన సమాజానికి సంబంధించి రూ.3 లక్షల కోట్ల ఆస్తులు ఉన్నాయని, కాబట్టి తితిదేనే గోశాల ఎందుకు ఏర్పాటు చేయకూడదని ప్రశ్నించారు. ఇంటర్ కాంటినెంటల్ గ్రూప్ ఛైర్మన్, నిర్వాహకుడు సీఎల్ రాజం, ఎండీ సి.విజయ, డైరెక్టర్లు సి. శ్రీకాంత్, సౌమ్య, సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు, గజల్ శ్రీనివాస్, యుగతులసి ఫౌండేషన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లోరోహైడ్రేట్ ముఠా గుట్టురట్టు


నిందితుడు రాజుభాయ్‌తో ఏఈఎస్ జీవన్ కిరణ్ ఇతర అధికారులు

ఈనాడు, హైదరాబాద్ : కల్తీ కల్లు కోసం ఉపయోగించే క్లోరోహైడ్రేట్ తయారీ ముఠా గుట్టును కనిపెట్టేందుకు రంగారెడ్డి జిల్లా అబ్కారీ అధికారులు మహారాష్ట్రలో భారీ ఆపరేషన్ చేపట్టారు. రెండు ప్రత్యేక బృందాలతో నాలుగు రోజులు మాటువేసి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు క్లోరోహైడ్రేట్ సరఫరా చేసే ముఠా గుట్టురట్టు చేశారు. దాదాపు 9 నెలలుగా పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు సహా మరొకరిని అరెస్టు చేశారు. తొలుత ఇద్దరు సరఫరాదారుల కోసం వెళ్లిన ప్రత్యేక బృందం నిందితులిచ్చిన సమాచారంతో క్లోరోహైడ్రేట్ తయారు చేస్తున్న పరిశ్రమ యజమానిని కూడా అదుపులోకి తీసుకుంది.

కేసు నేపథ్యం ఇది.. ఈ ఏడాది జనవరి జనవరి మూడో తేదీన అబ్కారీ శాఖ అధికారులు బాలానగర్‌లో 560 కిలోల క్లోరోహైడ్రేట్ స్వాధీనం చేసుకుని రామాగౌడ్ అనే ప్రధాన నిందితుడితో పాటు ఆరుగురిని అరెస్టు చేశారు. ఇద్దరు పరారయ్యారు. నిందితులిద్దరూ మహారాష్ట్ర నుంచి తెలంగాణకు మత్తు పదార్థం సరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. జైల్లో ఉన్న రామాగౌడ్‌ను కస్టడీకి తీసుకుని విచారించగా ముంబయిలో కలోజా ప్రాంతంలో వీరు ఉన్నట్లు గుర్తించారు. అబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశాలతో ఇద్దరి అరెస్టు కోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి.

ఆపరేషన్ సాగిందిలా..

ఈ నెల 4న ఈ బృందాలు ముంబయికి వెళ్లాయి. రాజుభాయ్ అలియాస్ రాజు పొన్నం ఉంటున్న ప్రాంతాన్ని స్థానిక పోలీసుల సాయంతో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతని ఫోన్ కాంటాక్టులు.. డేటా పరిశీలించి బుర్రా రమేశ్‌ను భివాండీలో అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరికీ క్లోరోహైడ్రేట్ తయారు చేస్తున్న పుణెకు చెందిన రాజ్ బండారీ అలియాస్ రాజు అనే కీలక నిందితుడితో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. అతని ఆచూకీ కోసం పుణె పరిసర ప్రాంతాల్లోని స్థానిక కల్లు దుకాణాల్లో ఆరా తీయగా.. ఓ ఇంట్లో ఉంటున్నట్లు గుర్తించి అతనిని విచారించారు. సొంతంగా క్లోరోహైడ్రేట్ తయారీ పరిశ్రమ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. దానిపై దాడి చేసి 29 కిలోల సరకు, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రాజుభాయ్, బుర్రా రమేశ్, రాజ్ బండారీని స్థానిక న్యాయస్థానంలో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంటుపై మంగళవారం నగరానికి తీసుకొచ్చారు.

రాజేంద్రప్రసాద్‌కు ప్రభాస్ ఓదార్పు


రాజేంద్రప్రసాద్‌ను ఓదారుస్తున్న ప్రభాస్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను బుధవారం పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఓదార్చారు. నటుడు ప్రభాస్, తెలుగు రాష్ట్రాల సీపీఐ పార్టీ కార్యదర్శులు నారాయణ, రామకృష్ణ నటుడి నివాసంలో ఆయనతో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు.

పేదలకు వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సినీనటి కవిత తదితరులు

అంబర్‌పేట: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. పవిత్రమైన వైద్య వృత్తి ద్వారా డాక్టర్లు ఎందరికో ప్రాణదానం చేస్తున్నారన్నారు. బుధవారం అంబర్‌పేటలో జీవీకే ఎడ్యుటెక్ ఏడో వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సినీనటి కవిత, డైరెక్టర్ విద్యకుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ డెఫ్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా రాజారామ్



కంచన్‌బాగ్ : తెలంగాణ డెఫ్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా జి.రాజారామ్ నియమితులయ్యారు. 16 మందితో సభ్యులతో కూడిన జట్టును బుధవారం తెలంగాణ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది. ఈ నెల 13 నుంచి 19 వరకు పాట్నాలో జరిగే ఐడీసీఏ 8వ టీ-20 నేషనల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ ఫర్ డెఫ్ కోసం ఈ జట్టును ఎంపిక చేశారు. సంగెం చిరంజీవి(వైస్ కెప్టెన్), డి.విజయకుమార్(వికెట్ కీపర్), కె.మోసెస్ పీటర్, పి.వెంకటేశ్వర్‌రావు, ఆర్.విక్టర్ మోసెస్, వి.అనిల్, పి.రాజు, ఎం.సందీప్, డి.శంకర్, ఇ.వెంకటేశ్, వి.బాలసాంబమూర్తి,కె.నర్సింగ్ యాదవ్, బి.రాజు, వి.శ్రీనివాసులు (కోచ్), ఇ.వెంకటేశ్ (మేనేజర్) ఎంపికయ్యారు.

రూ.25 లక్షలు తీసుకొని ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదు

నారాయణగూడ, న్యూస్‌టుడే: డబ్బులు దండుకొని ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయని జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్ యాజమాన్యం పద్మజ, గుంటపల్లి శ్రీనివాసరావులపై సీసీఎస్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసు కథనం ప్రకారం.. బాధితురాలు మోతీనగర్‌కు చెందిన వ్యాపారి ఎం.బిందుమౌనిక జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్ వారి శ్రీనివాస్ టెంపుల్ టౌన్ (యాదాద్రి)లో రెండో అంతస్తులోని రెండు పడకల ఫ్లాట్‌ను రూ.25 లక్షలకు కొనుగోలు చేశారు. సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయకపోతే రూ.15 వేలు అద్దె చెల్లించాల్సి ఉందని అగ్రిమెంట్ చేసుకున్నారు. రెండున్నరేళ్లయినా సంస్థ యాజమాన్యం ఒప్పందంఅమలు చేయలేదని బిందుమౌనిక ఫిర్యాదు చేశారు.

రాయల్టన్ కాలనీలో ఎమ్మెల్యే పాదయాత్ర



సైదాబాద్, న్యూస్‌టుడే: సైదాబాద్-సరూర్‌నగర్ మార్గం రాయల్టన్ కాలనీలో బుధవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల పాదయాత్ర చేశారు. కాలనీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు బల్దియా ఈఈ పీర్‌సింగ్, జలమండలి జీఎం శ్యామ్ నాయక్ చౌహాన్‌లతో కలిసి స్థానికంగా పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. మురుగు పైపులు, బాక్స్ డ్రైన్లు ఆధునికీకరించాలని, సీసీ రోడ్డు వేయించాలని, ప్రమాదకరంగా మారిన విద్యుత్తు ఇనుము స్తంభం తొలగించాలని కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్ యార్‌ఖాన్ వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు షరీఫ్, కోశాధికారి ఇర్ఫాన్, బల్దియా డీఈ బన్సీలాల్, జలమండలి మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, పారిశుద్ధ్యం పర్యవేక్షణాధికారి గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

‘సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ’



ఎల్బీనగర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ర్యాలీ

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేయకుండా, సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుందని ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ ఇన్‌ఛార్జి సుధాకర్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి సరూర్‌నగర్ తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దారు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ.. సుప్రీం తీర్పును అమలు చేయకుండా ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. నాయకులు ప్రకాశ్ మాదిగ, రాజశేఖర్, రాజు, బుచ్చన్న మాదిగ, లింగం, పరుశురాం పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటాలు అవసరం

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటాలు అవసరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రమోహన్, కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి అన్నారు. పార్టీ ఆటోనగర్ శాఖ ప్రథమ మహాసభను బుధవారం మెట్టు కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్, కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న ప్రచార ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అవినీతికి వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను తక్షణమే రద్దు చేసి, కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నూతన కార్యదర్శిగా మెట్టు లింగం యాదవ్‌ను ఎన్నుకున్నారు. నాయకులు లక్ష్మణ్, గడ్డం సత్యనారాయణ, మెట్టు లింగస్వామి, సింగం వీరయ్య, సురేశ్, మల్లేశ్, సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి సత్కారం

కర్మన్‌ఘాట్, వనస్థలిపురం, న్యూస్‌టుడే: చీఫ్ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని చంపాపేట మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, తన అనుచరులతో కలిసి బుధవారం సన్మానించారు. మత్యాల సత్యనారాయణ, ధర్వేశ్ ఖాన్, పెంటయ్య గౌడ్, కృష్ణ, గంగబాబు, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు. శాసనమండలిలోని కార్యాలయంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని ఎల్బీనగర్ కాంగ్రెస్ నేత ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ సత్కరించారు.

పండక్కి ఊరెళ్తున్నారా?

చోరీల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

దసరా, దీపావళి, సంక్రాంతి.. పండుగ ఏదైనా.. నగరంలో స్థిరపడిన సమీప జిల్లాలవాళ్లు సొంతూళ్లకు వెళ్తుంటారు. ఇదే అదనుగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు దోచుకుంటున్నారు. ఎల్బీనగర్, మలక్‌పేట పరిధిలో ఏటా ఈ తరహా నేరాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు నిఘా ముమ్మరం చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలనీల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. – న్యూస్‌టుడే, హయత్‌నగర్, సైదాబాద్



ప్రచార ఆటో ప్రారంభంలో హయత్‌నగర్ పోలీసులు



ఇటీవల ఘటనలు..

● గత నెలలో చాదర్‌ఘాట్ ఠాణా పరిధి అక్బర్‌బాగ్ ఆసిఫ్‌నగర్‌లో మానిక అనే ఉద్యోగిని ఇంటి తాళం పగులకొట్టి చోరీ చేశారు. రూ.80వేల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. ● వారం కిందట దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌లో ఆటోడ్రైవర్ గిరిబాబు ఇంట్లో చోరీ జరిగింది. రూ.3వేల నగదుతో పాటు 29 తులాల వెండి వస్తువులు, 1.5 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ● హయత్‌నగర్ ప్రియదర్శిని కాలనీకి చెందిన శ్రీస్వామి జూన్ 27న తాళం వేసి ఊరికి వెళ్లింది. మరుసటి రోజు తిరిగొచ్చే సరికి ఇంట్లోని సుమారుగా 40 తులాల బంగారం, 15 తులాల వెండి చోరీకి గురైంది. ● కుంట్లూర్ హనుమాన్ నగర్‌కు చెందిన గంగనబోయిన నర్సింహా దంపతులు ఈ నెల 4న పనిమీద బయటకు వెళ్లారు. తిరిగొచ్చే సరికి గుర్తు తెలియని దొంగలు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.60 వేల నగదు దోచుకెళ్లారు.



అక్బర్‌బాగ్‌లో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా వస్తువులు

నిఘా ముమ్మరం..

ఎల్బీనగర్, మలక్‌పేట పరిధిలో ఇటీవల జరిగిన చోరీ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. గస్తీని ముమ్మరం చేశారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై దృష్టిసారించారు. తాళం వేసి పండుగకు వెళ్లిన వారి నివాసాలపై దొంగలు దృష్టి పెట్టకుండా విస్తృతంగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. ఊరు వెళ్లేవారు తమ సమాచారాన్ని స్థానిక ఠాణాలో తెలియజేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన నంబర్లు

కంట్రోల్ రూమ్: 87126 62666

వాట్సాప్ నంబర్: 87126 62111

గస్తీ పెంచాం..: జి.శ్యాంసుందర్, ఏసీపీ, మలక్‌పేట

పండుగకు సొంతూళ్లకు వెళ్లడంతో, దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. చోరీల నివారణకు గస్తీని పెంచాం. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నాం. పోలీసు సిబ్బంది సైతం అప్రమత్తంగా ఉండాలి. ఊరికి వెళ్లే ముందు ఇంట్లో డబ్బు, బంగారం, విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలి. కాలనీలు, వీధులు, ఇంటి ఆవరణల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

సూచనలు పాటించాలి..:

– పి.నాగరాజుగౌడ్, ఇన్‌స్పెక్టర్, హయత్‌నగర్

బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో రాత్రి పూట గస్తీ ముమ్మరం చేశాం. పండగకు సొంత ఊర్లకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందు ఠాణా పరిధిలో ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నాం. ప్రజలందరూ పోలీసుల సూచనలు పాటించాలి. చోరీల నివారణకు సహకరించాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030

మలక్‌పేట: 80085 73284

హయత్‌నగర్: 98336 64897

కర్మన్‌ఘాట్: 94400 32872

బండ్లగూడ: 96034 78579

మూసారాంబాగ్: 79933 00559

నాగోలు, కర్మన్‌ఘాట్, సైదాబాద్, న్యూస్‌టుడే:

? నాగోలు డివిజన్ లలితానగర్ రోడ్డు నంబరు 7లోని పద్మావతీ కాంప్లెక్స్ వద్దనున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండి, రోడ్డుపై మురుగు పారుతోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. నడిచే పరిస్థితి కూడా లేదు. – విశ్వేశ్వర్‌రావు

✓ క్షేత్రస్థాయికి సిబ్బందిని పంపి సమస్యను తక్షణమే పరిష్కరిస్తాం. – ప్రేమ్‌కుమార్, మేనేజర్, జలమండలి

? చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ చెరువు తూము భాగంలో చేపట్టిన కల్వర్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాలనీకి రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. – ప్రవీణ్‌రెడ్డి, బైరామల్‌గూడ

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించాం. మరోమారు పరిశీలించి, పనుల్లో వేగాన్ని పెరిగేలా చర్యలు తీసుకుంటాం. – సురేశ్, ఏఈ

? సరూర్‌నగర్- గడ్డిఅన్నారం మార్గం సైదాబాద్ పరిధి ఎస్బీహెచ్-సీ కాలనీలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలగడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, మరమ్మతులు చేపట్టాలి. – సుధాకర్‌రావు, సైదాబాద్

✓ తక్షణమే మరమ్మతులు చేయించి సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – రాజు, ఏఈ, వీధిదీపాల విభాగం, మలక్‌పేట

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్రవాహనదారుడి దుర్మరణం

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు మృతిచెందిన ఘటన డబీర్‌పుర ఠాణా పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. డబీర్‌పుర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ సిటీ బస్సు చంచల్‌గూడ వైపు నుంచి కోఠి వైపు వెళ్తుంది. సుమారు 35 ఏళ్ల యువకుడు ద్విచక్రవాహనంపై కోఠి వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో మలక్‌పేట ఏరియా ఆసుపత్రి వద్ద షాహీన్ కళాశాల ఎదుట ద్విచక్ర వాహనాన్ని, ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న యువకుడు, బస్సు వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ ఆర్టీసీ బస్సును వదిలేసి పారిపోయాడు. మృతుడి జేబులో లభించిన గుర్తింపు కార్డు ద్వారా అతడి పేరు బాబురావు అని, బాలానగర్ పారిశ్రామిక వాడలో పనిచేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. మృతుడి కుటుంబ సభ్యులెవరైనా వస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు.







సద్దుల కొనుగోళ్ల సందడి

గురువారం సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు సన్నాహకాలు ప్రారంభమయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ సమీపంలో బుధవారం సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు, చిన్నారులు.. పూలు కొనుగోలు చేస్తూ కనిపించారు. తంగేడు, గునుగు, బంతి తదితర పూలను రైతులు, వ్యాపారులు విక్రయించేందుకు తీసుకొచ్చారు. –న్యూస్‌టుడే, మూసారాంబాగ్

మ్యాన్‌హోల్ నిండి.. మురుగు పొంగి



హస్తినాపురం డివిజన్ శ్రీరమణాకాలనీ ఫేజ్-1 రోడ్డు నంబరు-3లో మ్యాన్‌హోల్ పూడికతో నిండిపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్వాసన, అపరిశుభ్రతతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను జలమండలి మేనేజర్ సురేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. పరిష్కరిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, కర్మన్‌ఘాట్

ప్రేమించి.. పెళ్లికి నిరాకరించిన యువకుడి రిమాండ్

సైదాబాద్, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట యువతిని గర్భవతిని చేసి, పెళ్లికి నిరాకరించిన యువకుడిని సైదాబాద్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై నాగిశెట్టి సాయికృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి (21) దిల్‌సుఖ్‌నగర్‌లో కానిస్టేబుల్ ఉద్యోగానికి శిక్షణ పొందేందుకు 2022లో చేరింది. ఆ సమయంలోనే ఖమ్మం జిల్లాకు చెందిన మహేందర్ (24) అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నాని వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా లొంగదీసుకున్నాడు. 2023లో గర్భం దాల్చడంతో, కొంతకాలం ఆగిన తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి అబార్షన్ చేయించాడు. అనంతరం పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు గత నెలలో పోలీసులను ఆశ్రయించింది. బుధవారం యువకుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ చేశారు.

నాగోలు ఎస్‌హెచ్‌వోగా సూర్యానాయక్



నాగోలు, న్యూస్‌టుడే: రాచకొండ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన అంతర్గత బదిలీల్లో నాగోలు ఠాణా ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కృష్ణ సైబర్‌క్రైమ్ ఠాణాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎస్‌హెచ్‌వోగా నియమితులైన సూర్యానాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2007 ఎస్సై బ్యాచ్‌కు చెందిన సూర్యానాయక్ వనపర్తి, ఆలంపూర్, నల్గొండ, ఉప్పల్ ట్రాఫిక్ ఠాణాలో పనిచేశారు.

ఉచిత వైద్య శిబిరం

నాగోలు, న్యూస్‌టుడే: ఆశ్రయ్ ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నాగోలు డివిజన్ జైపూర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చెవి, ముక్కు, గొంతు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అన్ని వయసుల వారికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్యనిపుణులు శివరాములు, నరేశ్, భార్గవ్, సంస్థ సమన్వయకర్త శరత్, అంగన్‌వాడీ కేంద్రం టీచర్ మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ..

● సంబురంగా బతుకమ్మ ఉత్సవాలు

నాగోలు, రంగారెడ్డి జిల్లా కోర్టులు, హయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎల్బీనగర్, మలక్‌పేట పరిధిలో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చైతన్యపురిలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడిపాడారు. ఎమ్మెల్సీ దయానంద్, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు నీలా శ్రీధర్, ఫెడరేషన్ మహిళా విభాగం ఛైర్‌పర్సన్ ఉప్పల స్వప్న, రాష్ట్ర అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి లంకలపల్లి మంజుల, కోశాధికారి గౌరు జగతి పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పాలనాధికారి అంజలీదేవి, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.



చైతన్యపురి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..



రంగారెడ్డి జిల్లా కోర్టులో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..



బండ్లగూడ బస్సు డిపోలో..

అంతర్రాష్ట్ర ఘరానా నేరస్థుడి అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: గొలుసు చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ఘరానా నేరస్థుడిని ఎల్బీనగర్ సీసీఎస్, రాచకొండ ఐటీ సెల్, చైతన్యపురి ఠాణా పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుని వద్ద 59 గ్రాముల విలువైన రెండు బంగారు గొలుసులు, రూ.2.5లక్షల నగదు, ఓ బైకు స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ డీసీపీ అరవిందబాబు కథనం ప్రకారం.. హుబ్లీ తాలూకా కొలివాడ గ్రామానికి చెందిన అచ్యుత్ కుమార్ గని అలియాస్ విశ్వనాథ్ కొలివాడి (34) 2015 నుంచి బెంగళూరు, మైసూరు పట్టణాల్లో గొలుసు చోరీలకు పాల్పడుతున్నాడు. ఇలా అక్కడ 33 ఠాణాల పరిధిలో 74 చోరీలకు పాల్పడి 2018లో పోలీసులకు పట్టుబడి, నాలుగున్నరేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. విడుదల అయ్యాక తిరిగి బెంగళూరు, మైసూరు, దవణగిరి జిల్లా పరిధిలో ఎనిమిది చోరీలు చేశాడు. అనంతరం హైదరాబాద్ చేరుకొని జవహర్‌నగర్, చైతన్యపురి ఠాణాల పరిధిలోనూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ప్రత్యేక బృందాలతో పకడ్బందీ నిఘా పెట్టి నిందితుడిని గుర్తించాయి. రాచకొండ పోలీసులు బుధవారం అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: వనస్థలిపురం పరిధి సచివాలయనగర్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. బుధవారం సుప్రభాత సేవ, సువర్ణ పుష్పార్చన, అభిషేకం, సరస్వతి హోమం, తిరువీధి ఉత్సవం, లక్ష తులసీ అర్చన, కల్యాణోత్సవం, హోమం, గజవాహనంపై ఊరేగింపు ప్రవచనం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కె.లక్ష్మయ్య, పాలకవర్గ సభ్యులు సత్యనారాయణ, గణపతి, జగదీశ్‌కుమార్, పాపారావు, సత్తయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.



స్వామికి సువర్ణ పుష్పార్చన

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్‌లోని మదీనాగూడకు చెందిన జయంతి వెంకట సూర్యనారాయణమూర్తి, రాజ్యలక్ష్మి దంపతులు బుధవారం రూ.47,500 విరాళం అందించారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



చిన్నారికి పుస్తకం అందజేస్తున్న రఘుమారెడ్డి

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ధ్యానాంజనేయ ఆలయంలోని సరస్వతీ అమ్మవారి సన్నిధిలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మాజీ ఛైర్మన్ రఘుమారెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో చిన్నారులు భవిష్యత్‌లో విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆలయంలో అభిషేకాలు, సామూహిక హోమాలు చేపట్టారు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో ప్రేమ్‌కుమార్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిబ్బంది, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై నుంచి పడి వృద్ధుడి మృతి

చాదర్‌ఘాట్, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడు ప్రమాదవశాత్తు బ్రిడ్జి పైనుంచి పడి మృతిచెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రవి రాజు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆజంపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ అలీ (61) ఆటోడ్రైవర్. కాచిగూడలో ఆటోగ్యారేజ్‌కి వెళ్లి రాత్రి అక్కడే పడుకొని, మరుసటిరోజు ఆటో కిరాయికి వెళ్తానని ఇంట్లో చెప్పి మంగళవారం రాత్రి వెళ్లాడు. మార్గమధ్యంలో చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ బ్రిడ్జి పైనుంచి వెళ్తూ.. ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. తెల్లవారుజామున అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా, అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హరిహరక్షేత్రంలో సరస్వతిదేవిగా..



హరిహరాపురం త్రిశక్తి ఆలయంలో మహాదుర్గాదేవిగా..



ప్రశాంత్‌నగర్ పరిధి కనకదుర్గా ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు



బైరామల్‌గూడ శక్తి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, స్థానికులు

జగన్మాతా.. నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. మలక్‌పేట పరిధిలో ఆయా మండపాల వద్ద చండీహోమం, నైవేద్యాలు, దీపారాధన, కుంకుమార్చనలు, అన్నదానాలు నిర్వహించారు. వివిధ రూపాలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, కాలనీ సంఘాల ప్రతినిధులు పూజల్లో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే యంత్రాంగం

ఒకేసారి బకాయిల చెల్లింపు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి రాష్ట్రంలోని అన్ని హాస్టళ్ల కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బకాయిలన్నీ ఒకేసారి చెల్లించిందని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. పది నెలలుగా ఉన్న బకాయిలు ఏకకాలంలో ఇచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరావు బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, గురుకులాల కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లు దాదాపు 11వేల హాస్టళ్లు ఉన్నాయని, వీటికి భోజనానికి చెందిన సరకుల సరఫరాతో పాటు స్టేషనరీ, అవసరమైన పనివారిని తామే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 10 నెలలుగా బకాయిలు ఉన్నాయని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా.. పది రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. మాట ఇచ్చిన వారంలోనే మొత్తం బకాయిలకు సంబంధించి రూ.180 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏకకాలంలో చెల్లింపుతో పండగ పూట దాదాపు 40 నుంచి 50 వేల కుటుంబాల్లో పండుగ ముందుగానే వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

అబిడ్స్, న్యూస్‌టుడే: గో సంరక్షణకు జరుగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు సూచించారు. ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలన్నారు. నగరానికి విచ్చేసిన జ్యోతిర్మఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతిని బుధవారం కలిసి గోమాత విగ్రహంతో పాటు గదను బహూకరించారు. నేతలు వినయ్ తివారీ, రఘు, ఆదిత్య, నరేశ్, వినయ్ తివారీ పాల్గొన్నారు.


స్వామీజీకి గద బహూకరిస్తున్న లక్ష్మణ్‌రావు

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

ఆలయాల వద్ద సదుపాయాలు కల్పించాలి

గోషామహల్, న్యూస్‌టుడే: విజయ దశమి సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయాల వద్ద అవసరమైన వసతులను ప్రభుత్వం, జీహెచ్ఎంసీ కల్పించాలని జీహెచ్ఎంసీ భాజపా పక్ష నేత గొంటి శంకర్‌యాదవ్ కోరారు. మూసీ ఒడ్డున ముస్లింజంగ్ బ్రిడ్జి వద్ద కొలువుదీరిన చారిత్రక భూలక్ష్మీ ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, భారాస నేత ఆల పురుషోత్తంరావులతో కలిసి బుధవారం రాత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ మహంత్ బాబూగురు వారిని సన్మానించారు.


భూలక్ష్మీ ఆలయంలో శంకర్‌యాదవ్, పురుషోత్తంరావు, రాంచందర్‌రాజు

పాతనగరంలో దసరా సందడి

కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట

న్యూస్‌టుడే, గౌలిపుర, మొఘల్‌పుర

పాతనగరంలో దసరా సందడి కనిపిస్తోంది. ఓవైపు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాలు, మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో దాండియా, బతుకమ్మ ఆటలు, జాగరణ్ కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మరోవైపు దసరా కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. పండగ సమీపిస్తుండడంతో మార్కెట్లకు కొనుగోలుదారుల తాకిడి పెరిగింది.

వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి

పాతనగరంలోని పటేల్ మార్కెట్, మదీనా, పత్తర్‌ఘట్టీ, మూసాబౌలి, దివాన్‌దేవిడి, చార్మినార్ ప్రాంతాలు వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి. హోల్‌సేల్, కట్ పీస్, రెడీమేడ్ దుస్తుల వ్యాపారానికి దక్షిణ భారతదేశంలో అతి పెద్ద మార్కెట్‌గా పేరొందిన పటేల్ మార్కెట్‌కు వాటిని కొనుగోలు చేయడానికి జంట నగరాలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు ఇక్కడకు వస్తుంటారు. పటేల్ మార్కెట్, మూసాబౌలి ప్రాంతాల్లో వ్యాపారులు కొందరు తమ సొంత మిల్లుల ద్వారానే వస్త్రాలు తయారు చేయించి ఇక్కడి దుకాణాల్లో విక్రయిస్తుంటారు. బయట మార్కెట్లతో పోల్చుకుంటే ఇక్కడ దుస్తుల ధరలు తక్కువగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు వస్త్రాలు కొనుగోలు చేయడానికి వస్తుంటారు. పత్తర్‌ఘట్టీ, చార్మినార్, మదీనా ప్రాంతాల్లో దుస్తులు విక్రయించే ఫుట్‌పాత్ దుకాణాలు 500లకు పైగా ఉన్నాయి. చప్పల్‌బజార్‌లో వివిధ రకాల చెప్పులు తయారు చేసి విక్రయిస్తుంటారు.


లాడ్‌బజార్‌లో గాజులు కొనుగోలు చేస్తూ..


పటేల్ మార్కెట్‌లో దుస్తుల కొనుగోళ్లు

గాజుల విక్రయాలు

లాడ్‌బజార్, చుడీబజార్ ప్రాంతాలు రాళ్ల పొదిగిన లక్క గాజులతో పాటు వివిధ రకాల గాజులు, సుగంధ ద్రవ్యాలు, మేకప్ సామగ్రి, కలంకారి పెయింటింగ్స్, వెల్వెట్, ఎంబ్రాయిడరీ దుస్తులకు ప్రసిద్ధి కాగా.. గుల్జార్‌హౌస్, శాలిబండ, పత్తర్‌ఘట్టీ ప్రాంతాల్లో ముత్యాలు, బంగారు వెండి నగల దుకాణాలు అనేకం ఉన్నాయి. వాటిని కొనుగోలు చేయడానికి మహిళలు అధికంగా ఇక్కడకు వస్తున్నారు. నాలుగైదు రోజులుగా కొనుగోలుదారుల రద్దీ పెరిగిందని వ్యాపారులు తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.


మదీనా మార్కెట్‌లో సందడి

చార్మినార్ వద్ద..

చార్మినార్ పరిసర ప్రాంతాలు కొనుగోలుదారులతో సందడి కనిపిస్తోంది. దుకాణాలతో పాటు ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. రాత్‌బజార్‌లో పండ్లు, దుస్తులు, పాదరక్షలు, ఇంటికి సంబంధించి వస్తువులు, పండగ సరకుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ అన్ని రకాల వస్తువులు చౌకగా లభిస్తుండడంతో కొనుగోలుకు వివిధ ప్రాంతాల నుంచి జనం తరలొస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

కార్వాన్, మెహిదీపట్నం, న్యూస్‌టుడే

? గిర్కపల్లి, గణేశ్‌ఘాట్, రాంసింగ్‌పుర తదితర ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయి రాళ్లు తేలాయి. ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. మరమ్మతులు చేయించండి. – సి.ప్రేమ్‌కుమార్, గిర్కపల్లి

✓ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. – జె.శ్రీకాంత్‌గౌడ్, ఏఈ, కార్వాన్

? గుడిమల్కాపూర్ ఎస్‌బీఐ కాలనీలో చెట్ల కొమ్మలను తొలగించారు. రోజుల తరబడి తరలించడం లేదు. ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. – రాజేష్, కాలనీవాసి

✓ రెండు, మూడు రోజుల్లో తొలగిస్తాం. – సాయిమోహన్, ఏడీఈ



ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని తెలంగాణ ధర్మ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి భూపతిగల్ల సుధాకర్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క సంతకంతో 48 గంటల్లో పరిష్కరించవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉన్నత విద్యార్హతలను పొందేందుకు ఓడీ సౌకర్యం అందించేందుకు గానూ జీఓ 342ను పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆరోగ్య పథకం అమలు చేయాలని, జీఓ 317 ద్వారా నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. విద్యాభివృద్ధికి 25 శాతం నిధులు కేటాయించాలని, జీఓ 25రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు రమేశ్, ఉపేందర్, రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


డిమాండ్ల పత్రాన్ని ప్రదర్శిస్తున్న నేతలు

వేడుకలకు ఆహ్వానం

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో జరుగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయకమిటీ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆహ్వానించింది. కమిటీ మాజీ ఛైర్మన్ కె.వెంకటేశ్ బుధవారం స్పీకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి సన్మానించారు.



140 మందికి చెక్కుల పంపిణీ

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: నాంపల్లి నియోజకవర్గంలో 140 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పంపిణీ చేశారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

తలసాని ప్రత్యేక పూజలు

సుల్తాన్‌బజార్: ఉత్సవాలు ప్రజల్లో సోదర భావాన్ని పెంపొందిస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవ దుర్గ నవరాత్రి ఉత్సవ సమితి నిర్వాహకుడు గులాబ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ విక్టరీ ప్లేగ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల భారీ దుర్గామాత విగ్రహ మండపాన్ని బుధవారం ఉదయం తలసాని శ్రీనివాస్‌యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు సన్మానించారు.


మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న గులాబ్ శ్రీనివాస్


సనత్‌నగర్ ఐటీఐలో జరిగిన పూజ కార్యక్రమాల్లో ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు పి.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాసరావు, కె.వేమారెడ్డి

ఐటీఐల్లో వైభవంగా ఆయుధ పూజలు

కార్వాన్, విజయనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: దసరాను పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ ఐటీఐల్లో వైభవంగా ఆయుధ పూజలు, బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విజయనగర్‌కాలనీ పరిసర ప్రాంతాల్లోని శాంతినగర్, సనత్‌నగర్, ఖైరతాబాద్, మల్లేపల్లి, వీఎన్‌కాలనీ ప్రభుత్వ ఐటీఐల్లో వేడుకలు జరిగాయి. సనత్‌నగర్ ప్రభుత్వ ఐటీఐలో జరిగిన ఆయుధ పూజల్లో ఆయా ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు పసుపులేటి శ్రీనివాసరావు, రాయిడి శ్రీనివాసరావు, కందిమళ్ల వేమారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అర్ధరాత్రి యువకుడి దారుణహత్య

ఈనాడు– హైదరాబాద్, న్యూస్‌టుడే, చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో బుధవారం అర్ధరాత్రి యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. ఫలక్‌నుమా ఠాణా పరిధి అమ్జదుల్లానగర్‌కు చెందిన సాజిద్(37)ను మాట్లాడుదామని సిద్ధిఖ్(30) పిలిచాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సిద్ధిఖ్.. సాదిక్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన సాజిద్ అక్కడికక్కడే కుప్పకూలాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు అక్రమ సంబంధమే కారణమని పోలీసులు భావిస్తున్నారు.



ప్రధాన దారి.. చెత్త చేరి

జిర్రా-టప్పాచబుత్ర ప్రధాన రహదారిపై చెత్త పెద్దఎత్తున పేరుకుపోయింది. పాదచారులు, వాహనదారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండగ పూట పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నుమాయిష్‌లో ఉచితంగా స్టాళ్లు కేటాయించాలి

జియాగూడ, న్యూస్‌టుడే: నగరంలో వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రారంభం కానున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్)లో దళిత యువకులు, పారిశ్రామికవేత్తలకు ఉచితంగా స్టాళ్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర కాన్ఫడరేషన్ ఆఫ్ ఆర్గనైజ్డ్ దళిత ఎంటర్‌ప్రెన్యూర్స్ అధ్యక్షుడు సి.ఆర్.మునిస్వామి, అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్‌లు కోరారు. పెద్దపల్లి జిల్లాకు జి.వెంకటస్వామి పేరు పెట్టాలని కోరారు. ఆయా డిమాండ్లపై బుధవారం చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్‌వెంకట్‌స్వామికి వినతిపత్రం అందజేశారు.



బెంగాలీల దుర్గాపూజ

ఆసిఫ్‌నగర్: బెంగాలీ కల్చరల్ అసోసియేషన్‌లో ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ బుధవారం రాత్రి ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలతో పాటు, ఇక్కడ నివసిస్తున్న బెంగాలీలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. శక్తి ఆరాధనకు ప్రతిరూపంగా నవరాత్రులు జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. 1984లో హైదరాబాద్‌కు వచ్చిన బెంగాలీలు ఈ ఉత్సవాలను ప్రారంభించారన్నారు. 51 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంజిత్ పాల్ తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 13 వరకు అమ్మవారికి పుష్పాంజలి జరుగుతుందని చెప్పారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సంజయ్ పాన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు డాక్టర్ త్రిశీతా ముఖర్జీ ఉన్నారు.



సద్దుల బతుమకమ్మ నేడు

పూలకు గిరాకీ


మెహిదీపట్నం, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ పండగకు పూలు కొనుగోలుకు వినియోగదారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గుడిమల్కాపూర్ పూల మార్కెట్ బుధవారం కిక్కిరిసి పోయింది. నగర శివారు ప్రాంతాలతో పాటు సంగారెడ్డి, మెదక్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి రైతులు బతుకమ్మ అలంకరణకు ఉపయోగించే గునుగు, కారం, తంగేడు, సీతమ్మ జడ పూలను మార్కెట్ ప్రధాన రహదారిలో విక్రయించారు. 5కట్టల గునుగు పువ్వు రూ.100, కారం పువ్వు(రంగు) రూ.100కు 3, సీతమ్మ జడ కిలో రూ.100, తంగేడు పూలు కిలో రూ.150 చొప్పున విక్రయించారు. పూజలు, అలంకరణకు ఉపయోగించే బంతి, చేమంతి, గులాబీ కొనుగోలుదారులతో మార్కెట్‌లో రద్దీ ఏర్పడింది.


గుడిమల్కాపూర్ మార్కెట్‌లో..

వృద్ధులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ

ఐఎస్ సదన్: సైబర్ నేరస్తుల చేతిలో పడి వృద్ధులు మోసపోవద్దని హెల్ప్ ఏజ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామ్ సూచించారు. లక్ష్మీనగర్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయంలో సీనియర్ సిటిజన్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఉచితంగా మూడు చక్రాల సైకిళ్లు, చేతి కర్రలు ఉచితంగా పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు రూ.5 లక్షల జీవిత బీమా పథకం అమలు చేయడం హర్షం వ్యక్తం చేశారు. సంస్థ డైరెక్టర్ ఎ.శేషగిరిరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ వైస్‌ఛైర్మన్ మూర్తి, సర్వీస్ ట్రస్టు ఛైర్మన్ ప్రసాద్, సుబ్రహ్మణ్య పాల్గొన్నారు.


కార్వాన్ జెట్‌పురి మైసమ్మ


కాళరాత్రి అలంకారంలో.. భ్రమరాంబదేవి


మేకలబండ నల్లపోచమ్మ


గౌలిపురా హనుమాన్‌నగర్ ఫేజ్-2లో..


మీరాలంమండీ మహంకాళి


మహంకాళేశ్వర గుడిలో నాణేలు పంచుతున్న ఛైర్మన్ గాజుల అంజయ్య


కుమ్మరివాడీలో తమలపాకు పూజ


కేశవగిరి హిల్స్ కాలనీలో.. ఫలక్‌నుమా కాళీమాత తరహాలో..


డీఈఓ కార్యాలయంలో.. ఉద్యోగ సంఘాల నేతలు జగదీశ్వర్, శ్రీనివాస్‌రావు, కేఆర్ రాజ్‌కుమార్

సరస్వతీ నమోస్తుభ్యం

పాతనగరంలోని దుర్గామాత ఆలయాలు, మండపాల్లో నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కుంకుమార్చనలు, తమలపాకు పూజలు చేశారు. అన్నదానాలు చేశారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ ఆలయాలు, మండపాల్లో అమ్మవారిని కాలరాత్రిగా, సరస్వతీదేవిగా అలంకరించారు. – న్యూస్‌టుడే, బృందం


గుడిమల్కాపూర్ సత్యనారాయణనగర్ కాలనీలో..


లక్ష్మీనగర్ కాలనీలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో..


సరోజిని దేవి కంటి ఆసుపత్రిలో బతుకమ్మ వేడుకల్లో సూపరింటెండెంట్ డా.మోదిని, ఆర్ఎంవో డా.నజాఫీ అధికారులు, ఉద్యోగులు


జియాగూడ: పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ, అభిషేక్‌మిత్రా

బతుకమ్మల నిమజ్జనానికి ఏర్పాట్లు

మెహిదీపట్నం: గుడిమల్కాపూర్ సత్యనారాయణనగర్‌కాలనీలో బతుమ్మ నిమజ్జనం కోసం స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బేబీ పాండ్ ఏర్పాటు చేశారు.



హరియాణాలో భాజపా గెలుపుతో సంబరాలు

చార్మినార్, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా విజయం సాధించడంతో దారుల్‌షిఫా ఆజాఖానా జహరా క్రాస్‌రోడ్డులో భాజపా నేతలు సంబరాలు చేశారు. రాష్ట్ర భాజపా మైనార్టీ మోర్చా మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్‌అలీబాక్రీ ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. గోల్కొండ జిల్లా భాజపా అధ్యక్షుడు పాండుయాదవ్, సీనియర్ నేతలు సయ్యద్ బిన్‌అలీ, వజహత్‌హుస్సేన్, రవిగౌడ్, ఒదేల్ పాల్గొన్నారు.


మిఠాయి పంపిణీ చేస్తున్న మీర్ ఫిరాసత్‌అలీబాక్రీ, పాండుయాదవ్

ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసం.. వ్యక్తికి దేహశుద్ధి

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉస్మానియా ఆసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయకులను మోసగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న వ్యక్తిని బాధితులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళితే... కొంత కాలంగా కొందరు అమాయక మహిళలు, నిరుద్యోగులను నుంచి రూ.20 వేల నుంచి రూ.40వేల చొప్పున ఉస్మానియాలో విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి వసూలు చేశాడు. నెలలు గడుస్తున్నా.. ఉద్యోగం రాకపోవడంతో అనుమానం కలిగిన బాధితులు ఇటీవలే అతన్ని నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. బాధితులు అతన్ని నిలదీసి దేహశుద్ధి చేశారు. ఈ విషయమై అఫ్జల్‌గంజ్ పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదన్నారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడజాగీర్ కిస్మత్‌పూర్‌లోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రాజేశ్‌కుమార్, ఎర్రకుంటతండాకు చెందిన ముడావత్ శోభ, పీరంచెరువులోని సంగంసిటీకాలనీకి చెందిన అబ్దుల్ రషీద్‌లకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ నేత గోకరి సురేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు డిమాండ్



శంషాబాద్ ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులు

శంషాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేసి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం లక్ష ఉద్యోగాలను భర్తీచేస్తే మాదిగలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. తీర్పు మేరకు అందరికీ ఉద్యోగాలు దక్కేలా చూడాలన్నారు. నేతలు మల్లేటి మాదిగ, రావుగల బాబు, భానుప్రసాద్, రమేశ్, చిట్టిబాబు పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా రామస్వామి



కొందుర్గు, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా కొందుర్గు మండల కేంద్రానికి చెందిన జిల్లెల రామస్వామి ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ఎన్నిక జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా బలపడాలి



మాట్లాడుతున్న మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆలే

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆలే అన్నారు. రాజేంద్రనగర్‌లోని భారత సహకార నిర్వహణ సంస్థలో.. మిశ్రమ చేపల పెంపకంలో మత్స్యకారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం

కొత్తూరు: పురపాలికలోని నాలుగో వార్డులో రూ.6లక్షల వ్యయంతో అంతర్గత మురుగు కాలువ నిర్మాణపనులను చైర్‌పర్సన్ లావణ్య, కౌన్సిలర్ సోమ్లానాయక్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు నర్సింహాగౌడ్, శ్రీనివాస్, నేతలు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, వి.శ్రీను పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకోవాలి: సీపీఐ

షాద్‌నగర్ న్యూటౌన్: వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలపై విమర్శలు చేసేవారు వాస్తవాలు తెలుసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూసీ నిర్వాసితుల విషయంలో భారాస నేత రాజా వరప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. పదేళ్ల అధికారంలో ఉన్న భారాస ఇచ్చిన హామీలను ఎంతమేరకు అమలు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

బీజాపూర్ మార్గం..
విస్తరణకేదీ మోక్షం?

2016లోనే జాతీయ రహదారిగా గుర్తింపు

చేవెళ్ల, న్యూస్‌టుడే: బీజాపూర్ రహదారి నిర్మాణ పనులు ఏళ్ల గడుస్తున్నా ముందడుగు పడటం లేదు. హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ పట్టణాన్ని కలుపుతూ ఉన్న ఈ అంతర్రాష్ట్ర రహదారిని కేంద్రం 2016లో జాతీయ రహదారి(ఎన్‌హెచ్-163)గా గుర్తించింది. ఓఆర్ఆర్ చెంత ఉన్న పోలీస్ అకాడమీ నుంచి వికారాబాద్ జిల్లాలోని మన్నెగూడ వరకు సుమారు 46 కి.మీ. రోడ్డును విస్తరించడానికి 2018లో కేంద్ర ప్రభుత్వం రూ.928 కోట్లు కేటాయించింది.



ఈదురుగాలులకు కూలిన మర్రిచెట్టు(పాత చిత్రం)

రహదారి:	నేషనల్ హైవే-163
నిర్మాణ వ్యయం:	రూ.928 కోట్లు
రహదారి పొడవు:	46 కి.మీ.
శంకుస్థాపన:	2022 ఏప్రిల్
పురోగతి:	ప్రారంభం కాని పనులు
సమస్య:	మర్రిచెట్ల తొలగింపు



ఇరుకుగా బీజాపూర్ రోడ్డు

చెట్ల తొలగింపే సమస్య

నిజాం హయాంలో నిర్మించిన ఈ రోడ్డుకు ఇరువైపులా మర్రిచెట్లు పెంచారు. ఈ మహా వృక్షాలను తొలగించొద్దంటూ ఎన్విరాన్‌మెంటలిస్టులు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయడంతో పనులు నిలిచిపోయాయి. మర్రిచెట్లను తొలగించి వాటిని ఇతర ప్రాంతాల్లో ట్రాన్స్‌లొకేట్ చేయడంతో పాటు రహదారి వెంట మొక్కలు పెంచాలని, ఈ చర్యలు చేపట్టి రోడ్డు పనులు చేపట్టవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిందని ఏడాది కిందట అప్పటి ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రకటించారు. తరువాత పనులు ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడం గమనార్హం.

శంకుస్థాపన చేసి రెండేళ్లు దాటినా..

తొలుత బీజాపూర్ రహదారి ఆరు వరుసలుగా నిర్మించాలని నిర్ణయించారు. తర్వాత 4 వరసలకు కుదించారు. చేవెళ్ల, మొయినాబాద్ పట్టణాల్లో బైపాస్ రోడ్డు నిర్మిస్తామని ప్రకటించారు. సర్వే చేసి రైతుల నుంచి కొంత భూమిని సేకరించారు. పలుచోట్ల కోర్టు కేసులు, ఇతర సమస్యలతో భూసేకరణ నిలిచిపోయింది. 2022 ఏప్రిల్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బీజాపూర్ రహదారి విస్తరణకు శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించలేదు.

మరమ్మతులకూ దూరం

పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రెండు వరుసల రోడ్డే ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడం, ఇటీవల వర్షాలకు రోడ్డంతా గుంతలు ఏర్పడటంతో ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారిగా గుర్తించిన నేపథ్యంలో మరమ్మతులకు నిధులు రావడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతుండగా.. త్వరలో కొత్త రోడ్డు నిర్మిస్తాం, ఇప్పుడు మరమ్మతులు ఎందుకంటూ ఎన్‌హెచ్ఏఐ అధికారులు మిన్నకుండిపోతున్నారు.



ప్రమాదకర మలుపు

ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించినా..

బీజాపూర్ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని జూన్‌లో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. జులై నెలాఖరులోగా ప్రారంభిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. రోజులు గడుస్తున్నా రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330
శంకర్‌పల్లి: 8008573266
షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353

కాటేదాన్, శంషాబాద్, న్యూస్‌టుడే:

? పద్మశాలిపురం శ్మశానవాటికలో నీటి సౌకర్యం, వీధి దీపాలు లేవు. దహన సంస్కారాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. -ఏర్వ కుమారస్వామి, రాజేంద్రనగర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, అప్కోకాలనీ

✓ ఇప్పటికే నియోజకవర్గంలో చాలా శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. పద్మశాలిపురం శ్మశానవాటికపై ప్రత్యేక దృష్టిసారించి సౌకర్యాలు కల్పిస్తాం. - ప్రకాశ్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే

? శంషాబాద్ యాదిరెడ్డి కాలనీలో మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లుతున్నాయి. వారం రోజులుగా దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. పారిశుద్ధ్య విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. -మల్లేష్, యాదిరెడ్డి కాలనీ

✓ యాదిరెడ్డి కాలనీలో మురుగు సమస్య నా దృష్టికి రాలేదు. మురుగునీటి పారుదల వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆ కాలనీని సందర్శించి మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. -వి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్

? శంషాబాద్ బస్టాండ్‌లో ఫ్యాన్లు చెడిపోయి నెలవుతోంది. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. -అనూష, ప్రయాణికురాలు

✓ శంషాబాద్ బస్టాండ్ సమస్యలు నా దృష్టికి రాలేదు. సందర్శించి వసతులను పునరుద్ధరిస్తాం. -శ్రీనాథ్, మేనేజర్ రాజేంద్రనగర్ డిపో

యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి



విజేత జట్టుతో ఏసీపీ కిషన్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్, న్యూస్‌టుడే: యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి.. జీవిత లక్ష్యం వైపు పయనించాలని సూచించారు. సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆదేశాలతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా చిలుకూరు రెవెన్యూ పరిధిలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మొయినాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేత జట్లకు ఏసీపీ కిషన్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకే ఉప ప్రణాళిక నిధులు: వీర్లపల్లి

కొత్తూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఉప ప్రణాళిక నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించి వారి అభివృద్ధికి అడ్డుకట్ట వేసిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు పురపాలికలోని కేజీబీవీ జూనియర్ కళాశాల అదనపు భవన నిర్మాణ శిలాఫలకాన్ని బుధవారం చైర్‌పర్సన్ లావణ్య యాదవ్, కౌన్సిలర్ సోమ్లానాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్వశిక్ష నిధులు రూ.3.25 కోట్లతో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరం మండలం పెద్దమ్మతండా నుండి కొత్తూరు వరకు రహదారి అభివృద్ధికి గిరిజనులు వినతిపత్రం అందజేయగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, వి.దేవేందర్, శ్రీను పాల్గొన్నారు.



ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్, చైర్‌పర్సన్ లావణ్యయాదవ్

కాంగ్రెస్ హయాంలోనే ఆరోగ్య భద్రత

షాద్‌నగర్, నందిగామ: కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు సంపూర్ణ ఆరోగ్య భద్రత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 76మంది, నందిగామ మండలం అంతిరెడ్డిగూడ, వీర్లపల్లి, మేకగూడ, నందిగామలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.19,39,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన బుధవారం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, తిరుపతిరెడ్డి, బస్వం, ఇబ్రహీం, నర్సింహులు, కృష్ణ, కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వైభవం



పద్మశాలిపురం.. పూజల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బండ్లగూడజాగీర్ రాధానగర్‌లో సామూహిక కుంకుమార్చన



షాద్‌నగర్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సరస్వతి మాతగా..



షాద్‌నగర్ శివ మారుతి గీతా మందిరంలో..



షాద్‌నగర్ మండపంలో భాజపా నేతల పూజలు



గుండాలలో అమ్మవారి పూజల్లో భక్తులు



చేవెళ్లలో గజ వాహనంపై శ్రీవారి విహారం

రాజేంద్రనగర్, చేవెళ్ల, నార్సింగి, షాద్‌నగర్, బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాజేంద్రనగర్, చేవెళ్ల, షాదనగర్ నియోజకవర్గాల పరిధిలో అమ్మవారి ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. కుంకుమార్చనలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

చేవెళ్ల: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చేవెళ్ల శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

పూల పండగ సందడి



మణికొండలో..



నందిగామలో..

మణికొండ, నందిగామ, న్యూస్‌టుడే: మణికొండ పురపాలక సంఘ కార్యాలయం ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు బుధవారం వైభవంగా జరిగాయి. బతుకమ్మలను అందంగా అలంకరించి మున్సిపల్ ఉద్యోగినులు, కౌన్సిలర్లు, స్థానిక మహిళలు ఆడిపాడారు.

★ నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం వైద్య సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి వైద్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు.

పవన్‌ను కలిసిన చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను హైదరాబాద్ నగరం చిలుకూరి బాలాజీ దేవాలయం అర్చకుడు సీఎస్ రంగరాజన్.. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి పాల్గొన్నారు

ప్రజల పక్షాన ప్రశ్నిస్తే అరెస్టులా?



జిల్లేడు చౌదరిగూడెం ఠాణాలో భారాస నాయకులు

కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడెం, కేశంపేట: న్యూస్‌టుడే: కొడంగల్ ఫార్మా సిటీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాడేందుకు సిద్ధమైతే అక్రమంగా అరెస్టులు చేయిస్తారా అంటూ జిల్లేడు చౌదరిగూడెం మండల భారాస నాయకులు వాపోయారు. బుధవారం మండల పార్టీ నాయకులు అక్రమ్, బాబురావు, వెంకటేష్ , శేఖర్, రఘుపటేల్, సత్యం, నవీన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఠాణా ఆవరణలో వారు మాట్లాడారు.

★ కొందుర్గు మండల భారాస నాయకులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. వారిలో మండల పార్టీ అధ్యక్షుడు మండల శ్రీధర్‌రెడ్డి, రాజేశ్‌పటేల్, రామకృష్ణ,ప్రేమ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, లక్ష్మణ్‌నాయక్, విజయేందర్‌రెడ్డి, యాదయ్య, రవి, తిరుమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కేశంపేట భారాస నేతలు మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, మురళీకృష్ణయాదవ్‌లను బుధవారం స్థానిక పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

మండలి చీఫ్ విప్‌నకు అభినందనల వెల్లువ



మహేందర్‌రెడ్డితో చేవెళ్ల కాంగ్రెస్ శ్రేణులు

మొయినాబాద్, శంషాబాద్, బండ్లగూడజాగీర్, షాబాద్, న్యూస్‌టుడే: శాసనమండలి చీఫ్ విప్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పామెన భీంభరత్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నేతలు డి.మహేందర్‌రెడ్డి, తమ్మళి మాణయ్య చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ కూడా అభినందనలు తెలిపారు. టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్ ఆధ్వర్యంలో శంషాబాద్ కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాలతో సన్మానించారు.

సీపీఎల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల పంచాయతీ కాలనీతాండలో సీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. నిర్వాహకులు బాబునాయక్, శివను అభినందించారు. పార్టీ నేతలు ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్‌నాయక్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, బాబు నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన గండిగూడ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. శంషాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(50-55) హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిని దాటుతున్నాడు. శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వేగంగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా శవాగారానికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రిలో బెదిరింపులు.. విలేకరులపై కేసు

చేవెళ్ల గ్రామీణ, న్యూస్‌టుడే: ఓ ఆస్పత్రిలో డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు గురిచేస్తున్న ఐదుగురు ఆన్‌లైన్ విలేకర్లపై కేసు నమోదైంది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లికి చెందిన ఐదుగురు రిపోర్టర్లు మంగళవారం చేవెళ్ల లక్ష్మీ నర్సింగ్‌హోమ్‌కు వెళ్లి డబ్బులు అడిగారు. ఇవ్వకుంటే వ్యతిరేకంగా వార్తలు రాస్తామని బెదిరించారు. యజమాని డా.లక్ష్మీకాంత్ రెడ్డి నచ్చజెప్పినా వారు వినకపోవడంతో విషయం ఠాణాకు చేరింది. డాక్టర్ ఫిర్యాదు మేరకు సంబంధితులపై కేసు నమోదుచేశామని పోలీసులు తెలిపారు.

పైపులు ఇలా.. ఇంటింటికీ నీరు చేరేదెలా?





ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు గొప్పలు చెప్పడమే కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదు. జిల్లేడు చౌదరిగూడెం మండలం రావిర్యాలలో మిషన్ భగీరథ పైపులను రోడ్డుపై వదిలేసి వెళ్లారు. కారణంగా నీటి సరఫరా కాకపోవడంతో కుళాయి దిమ్మెలను సైతం గ్రామస్థులు తీసి పక్కకు పెట్టేశారు. వారం రోజులుగా మండలంలో నీటి సరఫరా అంతంత మాత్రమే ఉన్నా అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నల్లా కలెక్షన్ల మంజూరులో నిర్లక్ష్యం వహించడంతో పాటు నీటి సరఫరాలోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నారని రావిర్యాల, ఎదిర, పెద్ద ఎల్కిచర్ల గ్రామస్థులు మండిపడుతున్నారు.

-న్యూస్‌టుడే, జిల్లేడు చౌదరిగూడెం

నల్ల పోచమ్మ గుడిలో గోశాల



గోశాలను ప్రారంభిస్తున్న సమితి నేతలు

కాటేదాన్: మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ నల్లపోచమ్మ దేవాలయంలో స్థానిక సనాతన సేవా సమితివారు బుధవారం గోశాలను ప్రారంభించారు. గోవును పూజిస్తే 33కోట్ల దేవతలను పూజించినట్టేనని సమితినేతలు వివరించారు.

'భాజపాతోనే అభివృద్ధి సాధ్యం'

షాబాద్: భాజపాతోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే హరియాణలో మూడోసారి పట్టం కట్టారని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తాళ్లపల్లిలో పర్యటించి పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. నేతలు మానయ్య, మహేష్, నర్సింలు, నరేష్, మహేందర్, సురేష్ పాల్గొన్నారు.

షాద్‌నగర్ న్యూటౌన్: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని భాజపా జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరు వెంకటేష్ గుప్తా అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లిలో కుర్వ రాజు ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేతలు రామచంద్రయ్య, శ్రీశైలం, రమేష్, పరశురాములు పాల్గొన్నారు.

శ్రమదానంతో మరమ్మతులు

కేశంపేట: పాపిరెడ్డిగూడ గ్రామం నుంచి షాద్‌నగర్ ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. ఈ క్రమంలో బుధవారం గ్రామ యువత నడుం బిగించింది. ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను జేసీబీతో తొలగించారు. గుంతలున్న చోట మట్టి పోసి బాగుచేశారు. నర్సింలు, హనుమంతు, శేఖర్, శివానందు, శంకరయ్య, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం
•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

వైద్య కళాశాల పనుల పరిశీలన


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ శశాంక

ఆదిభట్ల, న్యూస్‌టుడే: సకాలంలో మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక.. సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మంగళపల్లిలో కాలేజీ పనులు ఆయన పరిశీలించారు.

బస్తీల్లో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పర్యటన

జల్‌పల్లి, న్యూస్‌టుడే: జల్‌పల్లి, శ్రీరామకాలనీల్లోని బస్తీల్లో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పర్యటించారు. పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు.

రామకృష్ణారెడ్డికి సత్కారం


నాదర్‌గుల్‌లో రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న భాజపా నేత అందెల శ్రీరాములు యాదవ్

బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారెడ్డి.. హైదరాబాద్ టెలిఫోన్ అడ్వైజరీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా మహేశ్వరం భాజపా ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ సన్మానించారు. బుధవారం నాదర్‌గుల్‌లోని భాజపా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకట్‌రెడ్డి, నాయకులు ఎన్.యాదగిరి, ప్రభాకర్, టి.ప్రతాప్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప కల్యాణోత్సవానికి కేటీఆర్‌కు ఆహ్వానం



బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేటలో ఈనెల 16న బీరప్ప దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవ కార్యక్రమాలకు హాజరుకావాలని మాజీమంత్రి కేటీఆర్‌ను స్థానిక కురమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ నేతలు ఆహ్వాన పత్రిక అందజేశారు.

‘విమర్శలు మాని అభివృద్ధి చేయండి’

మంచాల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం భారాసపై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని భారాస జిల్లా నాయకుడు లాలగారి జంగయ్య కోరారు. బుధవారం మంచాలలో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు దాటుతున్న అభివృద్ధి శూన్యమన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

మంచాల, న్యూస్‌టుడే: గ్రామాలలో రైతులకు, ప్రజలకు ఉపయోగపడే ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీఓ బాలశంకర్ కోరారు. బుధవారం మంచాలలో పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఓ వీరాంజనేయులు, పావని ఉపాధి పథకం క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

స్థానికుడితో తీగల కాల్ రికార్డింగ్ వైరల్

మీర్‌పేట ఠాణాలో పరస్పర ఫిర్యాదులు

బాలాపూర్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేటకు చెందిన స్థానికుడు పెదబావి నాగ నందీశ్వర్‌రెడ్డి.. ఇద్దరూ పరస్పరం దూషించుకున్నట్లుగా భావిస్తున్న ఆడియో కాల్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ అంశంపై మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల వారు ఫిర్యాదులు చేశారు. నా కుమారుడికి ప్రాణహాని ఉందని నందీశ్వర్ తల్లి నిర్మల.. తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ నాగరాజును వివరణ కోరగా పరస్పరం ఫిర్యాదులు అందాయని విచారణ జరుపుతున్నట్లు వివరించారు.

చెక్కుల అందజేత

తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోని 34 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, యాట నర్సింహ, భగవాన్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు

తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలోని గ్రామాల్లో కొత్తగా చేపట్టనున్న ఉపాధి పనులను ఎంపీడీవో శ్రీకాంత్ గుర్తించారు. కార్యక్రమంలో ఏవో రేణుక చక్రవర్తి, ఏపీవో కృష్ణ, ఈసీ కృష్ణయ్య, శంకర్ పాల్గొన్నారు.

బావిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రెండు ఘటనల్లో గుర్తు తెలియని మహిళ, వ్యక్తి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. రాగన్నగూడకు చెందిన చిర్ర రాజశేఖర్‌రెడ్డికి బాటసింగారంలో కోళ్ల ఫారం ఉంది. దాని వెనక ఉన్న బావిలో బుధవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మహిళ మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలి వయసు 40-45 ఏళ్లు ఉండవచ్చని అంచనా వేశారు. యాచకురాలై ఉంటుందని భావిస్తున్నారు.

జాతీయ రహదారి పక్కన.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి(50-55) మృతదేహం ఉంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు.. మృతదేహాన్ని పరిశీలించగా.. అనారోగ్య సమస్యతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

నిరుపేదలకు ఉపాధ్యాయ కొలువులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో కందుకూరుకు చెందిన పలువురు నిరుద్యోగులు ప్రతిభ చాటి ఉద్యోగాన్ని సాధించారు. ఫలితాల్లో నిరుపేద, వ్యవసాయ కూలీల బిడ్డలు అధికంగా ఉన్నారు. వనరులు లేకున్నా పట్టుదలతో చదివి ఉద్యోగాలు పొందారు.
– న్యూస్‌టుడే, కందుకూరు, తుర్కయంజాల్

తల్లిదండ్రుల కల నెరవేర్చేలా..



దెబ్బడగూడకు చెందిన మందగళ్ల రవీందర్ తల్లిదండ్రులు నిరుపేద కూలీలు. తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివించారు. వారి కష్టాన్ని గుర్తించిన రవీందర్ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి డీఈడీ పూర్తి చేశారు. 8 ఏళ్ల కిందట తల్లి చనిపోయింది. స్నేహితులతో కలిసి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమై తొలి ప్రయత్నంలో 186వ ర్యాంకు సాధించి ఎస్‌జీటీ ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు.

తల్లిదండ్రులు కూలీలు..



కందుకూరుకు చెందిన రాయకంటి స్వేతది నిరుపేద కుటుంబం.. తల్లిదండ్రులు కూలి పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. కష్టపడి పిల్లలను చదివించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన స్వేత.. డీఈడీ చేశారు. ఇంటి వద్దే పరీక్షలకు సిద్ధమై 217వ ర్యాంకు సాధించి ఎస్‌జీటీ ఉద్యోగాన్ని సాధించారు.

తల్లి కూలి పనులకు..



కందుకూరు గ్రామానికి చెందిన ఇమ్మిడి శ్రీకాంత్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి బీరమ్మ కూలి పనులకు వెళ్లి పిల్లలను చదవించింది. శ్రీకాంత్ విద్యాభ్యాసం ఇంటర్ వరకు కందుకూరులోనే సాగింది. డిగ్రీ నిజాం కళాశాల, పీజీ హెచ్‌సీయూలో పూర్తి చేశారు. అనంతరం ఎంఏ బీఈడీ చేశారు. జాతీయ స్థాయిలో జరిగే ఈజీసీ నెట్‌లో అర్హత సాధించాడు. తల్లి కష్టాన్ని గుర్తించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఇంటి వద్దే సిద్ధమై మొదటి ప్రయత్నంలోనే లాంగ్వేజ్ పండిత్ తెలుగులో రెండో ర్యాంకు సాధించారు.

రైతు బిడ్డ..



దెబ్బడగూడ గ్రామానికి చెందిన రాయిచెట్టు శ్రీకాంత్ పేద వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. విద్యాభ్యాసం ప్రభుత్వ విద్యాలయాల్లోనే కొనసాగింది. నిరుపేదలైన తల్లిదండ్రుల కష్టానికి ఫలితాన్ని సాధించాలన్న పట్టుదలతో కష్టపడి చదివారు. ఇంటి వద్దే డీఎస్సీకి సిద్ధమయ్యారు. ఫలితాల్లో తెలుగు పండిత్ విభాగంలో 11వ ర్యాంకు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో 21వ ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం మహేశ్వరం గురుకులంలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించారు.

నిరుపేద కుటుంబం నుంచి..



దెబ్బడగూడ గ్రామానికి చెందిన మల్లేపల్లి మహేశ్‌ది నిరుపేద కుటుంబం. తండ్రి 8 ఏళ్ల కిందట మృతి చెందారు. తల్లి బాలమ్మ రోజు కూలీ. తల్లి పడుతున్న కష్టాన్ని గుర్తించిన మహేశ్ కష్టపడి చదివారు. చదువు పూర్తి కాగానే పీఏసీఎస్‌లో ఒప్పంద ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే డీఎస్సీకి సిద్ధమై తొలి ప్రయత్నంలోనే ఎస్‌జీటీ ఉద్యోగాన్ని సాధించారు.

ఆర్కేపురం, తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే:

? ఎన్టీఆర్ నగర్‌లోని శివపురి కాలనీ రోడ్డు నం-1లో మ్యాన్‌హోల్ నుంచి మురుగు పారుతోంది.– స్వాతి, ఎన్టీఆర్ నగర్

✓ వెంటనే సమస్య పరిష్కరిస్తాం – సురేష్, ఆర్కేపురం, జలమండలి మేనేజర్

? రాగన్నగూడ కల్వర్టు వద్ద రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. –దాసు, వాహనదారుడు

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –వినోద్ కుమార్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

త్వరలో హమాలీలకు లైసెన్సులు


గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ కమిటీ సమావేశంలో చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌లోని హమాలీలకు త్వరలో లైసెన్సులు ఇవ్వాలని అధికారులకు ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బాటసింగారంలోని పండ్ల మార్కెట్ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ మొదటి సమావేశం ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని రైతుబజార్లు, ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ తదితరాల రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. తమ పాలకవర్గ నియామకం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది. మార్కెట్ మహిళా ఉద్యోగులకు, రైతులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సీహెచ్ భాస్కర్‌చారి, సభ్యులు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు విన్నవించిన సీఐటీయూ

ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డిని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో బృందం.. మార్కెట్‌లో కార్మికుల సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు నర్సిరెడ్డి, వీరయ్య, మసూద్, షరీఫ్, వెంకన్న, శివ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


తమ్మలోనిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ..

యాచారం, న్యూస్‌టుడే: యాచారం మండలం తమ్మలోనిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో 2002-03లో 7వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి ఉపాధ్యాయులు అనురుద్రారెడ్డి, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, కన్నయ్య, జగన్మోహన్, సంధ్యారాణి, సుల్తానాలను సన్మానించారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు దెంది రాంరెడ్డి, మాజీ సర్పంచి కాలె మల్లేశ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


బడంగ్‌పేటలో పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బాలాపూర్, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అన్నారు. కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్‌లోని భీమిడి కాలనీలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, డీఈ యాదయ్య, ఏఈ వినీల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదుకు శ్రీకారం


తుక్కుగూడలోని సభ్యత్వ నమోదులో భాజపా నేతలు పాపయ్యగౌడ్, హేమలత, రచ్చలక్ష్మణ్ తదితరులు

మహేశ్వరం, న్యూస్‌టుడే: తుక్కుగూడ పురపాలక పరిధిలో భాజపా సభ్యత్వ నమోదును పార్టీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు బి.పాపయ్యగౌడ్ బుధవారం ప్రారంభించారు. పలువురికి భాజపా సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో పురపాలక ఛైర్‌పర్సన్ బరిగెల హేమలత, పట్టణ భాజపా అధ్యక్షుడు రచ్చలక్ష్మణ్, శ్రీనివాస్, ఆంజనేయులు, మాధవరెడ్డి, కృష్ణగౌడ్, రాజుగౌడ్, రాకేష్ గౌడ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మకు ప్రత్యేక పూజలు


కొత్తపేట అష్టలక్ష్మి అమ్మవారు


మహేశ్వరంలో..


సర్దార్‌నగర్‌లో సరస్వతీదేవిగా..


నందివనపర్తిలో..


నాదర్‌గుల్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


కందుకూరులో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, దేప భాస్కర్‌రెడ్డి


ఇబ్రహీంపట్నంలో భాజపా ఎంపీ ఈటల రాజేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. –న్యూస్‌టుడే బృందం


హరిపురి కాలనీలో భారాస నేతలు..


మాదాయపల్లిలో మాజీఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ఆర్కేపురంలో చిలుక ఉపేందర్‌రెడ్డి

సీఐ బాధ్యతల స్వీకరణ

మంచాల, న్యూస్‌టుడే: మంచాల ఠాణా సీఐగా నియమితులైన మధు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్, బాలాపూర్ ఠాణాల్లో గతంలో ఎస్సైగా పనిచేసిన ఎమ్.సుధాకర్.. ప్రస్తుతం బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కందుకూరు: కొత్తగూడ క్రాస్‌రోడ్డు సమీపంలో 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ బియ్యం కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన పాండు.. తనకు అప్పగించాడని ఆటోడ్రైవర్ జాంగీర్ తెలిపాడు. మహేశ్వరంలోని ఓ రైసు మిల్లుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. పాండుతో పాటు రైస్‌మిల్లు యజమాని జగన్మోహన్, డ్రైవర్ జాంగీర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

మీర్‌పేట: మీర్‌పేటలో ఆటో నడుపుతున్న శ్రీను (26) తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనికి డాక్టర్ కేశిరెడ్డి సలహా మేరకు 108 అంబులెన్స్ ఉద్యోగులు ప్రథమ చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు.

భారాస నేతల హౌస్ అరెస్టు

కందుకూరు: రైతుల భూములు లాక్కోవడాన్ని నిరసిస్తూ భారాస నేత చేపట్టిన పాదయాత్రకు కందుకూరు పార్టీ నేతలు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టులు చేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: బాటసింగారంలో ఓ పేద వృద్ధుడు మృతిచెందాడు. మృతుని అంతిమ సంస్కారాలకు రూ.15 వేలు.. సురక్ష సేవా సంఘం అధ్యక్షులు కిక్కర గోపిశంకర్ యాదవ్ అందించారు.

కాన్షీరాం వర్ధంతి

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ నిర్మాత కాన్షీరాం వర్ధంతిని బుధవారం సాగర్ రహదారి తుర్కయంజాల్‌లో ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ కోశాధికారి పట్నం రమేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు మేతరి కుమార్, సైదులు, వద్దిగల్ల బాబు, రాజు, రఘు, వెంకటేష్ తదితరులు.. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


తుర్కయంజాల్ కూడలిలో..


బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో..


తొర్రూర్‌లో ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరెడ్డి, కౌన్సిలర్లు


ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఛైర్మన్ స్రవంతి, కౌన్సిలర్లు


మేడిపల్లిలో..

వైభవంగా బతుకమ్మ సంబరాలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్, యాచారం, న్యూస్‌టుడే: బాటసింగారంలోని పండ్ల మార్కెట్ ఆవరణలో మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. వేడుకలను గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.

◆ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.

◆ తొర్రూర్‌లో జరిగిన బతుకమ్మ సంబరాల్లో ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరెడ్డి, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు. ◆ఫార్మాసిటీ వ్యతిరేక గ్రామాల రైతులు.. బుధవారం బతుకమ్మ ఆటపాటల ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. మేడిపల్లిలో ఫార్మాసిటీ వ్యతిరేక స్తూపం ముందు ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్



జాగరణ కార్యక్రమంలో బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ విజయారెడ్డి, స్థానికులు

ఖైరతాబాద్‌లో జాగరణ సందడి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్‌లోని గ్రంథాలయ కూడలిలో జాగరణ కార్యక్రమం చేపట్టారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 'మహా భగవతి కా విశాల్ జాగరణ్' పేరుతో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వేకువ జాము దాకా పలు బతుకమ్మ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి అక్కడి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. పలువురు అతిథులు హాజరయ్యారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూల పండగ వైభవం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని వినియోగదారుల ఫోరంలో బతుకమ్మ సంబరాలు జరిగాయి. రాష్ట్ర కమిషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్, రాష్ట్ర, జిల్లా కమిషన్ ఉద్యోగులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని ఉద్యోగులతో బుధవారం సర్వజన బతుకమ్మను వైభవంగా నిర్వహించారు.

వెంగళ్‌రావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధి మధురానగర్ సంక్షేమ సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక డి-బ్లాకు పార్కు వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.



వినియోగదారుల ఫోరం ఉద్యోగుల సందడి

మంత్రి పదవి ఇవ్వాలంటూ 21న సీఎం ఇంటి ముట్టడి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మంత్రి వర్గ విస్తరణలో లంబాడా సమాజం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని, ఆ విషయాన్ని వెంటనే తేల్చాలని లంబాడీ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్ చేశాయి. లేని పక్షంలో ఈనెల 21న ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించి అక్కడ ధర్నా నిర్వహిస్తామని ఆయా సంఘాల నేతలు ధారావత్ గణేష్ నాయక్, వెంకట్ బంజారా బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడీలే ప్రధాన భూమిక పోషించారని అన్నారు. అయినా ఆదుకున్నవారు తమ సమాజానికి అన్యాయం చేస్తున్నారన్నారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచి లంబాడా యువకులు ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘాల నాయకులు రమేష్ నాయక్, శ్రీనునాయక్, పున్నీబాయి, అచ్చిబాయి, లక్ష్మణ్ నాయక్, రాజ్‌కుమార్, ఇందల్ రాథోడ్, గిరి నాయక్ పాల్గొన్నారు.

పెరిగిన రాకపోకలు.. వాహనదారుల వెతలు

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండ సైట్-3 కాలనీ నుంచి మాదాపూర్ వైపు వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం మీదుగా వెళితే కిలోమీటరు దూరంలోనే మాదాపూర్ ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉన్నందున నిత్యం వేలసంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. సైట్-3 కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద నుంచి స్థానిక కల్లు కాంపౌండ్ మీదుగా సున్నంచెరువు పక్క నుంచి నేరుగా అయ్యప్ప సొసైటీ 100 అడుగుల రోడ్డు ప్రాంతానికి కొన్ని నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ఈ మార్గంలో కొంతదూరం ఇరుకుగా ఉండటం వల్ల వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

రహదారి విస్తరణే పరిష్కారం

మాదాపూర్ చేరుకునేందుకు దగ్గరి మార్గం కావడంతో బోరబండ పరిసర ప్రాంతాలతో పాటు యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎస్సార్ హిల్స్ తదితర ప్రాంతాల నుంచి వాహనదారులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. కొన్నాళ్ల క్రితం వరకు రహదారి మట్టి దిబ్బలు, గుంతలమయంగా ఉండేది. అప్పట్లో ద్విచక్ర వాహనాల రాకపోకలే కొంతమేర ఉండేవి. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఈ మార్గాన్ని విస్తరించిన తర్వాత అన్నింకాల వాహనాల రాకపోకలు పెరిగాయి. ఈ కారణంగా బోరబండ సైట్-3 ప్రాంతంలో విపరీతమైన రద్దీ పెరిగినందున మార్గాన్ని విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. సున్నంచెరువు సమీపంలో నిర్మించిన అనేక షెడ్లు, దుకాణాలు, నిర్మాణాలను ఇటీవల హైడ్రా అధికారులు కూల్చివేశారు. రహదారికి మరోవైపు విస్తరణ పనులు జరగాల్సి ఉంది. రోనాల్డ్‌రాస్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్నప్పుడు బోరబండ- మాదాపూర్ మార్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సర్కిల్-19 అధికారులకు సూచించారు. ఈ మార్గంలో రహదారిని విస్తరించి అభివృద్ధి చేస్తే వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి.



బోరబండ సైట్-3 కాలనీ నుంచి మాదాపూర్ మార్గంలో రద్దీ

సత్వర అభివృద్ధికి కృషిచేస్తా

- ఎం.డి.బాబాఫసియుద్దీన్, బోరబండ కార్పొరేటర్

మాదాపూర్ అయ్యప్పసొసైటీ ప్రాంతానికి త్వరగా చేరుకునే అవకాశం ఉన్న ఈ మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. గుంతలమయంగా మారిన రహదారిని బాగుచేయించడమే కాకుండా, ఇరుకు మార్గాన్ని విస్తరించే పనులు చేపట్టేలా సంబంధిత అధికారులకు నివేదిస్తా. విస్తరణ జరిగితే రెండు ప్రాంతాలు కలిసిపోయి వాహనాల రాకపోకలు సులువవుతాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. (ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య)

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, యూసుఫ్‌గూడ

? కల్యాణ్‌నగర్ ఫేజ్-1, ప్లాట్ నెంబరు 75, సమీపంలోని వీధిదీపాలు రెండు నెలల నుంచి వెలగడం లేదు. సాయంత్రం సమయంలో బయటికి వెళ్లాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి.

–ప్రసాద్, కల్యాణ్‌నగర్ ఫేజ్–1

✓ వెలగని వీధిదీపాలకు వెంటనే మరమ్మతు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, వీధిదీపాల నిర్వహణాధికారి

కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు 16 నుంచి

పంజాగుట్ట, న్యూస్‌టుడే: పంజాగుట్ట దుర్గానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 8వ వార్షిక పవిత్రోత్సవాలు ఈ నెల 16 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నామని ఆలయ ట్రస్టీ పలమర్తి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సరస్వతి అలంకరణలో అమ్మవారు



వీరాంజనేయస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు



శ్రీకృష్ణానగర్‌లోని మండపం వద్ద పూజలు



ప్రతిభా నగర్ దివ్యాంగుల కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి కొండా సురేఖ

ఒకేసారి బకాయిలన్నీ చెల్లించారు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి రాష్ట్రంలోని అన్ని హాస్టళ్ల కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బకాయిలన్నీ ఒకేసారి చెల్లించిందని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. పది నెలలుగా ఉన్న బకాయిలు ఏక కాలంలో ఇచ్చి దసరా, దీపావళి పండగలు ముందుగానే వచ్చినట్లు చేశారని అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరావు బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పేర్కొన్నారు. అందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, గురుకులాల కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లు దాదాపు 11 వేల హాస్టల్స్ ఉన్నాయని, వీటికి భోజనానికి చెందిన సరకుల సరఫరాతో పాటు స్టేషనరీ, అవసరమైన పనివారిని తామే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మొత్తం దాదాపు 40 వేల మంది గుత్తేదారులకు 10 నెలలుగా బకాయిలు ఉన్నాయని, వాటిపై ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా.. వారంలోనే మొత్తం బకాయిలకు సంబంధించి రూ.180 కోట్లు విడుదల చేశారని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు ఆనంద్, నల్ల శ్రీనివాస్, సభ్యులు అశోక్, దుర్గా ప్రసాద్, హైమద్, ఎండీ అజీమ్, రమేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నర్సింగరావు చిత్రంలో హైమద్, ఎండీ అజీమ్, అశోక్, ఆనంద్, శ్రీనివాస్, రమేష్, ప్రసాద్

హౌసింగ్‌బోర్డు ఇళ్లను వాయిదా పద్ధతుల్లో కేటాయిస్తే మేలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: నగరంలో ఖాళీగా ఉన్న హౌసింగ్‌బోర్డు ఇళ్లకు డిమాండ్ సర్వే చేసి వాయిదా పద్ధతుల్లో లబ్ధిదారులకు కేటాయించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాశారు. గచ్చిబౌలిలోని ఉత్తర డివిజన్‌లో 76ప్లాట్లు, వసంత ప్రాజెక్ట్‌లో 40ఇళ్లు, కేపీహెచ్‌బీలో 788 ప్లాట్లు హౌసింగ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్మాణమై 10 ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డు ఇళ్లను స్వాధీనం చేసుకుని డిమాండ్ సర్వే చేసి రిజర్వేషన్లు అమలుచేస్తూ వాయిదా పద్ధతుల్లో లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల స్థానంలో కొత్తవారిని నియమించాలన్నారు.

పాఠ్యపుస్తక ముద్రణాలయంలో ఆయుధ పూజ



ప్రొ.కోదండరాం, డైరెక్టర్ రమణకుమార్‌లను సత్కరిస్తున్న కార్మికులు, ఉద్యోగులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాయలంలో విజయదశమి వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఆయుధ పూజ చేశారు. ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, ముద్రణాలయం డైరెక్టర్ సీహెచ్ రమణకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమ్మవారికి తొట్టెలు, బోనాలు, శివసత్తులు, డప్పు వాయిద్యాలతో ప్రదర్శనలు నిర్వహించారు. ముద్రణాలయం ఏడీలు జి.శ్రీనివాస్, వి.సంతోష్ కుమార్, చీఫ్ ఫోర్‌మెన్ కట్టెల విజయ్‌కుమార్, జేఏసీ నాయకులు ఆర్.ఈశ్వరయ్య, ఎస్.విశ్వసేన, జి.మల్లికార్జున్, ఎం.నరహరి, యం.నరేష్, యన్.వినోద్ కుమార్ అధికారులు వి.గోపికృష్ణ, ఏ.ప్రవీణ్ కుమార్, ఎస్.శివనంద్, బి.ప్రవీణ్ కుమార్, బాల్‌కుమార్, కాంతారావు, ఉద్యోగులు, కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కులో 20న ప్రజా సంబరాలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా మన సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. కేబీఆర్ పార్కు వద్ద ఈ నెల 20న ప్రజా సంబరాల పేరిట సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. నగర అభివృద్ధి, సుందరీకరణ, పార్కులు, పచ్చదనంపై సీఎం పలు సూచనలు చేశారన్నారు. నగర సుందరీకరణలో భాగంగా పార్కుల అభివృద్ధి, విభాగినిల్లో పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా నగర ప్రజలకు, నగరానికి వచ్చే పర్యాటకులకు మన సంస్కృతి ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న కేబీఆర్ పార్కులో నేచర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, అడ్వెంచర్ తదితర పోటీలు ఉంటాయన్నారు. ముందుగా కేబీఆర్ పార్కు ప్రధాన గేటు వద్ద కార్యక్రమాన్ని నిర్వహించి.. అనంతరం కేబీఆర్ పార్కు 9 గేట్ల వద్ద ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అందరూ కుటుంబంతో పాల్గొనేలా ఆదివారం రోజున ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ హర్టికల్చర్ ఆఫీసర్ సునంద, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, అధికారులు

భారతీయ సనాతన ధర్మం ప్రపంచానికే ఆదర్శం



మహాలక్ష్మీగౌడ్‌ను సత్కరిస్తున్న మహేశ్వరి సమాజ్ మహిళా ప్రతినిధులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: హిమాయత్‌నగర్ డివిజన్‌లో మహేశ్వరి మహిళా మండల్ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీగౌడ్ మాట్లాడుతూ.. భారతీయ సనాతన ధర్మం ప్రపంచానికే ఆదర్శంగా ఉందని, దాన్ని నవతరానికి అందించాల్సిన బాధ్యత మనమంతా తీసుకోవాలన్నారు. సంఘం అధ్యక్షురాలు శశి లతా డాలియా, కార్యదర్శి అరుణ మాల్‌పాని, కోశాధికారి రాజ్ శ్రీసోని, ప్రధాన కార్యదర్శి ఊర్మిళ కావ్య, ఊర్మిళ బంగా, మాధురి బజాజ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు జే.ఆర్.సందీప్, మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వస్త్రాల ఉత్పత్తి పరిశ్రమ ఏర్పాటు చేయండి

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: ఇండియన్ టెర్రెయిన్ ఫ్యాషన్స్ సంస్థ తెలంగాణాలో వస్త్రాల ఉత్పత్తి పరిశ్రమను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.3 లో ఇండియన్ టెర్రెయిన్ 196వ షోరూంను మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, క్రికెటర్ అజారుద్దీన్, పీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్, ఇండియన్ టెర్రెయిన్ ఎండీ చరత్ నరసింహన్, సీఓఓ షెహనాజ్, జోనల్ మేనేజర్ ప్రవీణ్ బింగి, షోరూం యజమాని అంకన్నగారి ఉత్కర్ష్ పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో భాజపా సభ్యత్వ నమోదు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వేంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధి బంజారాహిల్స్‌లోని పలు బస్తీలు, కాలనీలతోపాటు కేబీఆర్ పార్కు వద్ద బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా భాజపా నగర అధ్యక్షుడు ఎన్ గౌతం రావు పాల్గొన్నారు. కేబీఆర్ పార్కు వద్ద వ్యాయామం, జాగింగ్‌కు వచ్చిన వారికి, వ్యాపారులకు, మార్కెట్ ఏజెంట్లకు, ఉద్యోగులకు, యువకులకు, సీనియర్ సిటిజన్‌లకు భాజపా విధానాలను, సిద్ధాంతాలను వివరించారు. కార్యక్రమంలో భాజపా డివిజన్ అధ్యక్షుడు బంగారం చంద్రశేఖర్, బీజేవైఎం నగర కార్యదర్శి ఫణి కుమార్ సాయి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో బలవన్మరణం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై, మానసిక ఒత్తిడితో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివాసముంటున్న ఎం.వీరబాబు(45) గతంలో ఓ ఛానెల్‌లో విలేకరిగా పనిచేసేవాడు. అప్పట్లో ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్న వీరబాబు, మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నాడు. అప్పట్నుంచి మద్యానికి బానిసై, మానసిక ఒత్తిడికి గురయ్యేవాడు. రహ్మత్‌నగర్‌లో అక్క మంగాదేవీ, అన్న శ్రీనివాస్‌లతో కలిసి ఉంటున్న వీరబాబు.. ఈ నెల 9న ఉదయం అన్న శ్రీనివాస్ లేచి చూసేసరికి వీరబాబు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నాడు. పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

యూసుఫ్‌గూడ: ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మధురానగర్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... రహ్మత్‌నగర్‌లో నివాసముండే కృష్ణ వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇంట్లో నిల్వచేశాడు. పక్కా సమాచారంతో పోలీసులు ఇంటిపై దాడిచేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా శ్రీవారి తిరు కల్యాణ మహోత్సవం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామివారి తిరు కల్యాణం మహోత్సవాన్ని వేదపండితులు ఆలయంలోని కల్యాణమండపంలో నిర్వహించారు. శ్రీవారికి సాయంత్రం గరుడవాహన సేవను నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ, భక్తులు, సిబ్బంది, పాల్గొన్నారు.

భాజపా ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నేడు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ నియోజకవర్గం భాజపా ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి లంకాల దీపక్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

నృత్యదర్శకుడు జానీ పిటిషన్‌పై తీర్పు 14న

రంగారెడ్డి జిల్లా కోర్టులు: నృత్య దర్శకుడు జానీ పెట్టుకున్న బెయిలు పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. కోర్టు అనుమతించిన నాలుగు రోజుల మధ్యంతర బెయిలును నిందితుడే ఉపసంహరించుకున్న నేపథ్యంలో బుధవారం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. తీర్పు కోసం విచారణను న్యాయస్థానం వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

రాజ్యాధికారం దిశగా బహుజనులను నడిపిన నేత కాన్షీరామ్



కాన్షీరామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఓట్ హమారా.. రాజ్ తుమారా.. నహీ చలేగా.. నహీ చలేగా అని నినదించి బహుజనులను రాజ్యాధికారం దిశగా నడిపించిన గొప్ప నేత, బీఎస్పీ వ్యవస్థాపకుడు దివంగత కాన్షీరామ్ అని బీఎస్పీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి దొరపల్లి రమేష్ కొనియాడారు. కాన్షీరామ్ 18 వర్ధంతి కార్యక్రమం బుధవారం వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం.3 లోని లేబర్ అడ్డా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మనోజ్ కుమార్, శంకర్, మస్తాన్, వెంకటమ్మ అభిలాష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కమలానగర్ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలి

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్ లబ్ధిదారులకు వెంటనే రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గాంధీభవన్‌లో బుధవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ విషయాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు.

ఆటో కార్మికుల డిమాండ్ల సాధనకు నవంబరు 5న మహాధర్నా




గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వెంకటేశం, జంగయ్య, అశోక్ తదితరులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ ఐకాస హెచ్చరించారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవనంలో రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల ఐకాస సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐకాస నేత బి.వెంకటేశం, సీహెచ్ జంగయ్య, ఎ.భిక్షపతి యాదవ్ (ఏఐటీయూసీ), వి.మారయ్య (బీఆర్‌టీయూ), పి.శ్రీకాంత్ (సీఐటీయూ), లింగంగౌడ్ (ఐఎఫ్‌టీయూ), వి.ప్రవీణ్ (టీయుసీఐ), డి.శ్రీనివాస్ (జీయుటీఎస్), ఎంఎ సలీమ్ (యూటీఏడీడబ్ల్యూఏ), వి.సత్తిరెడ్డి (టీపీడీఎస్), మిర్జా రఫాత్ బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్)లు కలిసి ఆటో డ్రైవర్ల డిమాండ్ సాధన కోసం నవంబరు 5న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఐకాస ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రతి ఆటోడ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12,00 ఆర్థిక సహాయం, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం ద్వారా 50 శాతం తగ్గింపు ఇస్తామని ఇచ్చిన హామీలు విస్మరించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే తమ సమస్యలపై స్పందించి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కూకట్‌పల్లి

వేంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అశ్వ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బాలానగర్: సాయినగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు స్వామివారికి విష్వక్సేన పూజ, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామివారు విష్వక్సేన అలంకరణలో అశ్వవాహనంపై కాలనీ పురవీధుల్లో దర్శనమిచ్చారు. గురువారం ధ్వజారోహణం, అభిషేకం, అగ్నిప్రతిష్ఠ, సామూహిక కుంకుమార్చన ఉంటాయన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పుల్లయ్యగుప్తా

మూసాపేట, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం కూకట్‌పల్లి మండల శాఖ అధ్యక్షుడిగా దద్దెళ్ల పుల్లయ్య గుప్తా ఎన్నికయ్యారు. కూకట్‌పల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. రెండేళ్ల కాలపరిమితితో పదవిలో కొనసాగుతారని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెరుకు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్ తెలిపారు.



మహేందర్‌రెడ్డికి అభినందనలు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: శాసనమండలి చీఫ్ విప్‌గా బాధ్యతలు తీసుకున్న పట్నం మహేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్ అభినందించారు. బుధవారం ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అలరించిన భక్తి గీతాలాపన


జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వైశాలీ మ్యూజిక్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి శాంతినగర్ భారత్ వికాస్ పరిషత్ సత్సంగ మందిరంలో భక్తి గీతాలాపన కార్యక్రమం జరిగింది. వై.లక్ష్మీరమ, విద్యార్థులు పలు భక్తిగీతాలతో ఆహుతులను అలరించారు. అనంతరం పాటలు పాడిన విద్యార్థినులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. త్యాగరాజ ప్రభుత్వ మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ్ ముతాలిక్, ప్రభాకర్, పార్థసారధి, సైకాలజిస్టు నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ సంబరం.. సామూహిక ఉత్సవం

ముగింపు వేడుకలకు సిద్ధమైన రంగధాముని చెరువు కట్ట

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబరాలు అంటే.. కూకట్‌పల్లి ప్రాంతాన్నే ఉదహరిస్తారు. తెలంగాణా సంస్కృతి.. సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఏటా ఘనంగా జరిగినప్పటికీ.. ఈ ప్రాంతంలో వేడుకలు ప్రత్యేకత ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మొదటిరోజు.. చివరిరోజు వేడుకలు నిర్వహిస్తారు. కానీ, ఇక్కడ ప్రతి రోజూ అత్యంత ఘనంగా జరుపుకోవడం విశేషం. మహిళలను మరింత ప్రోత్సహించేందుకు కొన్నేళ్లుగా ముగింపు వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. సామూహికంగా వేలాది మంది మహిళలతో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు కూకట్‌పల్లి రంగధాముని చెరువు కట్ట సిద్ధమైంది.


రంగధాముని చెరువు కోనేరు

ఇవీ ఏర్పాట్లు

గతనెల 30న మొదలైన వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. గౌరమ్మ అలిగి వెళ్లడంతో బుధవారం వేడుకలు జరగవు. చివరిరోజు వేడుకలను రంగధాముని చెరువు కట్టపై నిర్వహించడం నాలుగేళ్లుగా కొనసాగుతుంది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం మొదలయ్యే ఈ ఉత్సవం.. రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగనుంది. చెరువు కట్టపై ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేయనున్నారు. కోనేరును శుభ్రం చేసి రంగులు వేసి సిద్ధం చేశారు. టెంట్లు వేసి.. మొత్తం కట్ట పొడవునా కార్పెట్ వేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు.


కూకట్‌పల్లి గ్రామంలో ఆటోట్రాలీలో సిద్ధమవుతున్న భారీ బతుకమ్మ

ఆటలు.. పాటలు

చెరువు కట్టపై గురువారం సాయంత్రం సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి. రోజూ మాదిరిగానే కూకట్‌పల్లి గ్రామంలోని మహిళలు భారీగా బతుకమ్మలతో ముందుగా హనుమాన్ దేవాలయం మైదానం వద్దకు చేరుకుంటారు. అక్కడ ఆడి, పాడి అనంతరం బతుకమ్మలతో ఊరేగింపుగా రంగధాముని చెరువు కట్టకు చేరుకుంటారు. ఈ ఊరేగింపు కేరళ వాయిద్యాలతో కళాకారులు సందడి చేయనున్నారు. చెరువు కట్టపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బతుకమ్మ ఆట, పాటలతోపాటు దాండియా నృత్యాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయి. ముగింపు వేడుకల్లో భారీ బతుకమ్మలతో ఊరేగింపు ప్రత్యేకతగా చెప్పాలి. కిలోల కొద్ది విభిన్న రంగులతో కూడిన పువ్వులను వినియోగించి భారీ బతుకమ్మలు తయారుచేస్తారు. ఇది రెండు రోజుల ముందు నుంచే ప్రారంభించడం గ్రామంలోని పలు ఇళ్లల్లో కనిపిస్తుంది. 10నుంచి 15, 20అడుగుల ఎత్తున్న బతుకమ్మలు కూడా కనువిందు చేయనున్నాయి. వీటి నిమజ్జనానికి చెరువు కట్టపై క్రేన్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. అతిపెద్ద ఆకర్షణీయమైన ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

మంజీరా లీకేజీ నివారణ



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ మల్లికార్జునకాలనీ మెడిప్లస్ ఎదురుగా మంజీరా స్లూయిజ్‌వాల్వ్ నుంచి తాగునీరు లీకవుతుంది. నీటి వృథాతోపాటు రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని జలమండలి హస్మత్‌పేట సెక్షన్ మేనేజర్ తేజ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా ఆయన సత్వరమే స్పందించి సిబ్బందితో మరమ్మతులు నిర్వహించి అక్కడి వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

కలుషిత జలాల అడ్డుకట్టకు చర్యలు



మూసాపేట, న్యూస్‌టుడే: మూసాపేట యాదవబస్తీలో ఇటీవల తరచూ కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. అరగంటకు పైగా మురికినీరు వస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను 'ఈనాడు' జలమండలి మూసాపేట సెక్షన్ మేనేజర్ సలోమి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఆమె బుధవారం యాదవబస్తీలో తవ్వకాలు చేపట్టారు. ఆధునికయంత్రంతో సమస్య ఎక్కడ ఉందో కనుగొన్నారు. మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం నాటికి పనులు పూర్తయి కలుషిత జలాల సరఫరాకు అడ్డుకట్ట పడుతుందని సలోమి పేర్కొన్నారు.

మ్యాన్‌హోల్‌పై కొత్త మూత



4కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1లో ధ్వంసమై ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్ వద్ద జలమండలి సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. ఎల్‌ఐజీ నివాసాల సముదాయాల్లో మ్యాన్‌హోల్ మూత ధ్వంసమై ప్రమాదకరంగా రంధ్రాలు పడ్డాయి. వరద ప్రవాహానికి చెత్తాచెదారం అందులోకి పారుతోంది. ప్రమాదం పొంచి ఉంది. మ్యాన్‌హోల్‌పై కొత్తమూత ఏర్పాటుచేయాలని 'ఈనాడు' జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులు చేయించారు.

నేత్రపర్వం.. దేవీశరన్నవరాత్రి వైభవం


ఓల్డ్‌బోయిన్‌పల్లి వల్లభ్‌నగర్‌లో కాళీమాత అమ్మవారి పూజల్లో ఎమ్మెల్యే కృష్ణారావు



సరస్వతీదేవి అలంకరణలో పర్వత్‌నగర్‌లోని అమ్మవారు, మూడోఫేజ్‌లోని కనకదుర్గ అమ్మవారు


ఫతేనగర్ నేతాజీకాలనీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, అల్లాపూర్, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో దేవీశరన్నవరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో విద్యార్థులతో పూజలు అందుకున్నారు. పలు ఆలయాల్లో నిర్వాహకులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.


మూసాపేట వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు

పూలు పేర్చి.. ఆటలాడి

కూకట్‌పల్లి, మూసాపేట, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు బతుకమ్మలు తయారు చేసి ఆడిపాడారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. జడ్సీ అపూర్వ్‌చౌహాన్ సతీమణితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ కూకట్‌పల్లి బస్‌డిపోలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాలానగర్ రాజుకాలనీ సామాజిక భవనంలో ఆశ వర్కర్లు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.


జోనల్ కార్యాలయంలో జడ్సీ అపూర్వ్‌చౌహాన్ దంపతులు, ఉద్యోగినులు


బాలానగర్ రాజుకాలనీ సామాజిక భవనంలో ఆశా వర్కర్లు


కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో బతుకమ్మలతో మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు


కూకట్‌పల్లి బస్‌డిపోలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు

వీధి శునకాల పట్టివేత

స్పందనకు వందనం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ కాలనీలో పలు ప్రాంతాల్లో కుక్కల సమస్య పరిష్కారానికి వెటర్నరీ అధికారులు చర్యలు చేపట్టారు. సమస్యాత్మకంగా మారిన ప్రాంతాల్లో వెటర్నరీ అధికారి నాగార్జున ఆదేశానుసారం సిబ్బంది కుక్కలను పట్టుకున్నారు.

హౌసింగ్‌బోర్డు ఇళ్లను వాయిదా పద్ధతుల్లో కేటాయించాలి

మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే సాంబశివరావు లేఖ

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: నగరంలో ఖాళీగా ఉన్న హౌసింగ్ బోర్డు ఇళ్లకు డిమాండ్ సర్వే చేసి వాయిదా పద్ధతుల్లో లబ్ధిదారులకు కేటాయించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాశారు. గచ్చిబౌలిలోని ఉత్తర డివిజన్‌లో 76ఫ్లాట్లు, వసంత ప్రాజెక్టులో 40ఇళ్లు, కేపీహెచ్‌బీలో 788ఫ్లాట్లు హౌసింగ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్మాణమై 10ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డు ఇళ్లను స్వాధీనం చేసుకుని డిమాండ్ సర్వే చేసి రిజర్వేషన్లు అమలుచేస్తూ వాయిదా పద్ధతుల్లో లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల స్థానంలో కొత్తవారిని నియమించాలన్నారు.

బాలుడి అదృశ్యం

బాలానగర్, న్యూస్‌టుడే: సరిగా చదవడంలేదని పెద్దమ్మ మందలించడంతో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ నరసింహరాజు కథనం ప్రకారం..రాజుకాలనీకి చెందిన బాలుడు(14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో పెద్దమ్మ దత్తత తీసుకొని చదివిస్తుంది. 8వ తేదీన సరిగా చదవడం లేదని, ఇలా చేస్తే వసతిగృహంలో చేర్పిస్తానని పెద్దమ్మ హెచ్చరించడంతో భయపడిన బాలుడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం బాలుడి పెద్దమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబరాల నిర్వహణ

జూబ్లీహిల్స్: మన సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. జీహెచ్ఎంసీ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం కేబీఆర్ పార్కు వద్ద ఈనెల 20న ప్రజా సంబరాల పేరిట సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి, మాట్లాడుతూ..20న కేబీఆర్ పార్కులో నేచర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, అడ్వెంచర్ తదితర పోటీలు ఉంటాయన్నారు.

నృత్యదర్శకుడు జానీ పిటిషన్‌పై తీర్పు 14న

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీ పెట్టుకున్న బెయిలు పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. కోర్టు అనుమతించిన నాలుగు రోజుల మధ్యంతర బెయిలును నిందితుడే ఉపసంహరించుకున్న నేపథ్యంలో బుధవారం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. తీర్పు కోసం విచారణను న్యాయస్థానం వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆందోళన

మేడ్చల్ కలెక్టరేట్: డీఎస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాదిగ ఆరోపించారు. బుధవారం తూంకుంట పురపాలికలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా?

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల వర్షాలకు రోడ్లు తూట్లు పడి అధ్వానంగా మారాయి. రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్వరమే మరమ్మతులు నిర్వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కూకట్‌పల్లి డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్, శక్తిపురం, మైత్రీనగర్-విజ్ఞాన్‌పురికాలనీ ప్రధాన రహదారిలో కొట్టుకుపోయి.. గుంతలు తేలి.. కోసుకుపోయి దుస్థితిలో కనిపిస్తున్నాయి. మరమ్మతులు నిర్వహించి రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రశాంత్‌నగర్ డబుల్ రోడ్డులో కోసుకుపోయి ప్రమాదకరంగా..


కూకట్‌పల్లి శక్తిపురంలో గుంతలు తేలి

ఒప్పంద అధ్యాపకుల నిరసన



కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్ కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్ల సాధన కోసం రిలే నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. నాలుగోరోజు బుధవారం వర్సిటీ ఆవరణలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం ఎదుట ధర్నా చేశారు. జీవో 11 ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అమ్మవారి విగ్రహానికి అందజేశారు. రాజేష్‌ఖన్నా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బొంతు కమలమ్మకు నేతల నివాళి

కాప్రా, న్యూస్‌టుడే: మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కుటుంబాన్ని పలువురు నేతలు బుధవారం పరామర్శించారు. వీరిలో ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి దయాకర్‌రావు, వి.ప్రకాశ్ తదితరులున్నారు. ఈ సందర్భంగా కమలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అభివృద్ధి.. ఎవరికి లబ్ధి?

బ్రాండ్ ఫ్యాక్టరీ-రాజీవ్ రోటరీ మార్గంలో జోరుగా ఆక్రమణలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధి బ్రాండ్ ఫ్యాక్టరీ-రాజీవ్ రోటరీ మార్గంలో కాలిబాటల అభివృద్ధి ఊపందుకున్న నాటి నుంచి ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. కాలిబాటలే కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. అధికారులు చర్యలకు వెనుకాడటంతో అక్రమ వ్యాపారాలు శాశ్వతంగా మారుతున్నాయి. జనం ఇబ్బంది పడకుండా అభివృద్ధి చేసిన పనులన్నీ ఆక్రమణదారుల పాలిట వరంగా మారాయి. తాజాగా పారిశుద్ధ్య విభాగం అధికారులు ఒక అడుగు ముందుకేసి రహదారికి ఇరువైపులా కాలిబాటలను శుభ్రం చేయించడంతో కొన్నే ఆక్రమణలు తొలగాయి. మరికొన్ని వదిలేశారు. అయితే, ఇవి తాత్కాలికమా? శాశ్వతమా? అనేది సందిగ్ధంలోనే ఉంది.

రూ.20లక్షల డ్రెయిన్ కనుమరుగు

ఈ మార్గంలో ఆరేళ్ల క్రితం సుమారు రూ.20లక్షలతో బాక్స్ డ్రెయిన్ నిర్మించారు. తర్వాత కాలిబాటలు అందుబాటులోకి వచ్చాయి. జనం కోసం అభివృద్ధి చేసిన ఈ పనులు ఆక్రమణదారులకు కలిసొచ్చాయి. కాలిబాటలపై అనుమతి లేని వ్యాపారాలు ఏర్పర్చుకొని ఇప్పుడు ఆ స్థలాలను అద్దెకివ్వడమే కాకుండా విక్రయించే స్థాయికి చేరారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో విద్యుత్తు కనెక్షన్లు వచ్చేశాయి. ఎవరైనా అడిగితే బెదిరింపులకు దిగిన సందర్భాలున్నాయి. దుకాణాల ఫ్లెక్సీలు ధ్వంసం చేసుకుంటున్నారు. వ్యాపారాల కోసం చెట్లు కొట్టేశారు. తాజాగా విభాగిని నిర్మిస్తుండటంతో ఆక్రమణల ప్రభావంతో రహదారి ఇరుకుగా మారింది.


ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

మిగతా విభాగాలు చర్యలు తీసుకోవాలి: కార్తీక్, ఏఎమ్‌హెచ్‌వో

రహదారికి ఇరువైపులా పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నారు. చుట్టుపక్కల జనానికి తీవ్ర అసౌకర్యం కలుగుతోందని గుర్తించాం. మద్యం సీసాలు, చెత్తాచెదారం తొలగించాం. కొన్ని వ్యాపారాలను ఆపేశాం. పూర్తిస్థాయిలో తొలగించాలంటే మిగతా విభాగాలు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

ప్రతి ఒక్కరికీ తిప్పలే..

- బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ గేటుకు ఇరువైపులా ఆక్రమణదారులు నానాయాగి చేస్తున్నారు. మహిళలు సౌకర్యంగా గేటు దాటి వచ్చే పరిస్థితి లేదు. బయటకొస్తే లోపలికి వెళ్లేందుకు భయపడుతున్నారు.
- చుట్టుపక్కల మాల్స్‌లో పనిచేసే యువతులు, మహిళలు వసతిగృహాలు, ఇళ్లకు వస్తుంటే ఫుడ్‌కోర్టుల వద్ద పోకిరీలు వెకిలిచేష్టలకు పాల్పడుతున్నారు.
- వరద సాఫీగా డ్రెయిన్‌లోకి పారడం లేదు. ఆక్రమణదారులు క్యాచ్‌పిట్లు మూసేసి వాటిపై దుకాణాలు, సామగ్రి పెట్టుకుంటున్నారు.
- రాజీవ్ రోటరీ వైపు వెళ్లే మార్గంలో వ్యాపారాలకు పార్కింగ్ లేక సగం రహదారి మేర అక్రమంగా వాహనాలు నిలుపుతున్నారు.
- ఓ వైపు వరద.. మరోవైపు వాహనాలతో దారే లేకుండాపోతోంది.
- ఆక్రమణదారుల మధ్య పంచాయితీలు పోలీస్‌స్టేషన్‌కు చేరుతుండటం.. ఆక్రమణలు కాలనీ అంతటా పాకినా అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి •పటాన్‌చెరు

ప్రాధాన్య క్రమంలో వసతుల కల్పన



రాయదుర్గంలో కల్వర్టు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

రాయదుర్గం, మియాపూర్, న్యూస్‌టుడే: ప్రాధాన్య క్రమంలో వసతులు కల్పిస్తున్నానని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ.1.87కోట్లకుపైగా నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. రాయదుర్గం నుంచి పంచవటి కాలనీ వరకు పందెన్ వాగుపై కల్వర్టు నిర్మాణం, గౌలిదొడ్డి కేశవనగర్‌లో, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి వీకర్‌సెక్షన్ కాలనీలో, అవంతి గోదావరి కాలనీలో సీసీరోడ్డు పనులు చేపట్టనున్నారు. సురక్షా హిల్స్, సత్య ఎంక్లేవ్, భవానిపురంలో సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ మంజులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు.

ప్రజా సంబరాల నిర్వహణ 20న

జూబ్లీహిల్స్: తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా 20న ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. కేబీఆర్ పార్కు వద్ద నిర్వహించే కార్యక్రమాల పోస్టర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. నగరానికి వచ్చే పర్యాటకులకు మన సంస్కృతి ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న కేబీఆర్ పార్కులో నేచర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, అడ్వెంచర్ తదితర పోటీలు ఉంటాయన్నారు.

నృత్యదర్శకుడు జానీ పిటిషన్‌పై తీర్పు 14న

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీ పెట్టుకున్న బెయిలు పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. కోర్టు అనుమతించిన నాలుగు రోజుల మధ్యంతర బెయిలును నిందితుడు ఉపసంహరించుకున్న నేపథ్యంలో బుధవారం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. తీర్పు కోసం విచారణను న్యాయస్థానం వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

హౌసింగ్‌బోర్డు ఇళ్లను వాయిదా పద్ధతుల్లో కేటాయించాలి

మంత్రి పొంగులేటికి కూనంనేని లేఖ

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: నగరంలో ఖాళీగా ఉన్న హౌసింగ్‌బోర్డు ఇళ్లకు డిమాండ్ సర్వే చేసి వాయిదా పద్ధతుల్లో లబ్ధిదారులకు కేటాయించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాశారు. గచ్చిబౌలిలోని ఉత్తర డివిజన్‌లో 76 ప్లాట్లు, వసంత ప్రాజెక్ట్‌లో 40ఇళ్లు, కేపీహెచ్‌బీలో 788ప్లాట్లు హౌసింగ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్మాణమై 10ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డు ఇళ్లను స్వాధీనం చేసుకుని డిమాండ్ సర్వే చేసి రిజర్వేషన్లు అమలుచేస్తూ వాయిదా పద్ధతుల్లో లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల స్థానంలో కొత్తవారిని నియమించాలన్నారు.

ముున్సిపల్ సిబ్బందికి దసరా కానుక

రామచంద్రాపురం రూరల్: తెల్లాపూర్ పురపాలక పరిధిలోని పది గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ లలిత, కౌన్సిలర్ లచ్చిరాం ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు, మిఠాయిలు, నగదు పంపిణీ చేశారు.

భారాస శ్రేణుల గృహ నిర్బంధం

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ అడ్డుకోకుండా ఉండేందుకు వీలుగా భారాస శ్రేణులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం పోలీసులు తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, కౌన్సిలర్లు బాబ్జీ, లచ్చిరాం అనుచర వర్గాలను పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించారు. ఇళ్ల నుంచి బయటికి రానివ్వకుండా అడ్డుకున్నారు.

పెరుగుతున్న రోబోల వినియోగం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ప్రధాన రంగాల్లో రోబోల వినియోగం పెరుగుతుందని కిరణ్ మాటిక్స్ సంస్థ ఎండీ కిరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జి ఎలక్ట్రా క్లబ్ రోబోటిక్స్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హ్యాకథాన్, రోబోటిక్స్, ఒలింపియాడ్ పేర్లతో ఏటా జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జి ఎలక్ట్రా క్లబ్ అధ్యక్షుడు సాయికృష్ణ, సమన్వయకర్తలు జేమ్స్, నరేష్ కుమార్ తదితరులున్నారు.

ఆర్చరీ పోటీల్లో పతకాలు

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: తెల్లాపూర్ పురపాలక పరిధి కొల్లూరు గ్రామం దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జాతీయస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. 20 రాష్ట్రాలకు చెందిన 146 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కొల్లూరు దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 22 పతకాలు సాధించారు. ఛాంపియన్ టైటిల్ అందుకున్నారు. 8 స్వర్ణాలు, ఏడు రజతాలు, 7 కాంస్య పతకాలు అందుకున్నారు. ఈమేరకు ఛైర్మన్ భీమ్ సేన్ విద్యార్థులను అభినందించారు.

నీటి గుంతలో పడి పెయింటర్ మృతి

పటాన్‌చెరు అర్బన్: మద్యం మత్తులో మురుగు గుంతలో పడి పెయింటర్ మృతిచెందాడు. పటాన్‌చెరు ఎస్సై అభిమాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సంజయ్‌ప్రజాప్రతి(34) పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామపంచాయతీ వెనుక కాలనీలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం విపరీతంగా మద్యంతాగి శ్మశానవాటిక పక్కనే ఉన్న డ్రైనేజీ గుంతలో పడి చనిపోయాడు. అతనితో పనిచేసే సందీప్‌కుమార్ డ్రైనేజీ గుంతలో సంజయ్ చనిపోయి ఉండటాన్ని బుధవారం ఉదయం చూసి కుటుంబ సభ్యులకు తెలిపాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో కార్మికుడు..

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ఊపిరాడక అమీన్‌పూర్ ఠాణా పరిధిలో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన మేరాజ్(26) అమీన్‌పూర్ పురపాలక పరిధి సుల్తాన్‌పూర్ గ్రామంలో ప్యాకింగ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం ఐదింటికి ఒక్కసారిగా ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డాడు. తోటి కార్మికులు కూకట్‌పల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమీప బంధువు ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



విద్యా సరస్వతీదేవి అలంకరణలో సుమిత్రానగర్ కనకదుర్గాదేవి



గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని ఆలయంలో అమ్మవారు..



ఎల్లమ్మబండ నాగలింగేశ్వర ఆలయంలో అభిషేకం



రాయదుర్గం మండపం నిర్వాహకులతో సినీ నటుడు సుమన్



వెస్ట్ సాయినగర్‌లోని ఎర్ర పోచమ్మ ఆలయంలో..



సుమిత్రానగర్‌లో పూజల్లో ఎమ్మెల్యే గాంధీ దంపతులు



చిట్కుల్‌లో తుల్జాభవానిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకుడు నీలం మధు

వీణాధారిణి.. విద్యా ప్రదాయిని

రాయదుర్గం, ఆల్విన్ కాలనీ, వివేకానందనగర్‌కాలనీ, గచ్చిబౌలి, పటాన్‌చెరు, మియాపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయాలు, అమ్మవారి మండపాల్లో సరస్వతి పూజలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. విద్యార్థులతో సరస్వతీదేవి పూజ నిర్వహించి రాతపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. రాయదుర్గం మండపంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, సినీనటుడు సుమన్, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఐటీ కారిడార్‌లో కూడళ్ల విస్తరణ

ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్లు, కూడళ్ల విస్తరణ లేక ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. అత్యంత కీలకమైన కూడళ్లు చిన్నవిగా ఉండటం, ఫ్రీ లెఫ్ట్ వెళ్లే అవకాశం లేక సిగ్నల్ పడితే చాలు వాహనాలు ఇరువైపు బారులు తీరుతున్నాయి. ఈ సమస్యకు కూడళ్ల విస్తరణతో పరిష్కారం లభిస్తుందని ట్రాఫిక్ పోలీసులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్నో రోజులుగా విన్నవిస్తూ వస్తున్నారు.
– న్యూస్‌టుడే, గచ్చిబౌలి



ట్రిపుల్‌ఐటీ జంక్షన్‌లో సాగుతున్న పనులు

◆ ఎట్టకేలకు మొదలైన పనులు
◆ తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

ప్రాధాన్య క్రమంలో..

● జీహెచ్‌ఎంసీ అధికారులు మొదటి దశలో ప్రధానమైన మూడు కూడళ్లలో విస్తరణ పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ముందుగా ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ఫ్రీ లెఫ్ట్‌లను సుగమం చేసే పనులు ప్రారంభించారు. ట్రిపుల్‌ఐటీ జంక్షన్‌లో విస్తరణ వేగవంతం చేశారు. గచ్చిబౌలి ఠాణా నుంచి ఐడీబీఐ బ్యాంకు వరకు రోడ్డు విస్తరిస్తున్నారు. ఇక్కడ ఫ్రీలెఫ్ట్ రోడ్డు అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి, ఇంద్రానగర్ వైపు నుంచి విప్రో జంక్షన్ వైపు వెళ్లే వాహనాలు ట్రిపుల్‌ఐటీ జంక్షన్‌లో ఆగాల్సిన పని ఉండదు. దీంతో ట్రిపుల్‌ఐటీ జంక్షన్లలో ట్రాఫిక్ ఒత్తిడి చాలా తగ్గుతుంది.

● బొటానికల్‌గార్డెన్ చౌరస్తాలో కొత్తగూడ వైపు వెళ్లేందుకు రోడ్డు విస్తరిస్తున్నారు. మసీద్‌బండ, శ్రీరాంనగర్ కాలనీ వైపు నుంచి వచ్చే వాహనాలు బొటానికల్ గార్డెన్ చౌరస్తాలో ఆగాల్సిన పనిలేదు. ఫ్రీలెఫ్ట్ రోడ్డులో శరత్‌సిటీ మాల్ ముందు నుంచి నేరుగా కొత్తగూడ జంక్షన్‌కు చేరుకోవచ్చు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది.

● హెచ్‌సీయూ బస్సు డిపో కూడలి విస్తరణ పనులు సైతం ప్రారంభించారు. మసీద్‌బండ నుంచి హెచ్‌సీయూ డిపో మీదుగా గచ్చిబౌలి వెళ్లేందుకు ఫ్రీలెఫ్ట్ రోడ్డు వేస్తున్నారు. లింగంపల్లి వైపు నుంచి మసీద్ బండ వెళ్లే వాహనాల కోసం మరోవైపు రోడ్డు విస్తరించనున్నారు. దీంతో హెచ్‌సీయూ డిపో కూడలిలో ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది.

ఇంకా ఎక్కడెక్కడంటే..

గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో విప్రో జంక్షన్, ఐసీఐసీఐ, కాంటినెంటల్ ఆసుపత్రి చౌరస్తాలను విస్తరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విప్రో జంక్షన్ వద్ద నానక్‌రాంగూడ వైపు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్ లేక సిగ్నల్ పడితే వాహనాలు ఒక్కోసారి మైక్రోసాఫ్ట్ కంపెనీ వరకు బారులు తీరుతున్నాయి. మిగితా కూడళ్లల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

◆ గౌలిదొడ్డి విలేజ్ రోడ్డు 215 అడుగులకు విస్తరించాల్సి ఉండగా పనులు చేపట్టకపోవడంతో విప్రో నుంచి గోపన్‌పల్లి వైపు వెళ్లే వాహనాలు గౌలిదొడ్డి విలేజ్ దాటేందుకు చాలా సమయం పడుతుంది. ఇక్కడ రోడ్డు చిన్నదిగా ఉండటంతో ఇక్కట్లు తప్పడం లేదు.

ప్రస్తుతానికి మూడు కూడళ్లలో..

– రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్లు, కూడళ్ల విస్తరణ చేయాలి. ప్రస్తుతం మూడు కూడళ్లల్లో ఫ్రీ లెఫ్ట్ వెళ్లేందుకు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీంతో కొంత సమస్య తగ్గుతుంది. మిగితా కూడళ్లు, రోడ్ల విస్తరణకు జీహెచ్‌ఎంసీ అధిక ప్రాధాన్యమిచ్చి వాటిని పూర్తిచేస్తే బాగుంటుంది.

పూల పండగ.. ఇంతులు మురవగ



రామచంద్రాపురంలో సద్దుల బతుకమ్మ ఉత్సవం



ఆర్ట్‌గ్యాలరీలో మహిళలతో డైరెక్టర్ కె.లక్ష్మి



తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద..

రామచంద్రాపురం రూరల్, మాదాపూర్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగను ఆనందోత్సవాలతో నిర్వహిస్తున్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో బుధవారం సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పటాన్‌చెరు రామచంద్రాపురం సండే మార్కెట్లో బుధవారం కార్పొరేటర్ పుష్ప ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఆడారు. ఉత్తమ బతుకమ్మలు ఎంపిక చేసి ముగ్గురికి నగదు పురస్కారాలు అందజేశారు. ప్రథమ బహుమతి మేఘమాల (రూ.20వేలు), ద్వితీయ ప్రవీణ (రూ.15వేలు), తృతీయ బహుమతి అనిత (రూ.10వేల) అందుకున్నారు. తెల్లాపూర్ పురపాలక కార్యాలయంలో పాలక మండలి సభ్యులతోపాటు ఛైర్మన్ లలిత ఉత్సవాలు నిర్వహించారు.

కమనీయం.. కూచిపూడి నృత్యాభినయం





మాదాపూర్, న్యూస్‌టుడే: ఆహ్లాదకరమైన పల్లె వాతావరణంలో చూడముచ్చటైన శాస్త్రీయ కళాప్రదర్శనలు చూపరులను అలరించాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శిల్పారామంలో కళాకారులు కూచిపూడి నృత్యాంశాలను చక్కటి నృత్యాభినయంతో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కొత్తగూడెం నుంచి విచ్చేసిన కూచిపూడి నాట్యగురువు సీతాప్రసాద్ శిష్యబృందం వినసొంపైన కీర్తనలకు అనుగుణంగా ప్రదర్శించిన శివాష్టకం, నవదుర్గస్తోత్రం, కృష్ణజనన శబ్దం నృత్యాంశాలు కనువిందుగా సాగాయి. అనంతరం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నృత్యవిభాగానికి చెందిన విద్యార్థులు అలరిపు, నర్సింహన్, తిల్లాన అంశాలు ప్రదర్శించి అందరినీ మెప్పించారు.

అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం కావాలి



నియామక ఉత్తర్వులు అందుకోవడానికి వెళ్తున్న అభ్యర్థులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్‌లో రూ.4.77 కోట్లతో చేయనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలన్నారు. కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 మందికి ఉద్యోగాలు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: నియోజకవర్గం నుంచి 30 మందికి ఉపాధ్యాయులుగా అవకాశం లభించిందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయం నుంచి ఎల్బీ స్టేడియం వరకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సు జెండా ఊపి ప్రారంభించారు.

మదిలో భావం.. కాన్వాస్‌పై రూపం







మాదాపూర్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన 21 మంది చిత్రకారులు గీసిన అందమైన చిత్తరువులను బుధవారం సాయంత్రం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యారీలో ప్రదర్శనకు ఉంచారు. చిత్రకారులు తమ మదిలో మెదిలిన భావాలను కాన్వాస్‌పై చూడముచ్చటగా ఆవిష్కరించారు. ప్రకృతి అందాలు, దేవతామూర్తుల, స్వతంత్ర సమరయోధుల చిత్రాలు, చారిత్రక కట్టడాలను రంగురంగుల చిత్రాల్లో అద్భుతంగా ప్రతిబింబింపజేశారు. ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈనెల 13 వరకు ప్రదర్శన కొనసాగనుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ? పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ నుంచి నందిగామ వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. పంట పొలాల దారి కావడం వల్ల చీకట్లో ప్రయాణం చేయలేకపోతున్నాం. – యాదగిరి ఇస్నాపూర్

✓ బహిరంగ సభలో బడ్జెట్ ప్రతిపాదన ప్రవేశపెట్టి వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఇస్నాపూర్

సెంట్రింగ్ కార్మికుడి దారుణ హత్య



మాల్యాద్రి

మియాపూర్, న్యూస్‌టుడే: చందానగర్ ఠాణా పరిధిలో ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆయన ఇంట్లోనే మర్మాంగాల వద్ద కత్తితో పొడిచి హత్య చేశారు. సీఐ పాలవెల్లి వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దారకనిపాడుకు చెందిన తన్నీరు మాల్యాద్రి(38) సెంట్రింగ్ పనులు చేస్తూ శేరిలింగంపల్లి తారానగర్‌లో ఉంటున్నాడు. ఆయనకు భార్యా, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యులు స్వగ్రామంలో బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు గతనెల 30న వెళ్లగా.. మాల్యాద్రి ఒంటరిగానే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న ఆయన్ను గుర్తుతెలియని వ్యక్తులు కిరాతకంగా హత్య చేశారు. ఆయన ఇంటికి సమీపంలో ఉండే సోదరి కుమారుడు వచ్చి పిలిచినా మాల్యాద్రి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో తల్లికి సమాచారం ఇచ్చాడు. ఆమె మాల్యాద్రి సెల్‌ఫోన్‌కు సైతం కాల్ చేసినా స్పందన రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా అప్పటికే హత్యకు గురైనట్లు సోదరితోపాటు స్థానికులు గుర్తించారు. హత్య జరిగిన ఆయన ఇంట్లో సంఘటన ప్రాంతంలో మద్యం బాటిళ్లు ఉండడంతో ఎవరైనా స్నేహితులతో కలిసి మద్యం తాగిన సందర్భంలో గొడవ జరిగి హత్యకు పాల్పడ్డారా? మరేమైనా ఇతర కారణాలున్నాయా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలాన్ని చందానగర్ సీఐ పాలవెల్లి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కలెక్టర్‌కు ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు



పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: గణేశ్ నవరాత్రోత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించటానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్ హరీష్‌ను గణేశ్ భాగ్యనగర్ ఉత్సవ కమిటీ నేతలు బుధవారం సన్మానించారు. అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉత్సవ కమిటీ కన్వీనర్ గిరివర్ధన్‌రెడ్డి, భాజపా నేతలు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్

జీడిమెట్ల ఠాణాకు కంప్యూటర్‌ల వితరణ



జీడిమెట్ల, న్యూస్‌టుడే: జీడిమెట్ల ఠాణాకు ఓ సంస్థ 5 కంప్యూటర్‌లను అందించింది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థెర్మో కేబుల్స్ ప్రతినిధి శర్మ.. రూ.2.5 లక్షల విలువ చేసే కంప్యూటర్లను బుధవారం ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌కి అందించారు. డీఐ కనకయ్య, సెక్టార్ ఎస్సై హరీశ్ ఉన్నారు.

చదువుల తల్లిగా.. కల్పవల్లిగా..

షాపూర్‌నగర్, నిజాంపేట, పేట్‌బషీరాబాద్, కుత్బుల్లాపూర్, దుండిగల్, న్యూస్‌టుడే: దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాజులరామారంలోని చిత్తారమ్మదేవిని తెలుపు రంగు చీరతో సన్నజాజులు, మల్లెపూలతో శ్రీ శ్రీసరస్వతి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి సాయంత్రం జరిగిన కుంకుమార్చలో మహిళలు పాల్గొని కుంకుమపూజ నిర్వహించారు. సరస్వతి పూజలో విద్యార్థులు పాల్గొన్నారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారిని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, గాజులరామారం పరిధి చంద్రగిరినగర్‌లో కార్పొరేటర్ రావుల శేషగిరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.




సాయి అనురాగ్‌కాలనీలో సరస్వతిదేవిగా విజయకనకదుర్గ



సరస్వతీ దేవిగా గాజులరామారం చిత్తారమ్మతల్లి



దండమూడి ఎన్‌క్లేవ్‌లో వేంకటేశ్వరాలయంలో..



ప్రాగాటూల్స్ కాలనీలో దుర్గామాత ఆలయంలో



దూలపల్లి దుర్గామాత ఆలయంలో..



ఎన్సీఎల్ కాలనీ సౌత్ నోబుల్ పార్కులో ఎంపీ ఈటల రాజేందర్, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి తదితరులు



మల్లంపేటలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అనంతస్వామి



కుంకుమార్చన చేస్తున్న మహిళలు



దుండిగల్ పురపాలిక కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఛైర్‌పర్సన్ కృష్ణవేణి



జగద్గిరిగుట్ట పరిధి అంజయ్యనగర్‌లో..



చంద్రగిరినగర్‌లో కార్పొరేటర్ రావుల శేషగిరి ←



దూలపల్లి దుర్గా కాలనీలో.. ←



ఈ టిప్పర్‌లతో తిప్పలే

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం రోడ్డులో భారీబండరాళ్లతో టిప్పర్‌లు ప్రమాదకరస్థితిలో ప్రయాణం చేస్తున్నాయి. ఉదయం రోడ్లపై వీటికి ప్రవేశం లేకపోయినా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా గుంతలరోడ్లపై ప్రయాణం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సెల్లార్‌లు తీసిన సందర్భంగా వచ్చే బండరాళ్లు, మట్టిని గాజులరామారం ప్రాంతంలోని క్వారీగుంతల్లో వేయడానికి నిత్యం వందలాది లారీలు వస్తుంటాయి. అయితే రాత్రిపూట కాకుండా కొందరు దర్జాగా ఉదయం పూట వీటిని తరలిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల కంటపడకుండా టిప్పర్‌లకు కనీసం మూతకూడా లేకుండా తరలిస్తున్నారు. దీంతో పక్కనుంచే వెళ్లే వాహనదారులు ఎప్పుడు బండరాళ్లు కిందపడతాయోననే భయంతో ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఇటువంటి లారీలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
షాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

పేట్‌బషీరాబాద్, షాపూర్‌నగర్, న్యూస్‌టుడే

? కొంపల్లి సర్వే నంబరు 94 కల్లు కాంపౌండ్ ఎదుట విద్యుత్తు స్తంభం ఒరిగి ఉంది. ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
– జంద కృష్ణగౌడ్, కొంపల్లి.

✓ నాలుగైదు రోజుల్లో స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తాం.
– వినాయక్ రాథోడ్, ఏఈ కొంపలి.

? గాజులరామారం రోడ్డులోని రాంకీ అపార్ట్‌మెంట్స్ కూడలి వద్ద పైప్‌లైన్ పనులు పూర్తయి వారం గడుస్తున్నా రోడ్డుపై అడ్డంగా ఉన్న సిమెంటు పైపులను తరలించడం లేదు.
– కలూరాం చౌదరి, గాజులరామారం

✓ వెంటనే పైపులను తరలించేలా చర్యలు తీసుకుంటాం.
– కళ్యాణ్, ఏఈ గాజులరామారం

అలరించిన భక్తి గీతాలాపన



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వైఆర్ఎం మ్యూజిక్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి శాంతినగర్ భారత్ వికాస్ పరిషత్ సత్సంగ మందిరంలో భక్తి గీతాలాపన జరిగింది. వై.లక్ష్మీరమ, విద్యార్థులు పలు భక్తిగీతాలతో అతిథులను అలరించారు. అనంతరం పాటలు పాడిన విద్యార్థినులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. త్యాగరాజ ప్రభుత్వ మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ్ ముతాలిక్, ప్రభాకర్, పార్థసారథి, సైకాలజిస్టు నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరంతా నేలపాలు

పేట్‌బషీరాబాద్, షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ పరిధిలో గోదావరి పైపులైన్లకు ఏర్పడిన లీకేజీలతో విలువైన తాగునీరంతా నేలపాలవుతోంది. పైపులైన్లకు లీకేజీలున్నాయని జలమండలి అధికారులు ఎం.ఎన్.రెడ్డినగర్ కాశీవిశ్వేశ్వర దేవాలయ సమీపంలో ఇటీవల 10 చోట్ల గుంతలు తీశారు. 3 వారాలుగా మరమ్మతులు చేశారు. తిరిగి బ్యాంక్ కాలనీ, వెంకటేశ్వరకాలనీలో అదే పరిస్థితి. నీటి సరఫరా సమయంలో వాల్వ్‌ల వద్ద నీరంతా వృథాగా పోతోంది. అధికారులు వాల్వ్‌ల వద్ద మరమ్మతులు చేయాల్సి ఉంది. ఆ దిశగా చేయకపోవటం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది. కుత్బుల్లాపూర్ గ్రామం నుంచి విమానపురి కాలనీకి వెళ్లే దారిలో నాలుగైదు చోట్ల కాలుష్యాన్ని గుర్తించటం కోసం తవ్వి వదిలేశారు. జలమండలి అధికారుల పర్యవేక్షణ లేక నెహ్రూనగర్ వద్ద లీకేజీకి మరమ్మతులు చేసిన మరునాడే లీకేజీ ఏర్పడింది. దీంతో జలమండలి విజిలెన్స్ అధికారులు సందర్శించి గుత్తేదారుపై చర్యలు తీసుకుని పనులు చేయించారు. పనులు సరిగా చేయకుండా బిల్లులు చెల్లిస్తుండటంతో ప్రజాధానం వృథా అవుతోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో తవ్వకాలు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీఆర్ఎంపీ రోడ్లను తవ్వడానికి అనుమతులు ఇవ్వకపోవడంతో రాత్రిపూట పనులు చేస్తున్నారు. దీంతో లీకేజీలకు అడ్డుకట్టవేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

లీకేజీలు జరుగుతున్న ప్రాంతాలు

- జీడిమెట్ల గ్రామానికి వెళ్లే దారి గాంధీ విగ్రహం వెనుక భాగం.
- కుత్బుల్లాపూర్ గ్రామం భూమిరెడ్డి కాలనీ.
- కుత్బుల్లాపూర్ గార్డెన్ బస్తీ.
- స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ ప్రకృతి రెసిడెన్సీ అపార్టుమెంట్స్ ఎదురుగా.
- హెచ్ఏఎల్ రాఘవేంద్రకాలనీ కమాన్‌కు ఎదురుగా.
- పేట్‌బషీరాబాద్ పైపులైను రోడ్డు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ వద్ద
- గోదావరిహోమ్స్ కాలనీ ఎస్బీఐ బ్యాంక్ ఎదురుగా.
- రాఘవేంద్రకాలనీ శివాజీ విగ్రహం సమీపంలో
- పేట్‌బషీరాబాద్ పైపులైను రోడ్డు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ వద్ద
- ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో.
- గాజులరామారం రోడ్డులో, నెహ్రూనగర్ కూడలిలో రెండుచోట్ల, శ్రీనివాసనగర్ కాలనీ కూడలి, గాజులరామారం కూడలి, ఉషాముళ్లపూడి ఆసుపత్రి వద్ద.



స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీకి వెళ్లే దారిలో మూలమలుపు వద్ద తవ్విన గొయ్యి



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డుపై పారుతున్న తాగునీరు

తప్పిపోయిన చిన్నారి దొరికింది



జీడిమెట్ల, న్యూస్‌టుడే: ఓ చిన్నారి ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేందుకు దారి తెలియక మరో మార్గంలో పోయింది. కుటుంబికులు చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో జీడిమెట్ల పోలీసుల్ని ఆశ్రయించారు. వేగంగా స్పందించిన డీఐ కనకయ్య సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి తీసుకొచ్చి కుటుంబికులకు అప్పగించారు. టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన షేక్ మూస, రషీద ఉపాధి కోసం కువైట్ వెళ్లారు. వారి కుమార్తె మహీన్ (8) కాలనీలోని బంధువుల వద్ద ఉంటోంది. బుధవారం రాత్రి ఇంటి బయట ఆడుకుంటూ సూరారం వైపు నడుచుకుంటూ వెళ్లిపోయింది. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు జీడిమెట్ల బస్సు డిపో వద్ద ఉన్నట్లు గుర్తించారు.



గేటెడ్ కమ్యూనిటీలో చెట్ల నరికివేత



జీడిమెట్ల, న్యూస్‌టుడే: పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఓవైపు ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనంలాంటి కార్యక్రమాలతో మొక్కలను పెంచుతోంది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఓ గేటెడ్ కమ్యూనిటీ నిర్వాహకులు ఏకంగా భారీ వృక్షాలను పూర్తిగా నేలమట్టం చేశారు. చింతల్ డివిజన్ స్టార్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికి వేసినట్లు పర్యావరణ ప్రేమికులు గుర్తించారు. బుధవారం అటవీ అధికారులకు సమాచారం అందడంతో సిబ్బంది వచ్చి కొట్టివేసిన చెట్లను పరిశీలించారు. అనుమతి తీసుకొని తొలగించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నా తమకు ఎలాంటి అనుమతి పత్రాలను చూపించలేదని అధికారులు చెబుతున్నారు. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

నృత్య దర్శకుడు జానీ పిటిషన్‌పై తీర్పు 14న

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీ పెట్టుకున్న బెయిలు పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. కోర్టు అనుమతించిన నాలుగు రోజుల మధ్యంతర బెయిలును నిందితుడే ఉపసంహరించుకున్న నేపథ్యంలో బుధవారం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. తీర్పు కోసం విచారణను న్యాయస్థానం వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

